

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

వరంగల్ : fb.com/vaartha Digital

Published from Warangal, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

9-1-2026 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 339 పేజీలు: 10+4 వెల: 6.50


**6 కార్పొరేషన్లు, 117 మున్సిపాలిటీలకు ఎన్నికలు** 7

**మరో రూ.9600 కోట్ల రుణానికి ఇండెంట్**


CBC 47107/13/0017/2526

వికసిత భారత్ యువ నాయకుల సంభాషణ 2026

09వ-12వ జనవరి | భారత్ మండపం, న్యూఢిల్లీ

To watch the Event Live Visit DD News or scan the QR code

యువ నాయకులతో సంభాషించడానికి

ప్రధాని నరేంద్ర మోదీ

యువ నాయకులను ఉద్దేశించి ప్రధానమంత్రి ప్రత్యేక ప్రసంగం

కార్యక్రమ తేది : 12వ జనవరి 2026 | సమయం : సా.04.00 గం. తర్వాత

వేదిక : భారత్ మండపం, న్యూఢిల్లీ




## వ్యవసాయ సంస్థల మెగా విలీనం




### సహకార వ్యవస్థలూ పునర్వ్యవస్థీకరణ

### ఏకీకృత వ్యవస్థలుగా మార్పు

### సామర్థ్యం పెంపు, ఖర్చుల తగ్గింపే లక్ష్యం

### రాష్ట్ర సర్కార్ కీలక నిర్ణయం

### చివరి దశకు వ్యవసాయ శాఖ వివరణాత్మక నివేదిక

**హైదరాబాద్, జనవరి 8, ప్రభాతవార్త:** ప్రధాన నిర్మాణాత్మక సవరణలో భాగంగా వ్యవసాయ సంస్థల సామర్థ్యాన్ని మెరుగుపరచడం, పరిపాలనా పరమైన ఖర్చులను తగ్గించడం లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందుకు అన్ని రాష్ట్ర స్థాయి వ్యవసాయ సంస్థలను ఒకే ఏకీకృత సంస్థగా విలీనం చేయడాన్ని చురుకుగా పరిశీలిస్తోందని వ్యవసాయ శాఖ అధికారవర్గాలు చెబుతున్నాయి. ఇది రైతులకు ప్రయోజనకారిగా ఉండేలా కార్యకలాపాలను క్రమబద్ధీకరిస్తుందని, ప్రస్తుతం ఈ సంస్థలు ఎదుర్కొంటున్న ఆర్థిక ఒత్తిడిని కూడా పరిష్కరిస్తుందని భావిస్తున్నాయి. ఈ ప్రతిపాదిత ఏకీకరణపై వివరణాత్మక నివేదికను సిద్ధం చేయడంలో వ్యవసాయ శాఖ చివరి దశకు చేరుకుంది. రైతులకు సేవలను అందించడంలో సంస్థాగత ప్రభావాన్ని పెంపొందించడానికి విస్తృత వ్యూహంలో భాగంగా ఈ చర్య తీసుకున్నట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.ప్రభుత్వ నిర్ణయాన్ని మార్గనిర్దేశం చేయడానికి సీనియర్ అధికారులు కార్యాచరణ నమూనా, ఆర్థిక, లాభనష్టాల స్థితిని అంచనా వేస్తూ సమగ్ర నివేదికను రూపొందిస్తున్నారు. తుది నివేదికను సమీక్షించిన తర్వాత, ప్రతి పాదిత విలీనంపై ప్రభుత్వం ఆమోదం తీసుకుంటుందని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. కాగా >>2

## విబిజి రామ్ జి చట్టంపై పోరుబాట



గురువారం పిసిసి విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న సిఎం రేవంత్. చిత్రంలో డిసిఎం భట్టి, పిసిసి చీఫ్

### ఫిబ్రవరి 3 నుంచి 9 వరకు సిఎం రేవంత్ బహిరంగ సభలు

### గాంధీ పేరు తొలగింపుపై మోడీతో క్షమాపణలు చెప్పిస్తాం

### 20 నుంచి గ్రామ సభలు.. ములుగు సభకు ప్రియాంక, రాహుల్

### మోడీ ప్రభుత్వం ఇష్టారీతిన వ్యవహరిస్తామంటే అంగీకరించం

### పిసిసి విస్తృత స్థాయి సమావేశంలో సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి8:** మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మార్పు వెనక ప్రధాని నరేంద్ర మోదీ కుట్ర ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. పేదలపై కక్షతో ఈపథకాన్నే మారుస్తారా? అని ప్రశ్నించారు. >>2



యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో బాలికలకు ప్రాధాన్యం

గురువారం విద్యాశాఖపై సమీక్షలో మాట్లాడుతున్న సిఎం రేవంత్

## స్కూళ్లలో బ్రేక్‌ఫాస్ట్

### భవిష్యత్ అవసరాలకు తగినట్లు సిలబస్

### విద్యా శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి8:** యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ (వైఐఐఆర్‌సీ) మొదటి విడతలో పూర్తయ్యే వాటిలో బాలికలకు ఎక్కువ స్కూల్స్ కేటాయించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. రానున్న మూడేళ్లలో ప్రతి నియోజకవర్గంలోనూ బాలురు, బాలికలకు ఒకొక్కటి చొప్పున వైఐఐఆర్‌సీ నిర్మాణాలు పూర్తి చేయాల్సిందేనన్నారు. ప్రస్తుతం బాలికలకు స్కూల్స్ కేటాయించిన నియోజకవర్గంలో మరో విడతలో బాలురకు కేటాయించాలన్నారు. విద్యా శాఖపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ >>2

## జనగణన

### ఏప్రిల్ నుంచి తొలి దశ ప్రారంభం

### కేంద్ర హోం శాఖ ప్రకటన

**న్యూఢిల్లీ, జనవరి 8:** దేశంలో తొలిసారిగా డిజిటల్ విధానంలో జరగనున్న జనగణనకు రంగం సిద్ధమైంది. దేశంలో జనగణన సెన్సస్2027 తొలి విడతలో భాగంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు ఇళ్ల వివరాలను సేకరించనున్నట్లు కేంద్ర హోంశాఖ వెల్లడించింది. ప్రతి రాష్ట్రానికి 30 రోజుల వ్యవధి ఉంటుందని పేర్కొంది. ఇందుకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసింది. 30 నుంచి 34 లక్షలమంది క్షేత్రస్థాయి సిబ్బందిని సిద్ధంచేయాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది.



మంచుమయ ప్రాంతాల్లో జనాభా లెక్కల ప్రక్రియను 2026 సెప్టెంబరు నుంచి అక్టోబరు 1 వరకు నిర్వహించనున్నారు. మంచుతోకూడిన పర్వత ప్రాంతాల జాబితాలో జమ్మూకశ్మీర్, లద్దాఖ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లు ఉన్నాయి. దేశంలోని అన్ని ఇతర ప్రాంతాల్లో జనగణన 2027 ఫిబ్రవరి నుంచి మార్చి 1 వరకు జరుగుతుంది. పదేళ్లకోసారి దేశవ్యాప్తంగా నిర్వహించే జనగణన 2021లో చేపట్టాల్సి ఉండగా, కొవిడ్ కారణంగా >>2



## ప్రధాని మోడీ ఆస్తులెన్నంటే!

**2014లో రూ. 1.65 కోట్లు**

**2026లో రూ. 3.02 కోట్లు**

**80 శాతం పెరిగిన సంపద**

రాహుల్ ఆస్తుల్లోనూ మార్పులు

ఎంపిల ఆస్తులు పదేళ్లలో 110 శాతం పెరుగుదల 2

## మున్సి'పోల్స్'కు పార్టీలు రెడీ

### మున్సిపల్ ఎన్నికల వేళ కదులుతున్న రాజకీయ పార్టీలు

### కెసిఆర్ కంటే ముందే కాంగ్రెస్ బహిరంగ సభల ఏర్పాట్లు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి8:** రాష్ట్రవ్యాప్తంగా మూడు దశల్లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ సత్తా చాటింది. మరికొన్ని రోజుల్లో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు కదులుతున్నాయి. ఈ ఎన్నికల్లో సైతం ప్రభంజనం సృష్టించాలని కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అలాగే ప్రభుత్వంపై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టే లక్ష్యంతో అధికార కాంగ్రెస్ పార్టీ సంచలన నిర్ణయం తీసుకుంది. తెలంగాణలోని తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లో భారీ బహిరంగ సభలు నిర్వహించనుంది. ఫిబ్రవరి 3 నుంచి 9వ తేదీ వరకు ఈ బహిరంగ సభలు నిర్వహించాలని తేదీలను ఫిక్స్ చేసింది. ఈ బహిరంగ సభల సమన్వయ బాధ్యతను రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి అప్పగించింది. వీటిని పర్యవేక్షించే బాధ్యతను రాష్ట్ర పార్టీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌తోపాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు కట్టబెట్టింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ములుగు వేదికగా నిర్వహించే బహిరంగ సభకు పార్టీ అగ్రనేతలు సోనియా, రాహుల్ గాంధీలను ఆహ్వానించాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం భావిస్తోంది. మండలాల్లో సైతం ఈ సభలను విస్తృతంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఇప్పటికే ఒక మండలం బాధ్యతను తాను >>2



గురువారం హైదరాబాద్‌లో రాజకీయపార్టీల నేతలతో సమావేశమైన ఎస్ఇసి కుముదిని

### ఓటరు మ్యాపింగ్, ధ్రువీకరణ మెరుగుదలకు చర్యలు 7

**బిఎల్‌ఒల ఫోన్ నంబర్లకు విస్తృత ప్రచారం కల్పించండి: సిఇఒ**

## మిర్జాగూడ వద్ద ఘోర ప్రమాదం

### చెట్టును ఢీకొన్న స్పోర్ట్స్ కారు..

### నలుగురు విద్యార్థుల మృతి 2



## అంతరిక్షంలో డేటా సెంటర్లు 2

### ఇస్రో ముమ్మర కసరత్తు

### చైర్మన్ నారాయణన్ వెల్లడి

**బెంగళూరు, జనవరి 8:** భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో అంతరిక్షంలో డేటా సెంటర్లను ఏర్పాటు చేయాలని యోచిస్తోంది. ఆ ప్రణాళికను అమలు చేసేందుకు ఇస్రో ఓ కార్యాచరణ చేపట్టినట్లు తెలుస్తోంది. భూ కక్ష్యలో ఫిజికల్‌గా డేటా సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు ఇస్రో చైర్మెన్ వీ నారాయణన్ >>2



గురువారం కెసిఆర్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న మంత్రులు సీతక్క, సురేఖ

## బాగున్నారా.. అమ్మ!

### మంత్రులు సీతక్క, సురేఖకు కెసిఆర్ ఆత్మీయ పలకరింపు


### మేడారం జాతర ఆహ్వానం అందజేసిన మంత్రులు

### ఎర్రవెల్లిలో పసుపు, కుంకుమలు చీర, తాంబూలాలతో మంత్రులకు సత్కారం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్ / మర్కుల్, జనవరి8:** తన ఇంటికి వచ్చిన మహిళా మంత్రులకు బిఆర్ఎస్ అధినేత, మాజీ సిఎం కల్వకుంట్ల చంద్ర శేఖర్ రావు ఆత్మీయ ఆహ్వానం పలికారు. రాష్ట్ర దేవదాయ ధర్మదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి సీతక్క గురువారం ఎర్రవెల్లి(ఫామ్‌హౌస్) నివాసంలో ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. మరికొద్ది రోజుల్లో, మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ప్రారంభం కానున్న సందర్భంగా, జాతరను సందర్శించాల్సిందిగా కోరుతూ కేసీఆర్‌ను ప్రభుత్వం >>2

## గుజరాత్‌లో కిషన్‌రెడ్డి

### పటేల్ విగ్రహాన్ని సందర్శించిన కేంద్ర బొగ్గు శాఖ మంత్రి




**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద, జనవరి8:** కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి గురువారం గుజరాత్‌లో పర్యటించారు. అక్కడ స్టాచ్యూ ఆఫ్ ఈక్వల్ సర్దార్ వల్లభబాయి పటేల్ విగ్రహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. జాతీయ సమైక్యతకు స్ఫూర్తిని అందించిన వల్లభ బాయి పటేల్‌కు సంబంధించిన చరిత్ర విషయాలను మరోసారి తెలుసుకున్నారు. అధికారులతో ఆ స్టాచ్యూ ఆఫ్ ఈక్వల్ పటేల్ విగ్రహం రూపకల్పన ప్రాజెక్టు నిర్మాణం, వ్యవహారాల నియంత్రణ, పర్యాటకుల సందడి రాష్ట్ర ప్రభుత్వానికి సమకూరుతున్న ఆదాయంతదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఫోటోలను ట్విట్టర్ ద్వారా పంచుకున్నారు.

## బిఎస్సీ అగ్రి ప్రశ్నపత్రం లీక్

### ప్రొ.జయశంకర్ వర్సిటీలో కలకలం

### విచారణకు ఆదేశం.. నలుగురు సస్పెన్షన్

### 35 మంది ఇన్ సర్వీస్ బిఎస్సీ అగ్రికల్చర్ అభ్యర్థుల డిస్మిస్




**హైదరాబాద్ జనవరి8,ప్రభాతవార్త:** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం లో మూడవ సంవత్సరం బీ ఎస్సీ(అగ్రికల్చర్) కోర్సు చదువుతున్న సుమారు 35 మంది ఇన్ సర్వీస్ అభ్యర్థుల ప్రవేశాలను రద్దు చేసి, వారిని తిరిగి వ్యవసాయ శాఖ కి పంపిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, ఇతర అధికారుల తో కలసి జగిత్యాల వ్యవసాయ కళాశాల ని సందర్శించారు. వివిధ రకాల రికార్డుల పరిశీలన,సీసీ ఫుటేజ్‌ల ఆధారంగా సెమిస్టర్ ఫైనల్ పరీక్షల ప్రశ్న పత్రాలు లీకు అవుతున్నట్లు అనుమానించారు.. ఈ అంశాన్ని సమగ్రం గా విచారణ చేసేందుకు ముగ్గురు అధికారుల తో కమిటీని నియమించారు. ఈ కమిటీ అన్ని కోణాల నుంచి విచారణ నిర్వహించింది. వ్యవసాయ శాఖ లో ఏ ఈ ఓ లుగా పని చేస్తూ వ్యవసాయ వర్సిటీ లో ఇన్ సర్వీస్ కోటా లో 3 వ ఏడాది బీ ఎస్సీ అగ్రికల్చర్ చదువుతున్న సుమారు >>2

### టెట్‌పై సుప్రీంకోర్టు తీర్పు: నష్టపోయే టీచర్ల వివరాలివ్వండి

16లోగా ఇవ్వాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కేంద్రం లేఖ 3



## ఐప్యాక్ సంస్థల్లో ఇడి సోదాలు

ప్రతీక్‌జైన్ ఇంట్లో అధికారులతో మమతా బెనర్జీ వాగ్వాదం

కీలక దస్త్రాలు తీసుకెళ్లారని ఇడి ఆరోపణ

మోడీ, అమిత్‌షాలపై మమత ఆగ్రహం

టిఎంసి, బిజెపిల మధ్య మాటల యుద్ధం 2



గురువారం న్యూఢిల్లీలో గణతంత్ర దినోత్సవ రిహార్సల్‌ను నిర్వహించిన పోలీసులు

## అంతరిక్షంలో డేటా సెంటర్లు

>> వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న అంతరిక్ష శాఖ కూడా ఈ విషయాన్ని స్పష్టం చేసింది. లో ఎర్త్ ఆర్బిట్‌లో డేటా సెంటర్లను నిర్మించేందుకు ప్లాన్ చేస్తున్నారు. భూమి నుంచి సుమారు 200 నుంచి 2000 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న కక్ష్యలో లేదా 36 వేల కిలోమీటర్ల ఎత్తు వరకు ఉన్న జియోస్టేషనరీ కక్ష్యలో ఆ డేటా సెంటర్లను ఏర్పాటు చేసే యోచనలో ఇస్రో ఉన్నది. స్పేస్ డేటా సెంటర్లలో కంప్యూటింగ్ హార్డ్‌వేర్, స్టోరేజ్ సిస్టమ్స్, కమ్యూనికేషన్ ఎక్విప్మెంట్‌ను ఫిక్స్ చేయనున్నారు. భవిష్యత్తుకు కావాల్సిన టెక్నాలజీ కేంద్రాలను నిర్మించాలన్న ఉద్దేశంతో అంతరిక్షంలో డేటా ప్రాసెసింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ఇస్రో చీఫ్ వీ నారాయణన్ తెలిపారు. అయితే ప్రస్తుతం ప్రాథమిక పనులు మాత్రమే జరిగినట్లు చెప్పారు. ప్రస్తుతం శాటిలైట్లు కేవలం డేటా సేకరణకు మాత్రమే పనిచేస్తున్నాయి. ఇమేజ్‌లు, సిగ్నల్స్ అందుకున్న ఆ ఉపగ్రహాలు ఆ తర్వాత గ్రౌండ్ స్టేషన్‌లో డౌన్‌లింక్ అవుతున్నాయి. అక్కడ వాటికి ప్రాసెసింగ్ జరుగుతుంది. అయితే స్పేస్‌లో డేటా సెంటర్ల ఏర్పాటుతో కొత్త ఒరవడికి ఇస్రో శ్రీకారం చుట్టనున్నది. ఆన్ బోర్డ్ ప్రాసెసింగ్ తో పాటు శాటిలైట్ కమ్యూనికేషన్ డేటా స్టోరేజ్ చేయనున్నారు. కక్ష్యలోనే శాటిలైట్ డేటాను రీకాన్ఫిగరేషన్ చేసే ప్రక్రియపై ఇస్రో దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. మీడియాకు ఇంటర్వ్యూలో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ కూడా ఈ విషయాన్ని వెల్లడించారు. అపరిమితమైన సౌరశక్తిని వినియోగించే ఉద్దేశంతో డేటా సెంటర్లను అంతరిక్షంలో ఏర్పాటు చేయాలని టెకీ కంపెనీలు, అంతరిక్ష సంస్థలు భావిస్తున్నాయి.

### పిఎస్ఎల్‌వి-సి62

## ప్రయోగ సన్నాహాలు

### తుది దశకు అనుసంధాన కార్యక్రమాలు

**సూళ్లూరుపేట, జనవరి 8 ప్రభాతవార్త:** ఎల్‌విఎం3-ఎం6 భారీ విజయం తర్వాత మరో గఘన విజయానికి ఇస్రో సిద్ధమవుతోంది. పిఎస్ఎల్‌వి-సి62 రాకెట్ ద్వారా జనవరి 12న ఉదయం 10 గంటల 17 నిముషాలకు అన్వేష్ (ఇఓఎస్-ఎన్1) ఉపగ్రహాన్ని నింగిలోకి పంపనున్నది. దీనితో పాటు మరో 15 వాణిజ్య ఉపగ్రహాలను కూడా రోదశిలోకి ప్రవేశపెట్టనున్నారు. ఇందుకు సంబంధించి శ్రీహరికోటలోని ఇంటిగ్రేషన్ ఫెసిలిటి భవనం (పిఐఎఫ్)లో రాకెట్ అనుసంధాన కార్యక్రమాలు తుది దశకు చేరుకున్నాయి. ఈ ప్రయోగంలో 1,485 కేజీల బరువు ఉన్న అన్వేష్ ఉపగ్రహాన్ని ప్రయోగిస్తున్నారు. ఇది అత్యంత కీలకమైన ఉపగ్రహం. ఇప్పటివరకు భారత రక్షణ వ్యవస్థకు మూడోనేత్రంలా పనిచేసే భూపరిశీలన ఉపగ్రహాలను అనేకం ఇస్రో అంతరిక్షంలోకి పంపి ఉంది. భూపరిశీలన చేసిన తర్వాత సమాచారాన్ని భూమికి చేరవేసే ప్రక్రియను దృష్టిలో ఉంచుకుని ఈ ఉపగ్రహానికి అన్వేష్ అనే నామకరణం చేశారు. ఈ ఉపగ్రహం సైనిక అవసరాల నిఘా నిమిత్తం భూమికి 600 కిలోమీటర్ల ఎత్తులో పరిభ్రమిస్తూ సమాచారాన్ని భూతలంలోని కంట్రోల్ సెంటర్‌కు చేరవేస్తుంది. ఈ ప్రయోగంలో స్పానిష్‌కు చెందిన స్టార్టప్ ఆర్బిటల్ పారడైజ్ భాగస్వామ్యంతో నిర్మించిన 25 కేజీల బరువు గల క్రిస్టల్ ఇనిషియల్ డెమానుస్ట్రేటర్ (కెఐడి) క్యాప్సూల్‌ను ప్రయోగాత్మకంగా పరీక్షించనున్నారు. ప్రయోగాత్మకంగా ప్రయోగించిన క్యాప్సూల్‌ను తిరిగి భూవాతావరణంలోకి ప్రవేశించడం కోసం దక్షిణ పసిఫిక్ మహాసముద్రంలో ఓ స్మాష్ డౌన్ జోన్‌ను గుర్తించారు.

## మిర్జాగూడ వద్ద ఘోర ప్రమాదం

### చెట్టును ఢీకొన్న స్పోర్ట్స్ కారు..

### నలుగురు విద్యార్థుల మృతి

**శంకర్‌పల్లి, జనవరి 8, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లాలో గురువారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మోకిల పోలీస్ స్టేషన్ పరిధిలోని మిర్జాగూడ వద్ద వేగంగా వెళ్తున్న ఓ స్పోర్ట్స్ కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు విద్యార్థులు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. పోలీసుల కథనం ప్రకారం.. మృతులు శంకర్‌పల్లిలోని విద్యార్థులుగా గుర్తించారు. మృతులను సూర్యతేజ, సుమిత్, శ్రీ నిఖిల్, రోహిత్ అని ధృవీకరించారు. కారు అతివేగంతో ప్రయాణిస్తుండటమే ప్రమాదానికి ప్రాథమిక కారణంగా తెలుస్తోంది. చెట్టును ఢీకొన్న ధాటికి కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాలను వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు, తోటి సహచరులు భారీ సంఖ్యలో ఆసుపత్రికి చేరుకున్నారు. కన్నబిడ్డల మృతదేహాలను చూసి వారు గుండెలవిసేలా విలపిస్తున్న తీరు అక్కడి వారిని కన్నీరు పెట్టించింది. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మోకిల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అతివేగం వల్ల ప్రమాదం జరిగిందా లేదా ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు.

# జనగణన

>> వాయిదా పడింది. తాజాగా దీనిని చేపట్టాలని నిర్ణయించిన కేంద్రం, రెండు దశల్లో నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. తొలిదశలో హౌస్ లిస్టింగ్, గణన 2026 ఏప్రిల్ -సెప్టెంబరు), రెండో దశలో జనాభా లెక్కల సేకరణ (2027 ఫిబ్రవరి- మార్చి 1)ను నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ దఫా జనాభా లెక్కింపు డిజిటల్ విధానంలో నిర్వహించనున్నట్లు కేంద్రం ఇప్పటికే ప్రకటించింది. మొబైల్ యాప్‌ల ద్వారా జనాభా లెక్కల సమాచారాన్ని సేకరిస్తామని, స్వీయ గణనకు ఇదెంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొంది. మరోవైపు, జనగణనతోపాటే కుల గణనను కూడా చేపట్టనున్నట్లు కేంద్ర ప్రభుత్వం స్పష్టంచేసింది. అంతకుముందు యావత్ దేశంలోని ఇళ్ల వివరాలను ఎలా సేకరించాలి ఇందుకోసం ఏ విధమైన మార్గదర్శకాలను అనుసరించాలి మానవ వనరులను వాడుకోవాలన్న దానిపై ప్రీటెస్ట్‌లో ముమ్మర కసరత్తు చేశారు. పారదర్శకంగా ఇళ్ల వివరాల సేకరణకు అనుసరించాల్సిన మార్గాలపై అన్ని రాష్ట్రాలు, జిల్లాలు, ఉప జిల్లాల స్థాయిలోని అధికార వర్గాలతో లోతుగా చర్చించారు. ఇళ్ల సమాచారాన్ని సేకరించడానికి లక్షలాది మానవ వనరులను మోహరించడంపైనా సమగ్ర ప్రణాళికను సిద్ధం చేశామని అధికార వర్గాలు ఇప్పటికే వెల్లడించాయి. డిసెంబరు ప్రారంభంలోనే ప్రీటెస్ట్ ముగిసిందని తెలిపాయి.

## ప్రధాని మోడీ ఆస్తులెన్నంటే!

### 2014లో రూ. 1.65 కోట్లు

### 2026లో రూ. 3.02 కోట్లు

### 80 శాతం పెరిగిన సంపద

### రాహుల్ ఆస్తుల్లోనూ మార్పులు

### ఎంపిల ఆస్తులు పదేళ్లలో 110 శాతం పెరుగుదల

**న్యూఢిల్లీ, జనవరి 8:** దేశంలో ఎంపీల ఆస్తులు భారీగా పెరిగాయి. అదే సమయంలో గడచిన పదేండ్లలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆస్తులు కూడా దాదాపు 80 శాతం పెరిగింది. ఈ మేరకు ఏడీఆర్ నివేదిక వెల్లడించింది. సదరు నివేదిక ప్రకారం 2014లో ఎంపీగా పోటీ చేసిన సమయంలో దాఖలు చేసిన అఫిడవిట్ ప్రకారం ప్రధాని తన ఆస్తుల విలువ రూ.1.65 కోట్లుగా ప్రకటించారు. ఈ పదేండ్లలో మోదీ ఆస్తుల విలువ భారీగా పెరిగింది. దాదాపు 80 శాతం వృద్ధి కనిపించింది. ప్రస్తుతం ప్రధాని ఆస్తుల విలువ రూ.3,02,06889కు చేరింది. ప్రధానంగా ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బ్యాంక్ నిల్వల రూపంలోనే ఈ ఆస్తులు ఉన్నాయి. ఇక ప్రధానికి సొంతంగా కారు గానీ, ఇతర స్థిరాస్తులు గానీ లేవు. ఈ పదేండ్లలో మోదీ ఆస్తుల్లో వృద్ధి నమోదైనప్పటికీ దేశంలోని ఎంపీలతో పోలిస్తే పూరెస్ట్ పర్సన్ కావడం గమనార్హం. అదే సమయంలో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆస్తుల్లో కూడా భారీ మార్పులు కనిపిస్తున్నాయి. 2014 ఎన్నికల సమయంలో రాహుల్ ఆస్తుల విలువ రూ.9.4 కోట్లుగా ఉంది. 2024 నాటికి అది రూ.20.39 కోట్లకు పెరిగింది. ఈ పదేండ్ల కాలంలో ఆయన సంపద దాదాపు 117 శాతం వృద్ధి చెందింది. రాహుల్ గాంధీ పెట్టుబడులు ప్రధానంగా షేర్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్ మరియు స్థిరాస్తుల రూపంలో ఉన్నట్లు ఏడీఆర్ నివేదిక వెల్లడించింది. ఇక దేశంలో పదేండ్ల పాటు ఎంపీలుగా కొనసాగుతన్న వారి ఆస్తులు సుమారు 110 శాతం మేర పెరిగినట్లు సదరు నివేదిక పేర్కొంది. ఎంపీల సంపద వృద్ధిపై ఏడీఆర్ నివేదిక ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది.




# విబిజి రామ్ జి చట్టంపై పోరుబాట

>> నిబంధనల ముసుగులో ఈ పథకాన్ని శాశ్వతంగా సమాధి చేయడానికి కుట్ర చేస్తున్నారని తెలిపారు. మెజారిటీ ఉందని, చట్టసభలను వినియోగించి పేదలను అణచివేస్తామంటే కుదరదని అన్నారు. గురువారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ పీసీసీ విస్తృతస్థాయి సమావేశంలో రేవంత్ రెడ్డి మాట్లాడారు. అధికారం ఉందని మోదీ ప్రభుత్వం ఇష్టారీతిన వ్యవహరిస్తామంటే ఒప్పుకోమని రేవంత్ రెడ్డి అన్నారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రను అడ్డుకోవాల్సిన సమయం ఇదేనన్నారు. ఉపాధి హామీ పథకంతో ఎన్నో విప్లవాత్మక మార్పులు వచ్చాయని, ఉపాధి హామీ పథకం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని తెలిపారు. ఒకప్పుడు దొరల దగ్గర పేదలు వెట్టిచాకిరి చేస్తూ బతికేవారని, దేశప్రజలకు విముక్తి, స్వతంత్రాన్ని ఇచ్చి ఓటుహక్కు కల్పించింది కాంగ్రెస్ పార్టీ అని పేర్కొన్నారు.

2024 ఎన్నికల్లో తమకు 400 సీట్లు ఇవ్వాలని బీజేపీ నేతలు ప్రచారం చేశారని సీఎం గుర్తు చేశారు. బీజేపీకి 400 సీట్లు ఇచ్చి ఉంటే రాజ్యాంగాన్ని మార్చేసేవారని అన్నారు. రాజ్యాంగాన్ని మార్చడం ద్వారా పేదల హక్కులు కాలరాయాలని చూశారని, కార్పొరేట్లకు దేశాన్ని అప్పగించే ప్రయత్నం చేశారని విమర్శించారు. ప్రజలను కాంగ్రెస్ అప్రమత్తం చేయడం వల్ల బీజేపీకి సీట్లు తగ్గాయని, బీజేపీ 240 సీట్ల వద్ద ఆగిపోయిందని తెలిపారు. 400 సీట్లు రాకపోవడం వల్ల రాజ్యాంగాన్ని మార్చాలనే ఆలోచన వాయిదా పడిందని, రాజ్యాంగాన్ని మార్చలేకపోయారు కానీ వేరే రూపంలో హక్కులు కాలరాస్తున్నారని పేర్కొన్నారు. ఓట్లను తొలగించేందుకు ఎస్ఐఆర్ తీసుకొచ్చారని, ఓటు హక్కు పోతే ఆధార్ కార్డు, సంక్షేమ పథకాలు పోతాయని, ఎస్ఐఆర్ వెనక పెద్ద కుట్ర ఉందని తెలిపారు. ఓటు ప్రక్షాళన పేరు సర్ అనే కార్యక్రమాన్ని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చింది..సర్ పేరుతో పేదలు, మైనార్టీల ఓటు హక్కు ను తొలగించే ప్రయత్నం జరుగుతోంది,.దేశంలో ఉండాలా లేదా అన్నది బీజేపీ చేతిలో ఉండేలా ప్రయత్నాలు జరుగుతున్నాయి..ఓటు ప్రక్షాళన వెనుక పెద్ద కుట్ర ఉందన్నారు. మెజారిటీ ఉందన్న కారణంతో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇష్టానుసారంగా వ్యవహరిస్తే అంగీకరించేది లేదని ఆయన స్పష్టం చేశారు. పేదలపై కక్షతో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని మార్చుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ నిబంధనల మార్పు ముసుగులో పథకాన్ని శాశ్వతంగా సమాధి చేయడానికి కుట్ర పన్నుతున్నారని ఆయన ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశాన్ని కార్పొరేట్లకు అప్పగించే ప్రయత్నం చేసిందని ఆయన మండిపడ్డారు. హాత్మాగాంధీ ఉపాధి హామీ పథకంలో మార్పులను నిరసిస్తూ రాష్ట్ర అసెంబ్లీ ఇప్పటికే ఏకగ్రీవ తీర్మానం చేసింది.. ఈ నెల 20 నుంచి 30 వరకు ప్రతి గ్రామంలో గ్రామ సభ ఏర్పాటు చేసి కొత్త చట్టానికి వ్యతిరేకంగా తీర్మానం చేయాలి అని పిలుపునిచ్చారు. అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు బాధ్యత తీసుకోవాలి. పార్లమెంటు నియోజకవర్గాల వారీగా మంత్రులు బాధ్యత తీసుకోవాలి.. ప్రతి మండలానికి ఒక ఇంచార్జీ ని నియమించాలని.. నేను కూడా ఒక మండల బాధ్యత తీసుకుంటా అని చెప్పారు. ఫిబ్రవరి3 నుంచి 9వ తేదీ వరకు తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లో భారీ బహిరంగ సభలు ఏర్పాటు చేస్తున్నాం. ములుగులో ఏర్పాటు చేసే బహిరంగ సభకు సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీ ని ఆహ్వానిస్తామని చెప్పారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల మొదటి రోజు రాష్ట్ర ఎంపీలు నిరసన తెలపాలని సూచించారు. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 66 శాతం సీట్లను గెలుచుకుంది.. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో అన్ని చోట్ల కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి పిలుపునిచ్చారు. కార్యకర్తల కష్టం వల్లనే అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చాం..ఇప్పుడు కార్యకర్తలను గెలిపించాల్సిన బాధ్య త మా పైన ఉంది. కార్యకర్తల గెలుపు కోసం గల్లీ గల్లీ కాదు ప్రతి ఇంటికి వెళ్లి ప్రచారం చేస్తా అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ వల్లనే నేను ముఖ్యమంత్రి అయ్యాను.. కాంగ్రెస్ పార్టీ కి తెలంగాణ ఎప్పుడూ అండగా నిలబడింది.. దేశం ఇబ్బందుల్లో ఉంది.. ఈ పరిస్థితుల్లో రాహుల్ గాంధీ ప్రధాని కావాలి.. రాహుల్ గాంధీ ప్రధాని కావడం కోసం తెలంగాణ అండగా ఉంటుంది.. మోదీని ఓడించి రాహుల్ ను ప్రధాని చేయడం కోసం అంతా కష్టపడి పని చేయాలి పిలుపునిచ్చారు.

## బాగున్నారా.. అమ్మ!

>> తరఫున వారు ఆహ్వానించారు. ఈ సందర్భంగా, శాలువాకప్పి ఆహ్వాన పత్రికను అందజేసిన మంత్రులు కేసీఆర్‌కి మేడారం ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా... తన ఇంటికి వచ్చిన ఆడబిడ్డలను ఆత్మీయంగా పలకరించి సాదరంగా ఆహ్వానించిన కేసీఆర్ శోభమ్మ దంపతులు, వారిని పసుపు కుంకుమ వస్త్రాలు, తాంబూలాలతో సాంప్రదాయ పద్ధతిలో సత్కరించారు. కెసిఆర్ దంపతులు అందించిన తేనేటి విందు స్వీకరించిన మహిళా మంత్రులు,కాసేసు పరస్పర యోగక్షేమాలు మాట్లాడుకున్నారు. ఇష్టాగోష్టి అనంతరం మంత్రులు తిరుగు ప్రయాణం అయ్యారు. కాగా, తొలుత ఎర్రవెల్లి నివాసానికి చేరుకున్న మహిళా మంత్రులకు మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్ సాదర ఆహ్వానం పలికారు. కెసిఆర్‌కు మేడారం ఆహ్వాన పత్రికను అందజేసిన అనంతరం సీతక్క మీడియాతో మాట్లాడుతూ అసెంబ్లీలో కెసిఆర్‌ను కలవలేకపోయాం,అందుకే నివాసానికి వెళ్లి మేడారం జాతరకు ఆహ్వానించామని చెప్పారు.దీనికి ఎలాంటి రాజకీయాలు లేవని, ఇది ఒక ఆచారం అని చెప్పారు. కెసిఆర్‌తో పాటు ఆయన సతీమణి శోభమ్మను ఆహ్వానించామని వారికి దేవుడి తరఫున పట్టు వస్త్రాలు పెట్టామని చెప్పారు. కెసిఆర్ దంపతులు సైతం తమకు చీరలు పెట్టడం సంతోషంగా ఉందన్నారు. ప్రాంతాలకు అతీతంగా అందరి కోరికలు తీర్చే తల్లులు సమ్మక సారలమ్మ అని కొనియాడారు. ఇక మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ కెసిఆర్ జాతరకు వస్తానని చెప్పారన్నారు. ఏదో ఒక రోజు హెలికాప్టర్‌లో జాతరకు వస్తానని చెప్పారన్నారు.

## వ్యవసాయ సంస్థల మెగా విలీనం

>> ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి, 22 వేర్వేరు వ్యవసాయ సంబంధిత కార్పొరేషన్లు పనిచేస్తున్నాయి. వీటిలో చాలా సంస్థలు ఇప్పుడు వ్యవసాయ, అనుబంధ కార్యకలాపాల్లో పరిమిత పాత్ర పోషిస్తుండగా, మరోవైపు ఉద్యోగ విరమణ, ఆర్థిక అస్థిరతతో ఇబ్బంది పడుతున్నాయి. ఇటువంటి ముఖ్యమైన సంస్థలలో ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్, హైదరాబాద్ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ అసోసియేషన్, హార్టికల్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్,వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ తదితర సంస్థలు ఉన్నాయి. ఆయా సంస్థలను ఈ ఏకీకరణ చేయడం వెనుక వనరులను ఆప్టిమైజ్ చేయడమే కాకుండా రైతులకు మద్దతు వ్యవస్థలను బలోపేతం చేయడం దిశగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఈ ఏకీకృత విధానంతో నిర్వహణ, పంట సేకరణ, ఎరువుల పంపిణీ, వేర్‌హౌసింగ్ వంటి విభాగాల్లో మెరుగైన సమన్వయాన్ని సాధ్యం చేస్తుందని భావిస్తున్నారు. ఇదే సమయంలో ప్రతిపాదిత మార్పులు సహకార సంస్థలకు కూడా విస్తరింప చేసేందుకు కార్యాచరణ జరుగుతోంది. ప్రస్తుతం సహకార శాఖ పరిధిలో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పిఎసిఎస్), మార్కెటింగ్ ఫెడరేషన్ (డిసిఎంఎస్)లను విలీనం చేయడం గురించి చర్చలు కొనసాగుతున్నాయని సహకార శాఖ వర్గాలు తెలిపాయి. ప్రధానంగా వ్యవసాయ ఉత్పత్తులను సేకరించడం మరియు కీలకమైన ఇన్‌పుట్‌లను పంపిణీ చేయడం ద్వారా వ్యవసాయ ఆర్థిక వ్యవస్థకు మద్దతు ఇవ్వడంలో ఈ సంస్థలు కీలక పాత్ర పోషిస్తాయి.



న్యూఢిల్లీలో గురువారం భారతీయ ఎఐ స్టార్టప్‌లతో రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న ప్రధాని మోడీ

## బిఎస్సీ అగ్రి ప్రశ్నపత్రం లీక్

>> 35 మంది అభ్యర్థులు ఒక పథకం ప్రకారం సెమిస్టర్ ఫైనల్ పరీక్షల ప్రశ్న పత్రాలను వర్సిటీ సిబ్బంది సహకారం తో లీకు చేసి వాట్సాప్ గ్రూప్ లలో ఇతర వ్యవసాయ కళాశాలల విద్యార్థులకి పంపుతున్నారనీ, ఈ వ్యవహారం లో పెద్ద ఎత్తున డబ్బు లు చేతులు మారిందని తేల్చారు. ఒక పథకం ప్రకారం కొన్నేళ్లు గా ఈ వ్యవహారం జరుగుతోందని నిర్ధారించారు. వర్సిటీ ఈ అంశాన్ని చాలా తీవ్రం గా పరిగణిస్తూ ఒక ఉన్నతాధికారి సహా నలుగురు సిబ్బందిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అదే విధంగా వ్యవసాయ శాఖ నుంచి ఇన్ సర్వీస్ కోటా లో వచ్చిన సుమారు 35 మంది ని డిస్మిస్ చేస్తూ వారిని వ్యవసాయ శాఖ కి తిరిగి పంపిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కాగా.. 2014 నుంచి 2024 వరకూ పూర్తి స్థాయిలో విశ్వ విద్యాలయం లో ఉన్నత అధికారులు లేకపోవడం తో ఎన్నో అవకతవకలు జరిగాయని, ప్రశ్న పత్రాల లీకేజీ కుంభకోణం అందులో ఒకటనీ ఉప కులపతి అల్దాస్ జానయ్య పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వెంటనే ప్రక్షాళన మొదలు పెట్టి బాధ్యులైన వారిని సస్పెండ్ చేశామని వివరించారు. అవసరం అయితే సైబర్ నేరాల విభాగానికి ఫిర్యాదు చేసి సమగ్ర విచారణ చేయాలని కోరతామన్నారు. ఈ అంశానికి సంబంధం ఉన్నవారిని వదిలి పెట్టబోమని, కఠిన చర్యలు తీసుకుంటామని, భవిష్యత్ లో ఇటువంటివి పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకుంటామని ఉప కులపతి అల్దాస్ జానయ్య స్పష్టం చేశారు.

## స్కూళ్లలో బ్రేక్‌ఫాస్ట్

>> రెడ్డి గురువారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. వైఐఆర్‌సీలో సోలార్ కిచెన్ల నిర్మాణాన్ని పీఎం కుసుమ్‌లో చేపట్టే అవకాశాన్ని పరిశీలించాలని సీఎం అధికారులకు సూచించారు. వైఐఆర్‌ఆర్‌సీల నిర్మాణాలకు సంబంధించి బిల్లులను ఎప్పటికప్పుడు విడుదల చేయాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం కొడంగల్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాల్లలో స్వచ్ఛంద సంస్థల ద్వారా అమలు చేస్తున్న బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజన పథకాన్ని తెలంగాణ వ్యాప్తంగా అమలు చేయడానికి గల అవకాశాలను పరిశీలించాలని సీఎం ఆదేశించారు. తగినంత స్థలం, అవసరమైన మద్దతు అందజేస్తే పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయగలమని అక్షయపాత్ర ప్రతినిధులు సీఎంకు తెలియజేశారు. ప్రతి రెండు నియోజకవర్గాలకు ఒక సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటు చేసి అందరికీ సకాలంలో భోజనం అందేలా ప్రణాళికలు రూపొందించాలని సీఎం అధికారులను ఆదేశించారు. సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటుకు రెండు ఎకరాల స్థలం కేటాయింపు లేదా 99 సంవత్సరాలకు లీజు తీసుకునే అంశంపై జిల్లా కలెక్టర్లతో మాట్లాడి త్వరగా నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు ముఖ్యమంత్రి సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 23 నూతన పాఠశాల భవనాలు నిర్మాణాలు వచ్చే విద్యా సంవత్సరం నాటికి అందుబాటులోకి రావాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. బాచుపల్లి పాఠశాల స్థలం కేవలం అర ఎకరం మాత్రమే ఉండడంపై సీఎం ఆరా తీశారు. ఎక్కడైనా పాఠశాలకు కనీసం ఎకరన్నర స్థలం ఉండాలని, బాచుపల్లి ప్రస్తుతం ఉన్న స్థలం సమీపంలో ఎకరన్నర ఆ పాఠశాల నిర్మాణానికి కేటాయించాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుత, భవిష్యత్ అవసరాలకు తగినట్లు ఒకటి నుంచి పదో తరగతి వరకు సిలబస్ మార్పుపై కసరత్తును వెంటనే ప్రారంభించాలని సీఎం ఆదేశించారు. పాలిటెక్నిక్ కళాశాలలు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నుంచి బయటకు వచ్చే ప్రతి విద్యార్థికి కచ్చితంగా ఉద్యోగం లభించేలా సిలబస్, బోధన ఉండాలని సీఎం అన్నారు. సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు కే.కేశవరావు, పి.సుదర్శన్ రెడ్డి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, సీఎం స్పెషల్ సెక్రటరీ బి.అజిత్ రెడ్డి, రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు.

## ఐప్యాక్ సంస్థల్లో ఇడి సోదాలు

### ప్రతీక్‌జైన్ ఇంట్లో అధికారులతో మమతా బెనర్జీ వాగ్వాదం

### కీలక దస్త్రాలు తీసుకెళ్లారని ఇడి ఆరోపణ

### మోడీ, అమిత్‌షాలపై మమత ఆగ్రహం

### టిఎంసి, బిజెపిల మధ్య మాటల యుద్ధం

**కోల్‌కత్తా, జనవరి 8:** పశ్చిమ బెంగాల్‌లో రాజకీయ వేడి మరోసారి భగ్గుమంది. ప్రముఖ ఎన్నికల వ్యూహరచన సంస్థ ఇండియా పొలిటికల్ యాక్షన్ కమిటీ (ఐప్యాక్) కార్యాలయాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాడులు నిర్వహించడంపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది పూర్తిగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా పన్నిన కుట్రేనని, దేశ చరిత్రలోనే ఇంతటి దుర్మార్గపు, నీచమైన హోంమంత్రిని చూడలేదని ఆమె తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం ఉదయం నుంచి కోల్‌కతాలోని సాల్ట్ లేక్‌లో ఉన్న ఐప్యాక్ ప్రధాన కార్యాలయంతో పాటు, సంస్థ సహ వ్యవస్థాపకుడు ప్రతీక్ జైన్ నివాసంలోనూ ఈడీ అధికారులు ఏకకాలంలో సోదాలు ప్రారంభించారు. కేంద్ర సాయుధ బలగాల (సీఏపీఎఫ్) పటిష్ట భద్రత నడుమ ఈ దాడులు జరిగాయి. విషయం తెలుసుకున్న వెంటనే మమతా బెనర్జీ, కోల్‌కతా పోలీస్ కమిషనర్ మనోజ్ కుమార్ వర్మతో కలిసి నేరుగా ప్రతీక్ జైన్ నివాసానికి చేరుకున్నారు. ఇంట్లోకి వెళ్లి ఈడీ అధికారులతో మాట్లాడి, కొద్దిసేపటి తర్వాత బయటకు వచ్చిన ఆమె, మీడియాతో మాట్లాడుతూ కేంద్రంపై నిప్పులు చెరిగారు.నా పార్టీ తృణమూల్ కాంగ్రెస్‌కు సంబంధించిన పత్రాలను ఈడీ అధికారులు స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించారు. నేను వాటిని తిరిగి తీసుకువచ్చాను. ఈ పనికిమాలిన కేంద్ర హోంమంత్రి దేశాన్ని రక్షించలేరు, కానీ ఈడీ ద్వారా నా పార్టీ పత్రాలను లాక్కోవాలని చూస్తున్నారు. నేను ప్రతీక్‌కు ఫోన్ చేశాను. అతని ఫోన్, హార్డ్ డిస్క్‌లను స్వాధీనం చేసుకోవాలని అధికారులు చూశారని మమత ఆరోపించారు. అనంతరం సాల్ట్ లేక్‌లోని ఐప్యాక్ కార్యాలయానికి కూడా వెళతానని ఆమె తెలిపారు. 2021 అసెంబ్లీ ఎన్నికలకు ముందు, అంటే 2020 నుంచి ఐప్యాక్ సంస్థ తృణమూల్ కాంగ్రెస్‌కు ఎన్నికల వ్యూహకర్తగా పనిచేస్తున్న విషయం తెలిసిందే. మమత చర్యలపై పశ్చిమ బెంగాల్ శాసనసభలో ప్రతిపక్ష నేత సువేందు అధికారి తీవ్రంగా స్పందించారు. రాజ్యాంగబద్ధమైన సంస్థ విధుల్లో మమతా బెనర్జీ నేరుగా జోక్యం చేసుకుంటున్నారని ఆయన ఆరోపించారు. గతంలో కోల్‌కతా మాజీ పోలీస్ కమిషనర్ రాజీవ్ కుమార్ ఇంటికి సీబీఐ అధికారులు వెళ్లినప్పుడు కూడా ఆమె ఇదే విధంగా అడ్డుకున్నారు. సీబీఐకి వ్యతిరేకంగా నగరంలో ధర్నాకు దిగారు. ఇప్పుడు కూడా అదే పునరావృతం చేస్తున్నారు. ముఖ్యమంత్రిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ఒక ప్రైవేట్ కార్పొరేట్ సంస్థ కార్యాలయంపై ఈడీ దాడి చేస్తే ఆమెకెందుకు అంత ఆందోళనా అని సువేందు అధికారి ప్రశ్నించారు. ఈ ఘటనతో బెంగాల్‌లో అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం మరింత ముదిరింది.

## పార్టీలు రెడీ

>> తీసుకుంటానని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదంటూ ప్రధాన ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలు ఆరోపిస్తున్నాయి. అలాగే ఏపీ ప్రభుత్వం అక్రమ నీటి ప్రాజెక్టులు నిర్మించేందుకు సన్నాహాలు చేస్తోందని.. ఈ వ్యవహారంలో రేవంత్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందంటూ బీఆర్ఎస్ పార్టీ అగ్రనేతలు వరుసగా విమర్శలు గుప్పిస్తున్నారు.

ఈ విమర్శలు తిప్పికొట్టేందుకు ఈ భారీ బహిరంగ సభలు నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. అంతేకాకుండా ఈ సభల వేదిక మీద నుంచి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత.. ఆరు గ్యారంటీలు, రైతు రుణమాఫీ, ఉచిత విద్యుత్, మహాలక్ష్మీ తదితర పథకాలు అమలును వివరించడం ద్వారా ప్రతిపక్ష విమర్శలు తిప్పికొట్ట వచ్చనే లక్ష్యంలో ఈ కీలక నిర్ణయాన్ని ఆ పార్టీ తీసుకుంది. అంతేగాక ఆయా జిల్లాల్లోని స్థానిక సమస్యలతోపాటు పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసే దిశగా తమ ప్రభుత్వం ముందుకు వెళ్తుందంటూ ఈ సందర్భంగా ప్రజలకు స్పష్టమైన హామీ ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. ఇంకోవైపు రాష్ట్రంలో రేవంత్ ప్రభుత్వ తీరును ఎండగడతామంటూ బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు.అందుకోసం భారీ బహిరంగ సభలు నిర్వహిస్తామంటూ ఆయన ఇప్పటికే మీడియా వేదికగా స్పష్టమైన ప్రకటన చేశారు. అలాంటి వేళ బీఆర్ఎస్ పార్టీ కంటే ముందే భారీ బహిరంగ సభలు నిర్వహించడం ద్వారా ప్రజల్లోకి వెళ్లాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఆ దిశగా ఆ పార్టీ అగ్రనాయకత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ జిల్లాల్లో పర్యటిస్తూ నూతన సర్పంచ్‌లతో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. కార్యకర్తలతో విస్తృత సమావేశాలు నిర్వహిస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ పోరుకు సిద్దం కావాలని, అత్యధిక మున్సిపల్ స్థానాలు గెలుచుకోవాలని పిలుపునిస్తున్నారు. తాజాగా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు జిల్లా యాత్రలు చేస్తున్నారు.



## నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ తరహాలో

# తెలంగాణ విద్యావిధానం

### మినీవర్సిటీ తరహాలో రూ.200 కోట్లతో రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మిస్తున్నాం

### సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన హిమాచల్‌ప్రదేశ్ విద్యామంత్రి రోహిత్‌ఠాగూర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 8:** నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ తరహాలో త్వరలో తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీని తీసుకు రానున్నట్లు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించి ఒక కమిటీని నియమించామని, త్వరలోనే పాలసీని తీసుకువస్తామని పేర్కొన్నారు. గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హిమాచల్ ప్రదేశ్ విద్యాశాఖ మంత్రి రోహిత్ ఠాగూర్ బృందం మర్యాదపూర్వకంగా కలిసింది.ఈసమావేశంలో పాల్గొన్న విద్యా శాఖ కమిషనర్ యోగితా రాణా, పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థలో తీసుకు వస్తున్న సంస్కరణలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు వివరాలను హిమాచల్ ప్రదేశ్ మంత్రికి సిఎం వివరించారు. 25 ఎకరాల సువిశాల స్థలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు ఒకే చోట మినీ యూనివర్సిటీ తరహాలో రూ.200 కోట్లతో రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నట్లు సిఎం చెప్పారు.ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతం చేసేందుకు వీలుగా ప్రీ ప్రైమరీ విద్య అందించే విధానం అమలు చేయనున్నట్లు మంత్రికి వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రీ ప్రైమరీ చిన్నారులను పాఠశాలలకు తీసుకెళ్లేందుకు రవాణా సౌకర్యాన్ని కల్పించే యోచన చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఐటిఐలను ఏటీసీలు గా తీర్చిదిద్దుతున్నట్లు వివరించారు. ప్రతి నియోజకవర్గంలో ఏటీసీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు సిఎం తెలిపారు.మల్లెపల్లి ఐటీసీని సందర్శించాలని హిమాచల్ ప్రదేశ్ మంత్రికి సిఎం సూచించారు.ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం పైన ఆసక్తి చూపించిన హిమాచల్ ప్రదేశ్ మంత్రి...ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటుకు సంబంధించిన సమగ్ర నివేదికను తమకు అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ విద్యావ్యవస్థను పటిష్టతకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజన్‌ను హిమాచల్‌ప్రదేశ్ విద్యా శాఖ మంత్రి రోహిత్‌ఠాగూర్ అభినందించారు.



కార్యశాలలో మాట్లాడుతున్న ఆచార్య ఘంటా చక్రపాణి

## ఎన్ఐఆర్ఎఫ్‌లో అగ్రస్థానమే లక్ష్యం

### అంబేద్కర్ వర్సిటీ విసి ఆచార్య ఘంటా చక్రపాణి

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జనవరి 8, ప్రభాతవార్త:** నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్) ఓపెన్ యూనివర్సిటీ కేటగిరిలో అగ్రస్థానంలో నిలవడమే బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ లక్ష్యమని వైస్‌ఛాన్సలర్ ఆచార్య ఘంటా చక్రపాణి స్పష్టం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఇంటర్నల్ క్వాలిటీ అష్యూరెన్స్(సికా) ఆధ్వర్యంలో గురువారం విశ్వవిద్యాలయ అధ్యాపకులకు 'నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్, అవేర్‌నెస్ అండ్ కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్' అనే అంశంపై ఒక రోజు కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి మాట్లాడుతూ విశ్వవిద్యాలయ ప్రతిష్టను ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ పెంచుతుందని, సంస్థ ఖ్యాతిని ప్రతిబింబిస్తుందన్నారు. ఉన్నత ర్యాంకును యూనివర్సిటీ సాధిస్తుందనే విశ్వాసం వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయ స్థితిని మెరుగుపరచడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందన్నారు. పరిశోధనపై దృష్టి పెట్టాలని అధ్యాపకులకు సూచించారు. ఉత్తమ పరిశోధనలకు తమను తాము అంకితం చేసుకొని లక్ష్యానికి చేరాలన్నారు. రిసోర్స్ పర్సన్‌గా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ క్వాలిటీ అక్రిడిటేషన్స్ సిఈఓ డాక్టర్ టి. రవీందర్ రెడ్డి వ్యవహరించి ఉన్నత ర్యాంకింగ్‌లను సాధించడానికి విద్యా కార్యక్రమాలను సమర్థవంతంగా ఎలా ప్రదర్శించాలో వాటి ప్రాముఖ్యతను అధ్యాపకులకు వివరించారు. కీలకమైన ఎన్ఐఆర్ఎఫ్ పారామీటర్లను, విశ్వవిద్యాలయ బలాలను ప్రతిబింబించేలా వాటిని ఎలా సముచితంగా ప్రదర్శించాలో వివరించారు. మెరుగైన ర్యాంకింగ్‌లను సాధించడానికి ఉపాధ్యాయులు వారి వ్యక్తిగత సామర్థ్యాలను, సంస్థ సామర్థ్యాలను రెండింటినీ నిర్మించుకోవాలని సూచించారు. అకడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ పుష్ప చక్రపాణి, రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్ విజయ కృష్ణా రెడ్డి, సికా డైరెక్టర్ ప్రొఫెసర్ కె. శ్రీదేవి, డైరెక్టర్లు, డీన్‌లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## అమన్‌ప్రీత్‌సింగ్ పిటిషన్‌పై ముగిసిన వాదనలు

### అరెస్ట్ చేయకుండా ఆదేశాలకు హైకోర్టు నిరాకరణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జనవరి 8:** మాసబ్ ట్యాంక్ పీఎస్‌లో తనపై నమోదైన డ్రగ్ కేసును కొట్టివేయాలని కోరుతూ ప్రముఖ సినీనటి రకుల్ ప్రీత్ సింగ్ సోదరుడు అమన్ ప్రీత్ సింగ్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. అతడి పిటిషన్‌పై గురువారం హైకోర్టులో వాదనలు ముగిశాయి. అమన్ డ్రగ్స్ వినియోగదారుడిగానే ఉన్నారని ఆయన తరఫు న్యాయవాది హైకోర్టు ధర్మాసనానికి తెలిపారు. దర్యాప్తునకు సహకరించడానికి అమన్ సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఇదే సమయంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్(ఏపీపీ) జితేందర్.. కోర్టు ఎదుట తమ వాదనలు వినిపించారు. అమన్, డ్రగ్స్ విక్రేతలకు మధ్య నగదు లావాదేవీలు జరిగాయని ఏపీపీ తెలిపారు.

గతేడాది జూన్ నుంచి పలు లావాదేవీలు జరిగాయని కోర్టు దృష్టికి ఏపీపీ తెచ్చారు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో భాగంగా అమన్ ప్రీత్ లావాదేవీలు నిర్వహించారని ఆయన తరఫు న్యాయవాది వెల్లడించారు. పోలీసులు అరెస్ట్ చేయకుండా ఆదేశాలివ్వాలని హైకోర్టును కోరారు. అయితే అమన్ తరఫు న్యాయవాది విజ్ఞప్తిని హైకోర్టు తిరస్కరించింది. అమన్ అరెస్ట్ చేయకుండా ఆదేశాలివ్వడానికి హైకోర్టు ధర్మాసనం నిరాకరించింది. న్యాయస్థానం తీర్పును 19వ తేదీకి వాయిదా వేసింది. గతేడాది డిసెంబర్ 19 హైదరాబాద్‌లోని మాసబ్ ట్యాంక్ పరిధిలో పోలీసులు జరిపిన దాడుల్లో కొకైన్, ఎండిఎంఏ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో పట్టుబడిన నిందితులను విచారించగా.. అమన్ పేరు బయటకు వచ్చింది. ఈ కేసులో అమన్‌ను ఏ7గా పేర్కొంటూ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

# చేతికొచ్చిన పంట నష్టనివారణకు రూట్‌మ్యాప్

### ఆధునిక పరిజ్ఞానంపై ప్రభుత్వం దృష్టి

### సైలో ఆధారిత ధాన్యం నిలువకు మార్గాన్వేషణ

### ఎఫ్‌సిఐ, పౌరసరఫరా అధికారులతో మంత్రి ఉత్తమ్ సమీక్ష

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 8:** చేతికొచ్చిన పంట భద్రతకోసం ఆధునిక పరిజ్ఞానంతో నిలువ చేసేందుకు రూట్ మ్యాప్ రూపొందిస్తున్నామని రాష్ట్ర నీటిపారుదల,పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. తద్వారా రైతుకు భరోసా కల్పించడంతో పాటు ఆహార భద్రతను పెంపొందించడం సులభ తరమౌతుందని ఆయన పేర్కొన్నారు.యావత్ దేశంలోనే ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రం అగ్రగామిగా నిలుస్తుండడంతో ఉత్పత్తి అయిన ధాన్యాన్ని పరి రక్షించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఆయన వెల్లడించారు. రైతు చేతికందిన ధాన్యాం నష్ట పోకుండా ఉండేందుకు ఆధునిక పరిజ్ఞానంతో కూడిన సైలో వ్యవస్థను అమలులోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోందని ఆయన తెలిపారు. ఈ మేరకు గురువారం సచివాలయంలో భారత ఆహార సంస్థ,రాష్ట్ర పౌర సరఫరాల శాఖాధికారులతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సైలో పద్దతిలో బియ్యం ,మొక్క జొన్న, సోయాబీన్ వంటి పంటలను కుడా నిల్వ చేసుకునే ఆస్కారం ఉంటుందని ఆయన తెలిపారు.మనుషుల జోక్యం లేకుండానే సైలో పద్దతిలో ఉండే ఇంటిగ్రేటెడ్ క్లినర్లు,డ్రైయర్లతో రెండు సంవత్సరాల వరకు ధాన్యాన్ని నిలువ ఉంచేందుకు అవకాశం ఉంటుందన్నారు.

ప్రభుత్వం ప్రస్తుతం కొనుగోలు చేసిన ధాన్యాన్ని నేరుగా రైస్ మిల్లులకు పంపడంతో మిల్లింగ్‌లో జరుగుతున్న జాప్యంతో ధాన్యం చెడి పోయి నష్టం వాటిల్లుతుందని,మిల్లులలో శాస్త్రీయ పద్దతిలో నిల్వ చేసే అవకాశం లేక పోవడంతోటే ఈ నష్టం వాటిల్లుతుందని ఆయన చెప్పారు.అటువంటి పరిస్థితిలలో రైతాంగానికి భరోసా ఇవ్వడంతో పాటు ధాన్యాన్ని పరిరక్షించేందుకు ప్రభుత్వం శాస్త్రీయమైన సైలో పద్ధతిని అమలులోకి తేవాలి అనే ఆలోచనకు శ్రీకారం చుట్టమన్నారు.తద్వారా ధాన్యం కొనుగోలు సమయంలో ఆధునిక పరిజ్ఞానంతో కూడిన సైలో పద్దతిలో ఉండే డ్రైయర్ల ద్వారా తేమను తొలగించడంతో పాటు దాన్యాన్ని దీర్ఘకాలికంగా పరిరక్షించు కోవచ్చని ఆయన తెలిపారు. అంతే గాకుండా పాత బియ్యానికి మార్కెట్ లో అధిక ధర లభిస్తుందన్నారు.ఇప్పటికే తెలంగాణా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పౌర సరఫరాల శాఖలో తీసుకొచ్చిన విప్లవాత్మకమైన మార్పుల ప్రభావం దేశ వ్యాప్తంగా చూపుతుందన్నారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలులోకి తెచ్చిన పేదలకు ఉచితంగా అందిస్తున్న సన్న బియ్యం పంపిణీ,సన్నాలకు రూ.500 బోనస్ వంటి సంస్కరణలతో దేశవ్యాప్తంగా ఆహార ద్రవ్యోల్బణం గణనీయంగా తగ్గిందన్నారు.ఆ క్రమంలోనే చేతికొచ్చిన పంట పాడవకుండా ఉండెందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తేవలనుకుంటున్న సైలో ప్రాజెక్టుతో పెద్ద ఎత్తున ప్రయోజనం ఉండే అవకాశాలను పరిశీలిస్తున్నామన్నారు.ప్రధానంగా కేంద్రప్రభుత్వం కొనుగోలు చేయాల్సిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం మీదకు నెట్టేసి మిల్లింగ్ అయిన బియ్యాన్ని కేంద్రం కొనుగోలు చేయడంతో కొనుగోలుకు మిల్లింగ్ కు మద్యన రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం రూ.5,000 కోట్లు నష్ట పోతుందని...సైలో పద్ధతిని అమలులోకి తెస్తే రూ.5,000 కోట్ల భారాన్ని అధిగమించడంతో పాటు రూ.1,000 కోట్లు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం వచ్చే పద్ధతిని అమలులోకి తేవాలని యోచిస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.


గురువారం సచివాలయంలో ఎఫ్‌సిఐ, రాష్ట్ర పౌర సరఫరాల శాఖాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

## టెట్‌పై సుప్రీం తీర్పుతో నష్టపోయే టీచర్ల వివరాలు ఇవ్వండి

### 16లోగా ఇవ్వాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్రం లేఖ

### సమస్య పరిష్కారానికి న్యాయసలహా కోరిన కేంద్రం

### రాష్ట్రం నుంచి 40వేల మందికిపైగా ఉపాధ్యాయులు

**హైదరాబాద్, జనవరి 8, ప్రభాతవార్త:** ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)పై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు మూలంగా ఎంత మంది ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులు నష్టపోతున్నారో వివరాలు ఇవ్వా లని కేంద్ర విద్యా శాఖ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను కోరింది. ఈ మేరకు రాష్ట్రాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శులకు కేంద్ర పాఠశాల విద్య శాఖ జాయింట్ సెక్రటరీ లేఖలు రాశారు. నష్టపోయే ఉపాధ్యాయుల వివరాలను ఈ నెల 16లోగా కేంద్రానికి సమర్పించాలని లేఖలో పేర్కొన్నారు. అలాగే సమస్య పరిష్కారానికి గల న్యాయపరమైన అవకాశాలను కూడా తెలియజేయాలని లేఖలో కోరారు. టెట్‌పై సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో రాష్ట్రంలో రాష్ట్రంలో సుమారు 40వేల మందికి పైగా ఇన్ సర్వీస్ టీచర్లు ఇబ్బంది పడే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. సుప్రీం కోర్టు టెట్ తప్పనిసరి అని చెప్పడంతో ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న టెట్-2026 పరీక్షలకు ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల నుంచి 71వేలకి పైగా దరఖాస్తులు వచ్చాయి. వారు ప్రస్తుతం పరీక్షలకు హాజరవుతున్నారు. టెట్‌పై సుప్రీం కోర్టు తీర్పు కారణంగా రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎంతమంది ఉపాధ్యాయులు ప్రభావితం అవుతున్నారో వివరాలు ఇవ్వాలని, పరిష్కారానికి గల న్యాయపరమైన అవకాశాలను జనవరి 16 లోపు తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ లేఖ రాసింది. టెట్‌పై సుప్రీం కోర్టు ఏమిటంటే.. గత ఏడాది సెప్టెంబరు 1న సుప్రీంకోర్టు వెల్లడించిన తీర్పు ప్రకారం.. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు ఉద్యోగంలో కొనసాగాలంటే టెట్ పాస్ కావాలని తీర్పును వెలువరించింది. తీర్పు ఇచ్చిన తర్వాత రెండేళ్లలో అంటే 2027 నాటికి టెట్ ఉత్తీర్ణులు కావాలని పేర్కొంది. టెట్ ఉత్తీర్ణత కాని పక్షంలో ఉద్యోగం వదులుకోవల్సి ఉంటుందని తెలిపింది.

అయితే ఐదేళ్లలో పదవీ విరమణ చేయబోయే వారికి మాత్రం టెట్ అవసరం లేదని చెబుతూనే.. వారు పదోన్నతి పొందాలంటే మాత్రం టెట్ పాసవ్వాలని స్పష్టం చేసింది. విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం మార్చి 31, 2010 కంటే ముందు ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న వారికి టెట్ అవసరం లేదని ఎన్‌సిటిఈ గతంలో జారీ చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొన్నప్పటికీ.. దానిని పరిగణన లోకి తీసుకోకుండా సుప్రీంకోర్టు గత ఏడాది(2025) సెప్టెంబర్ 1న టెట్ తప్పనిసరి అంటూ తీర్పు వెలువరించిన నేపథ్యంలో దేశ వ్యాప్తంగా ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు.

2010 కంటే ముందు ఉన్న వారికి టెట్ అవసరం లేకపోవడంతో.. వారు ఉపాధ్యాయ వృత్తిలో చేరి ఇప్పటికే 15 సంవత్సరాలు దాటిపోయింది. అంతకంటే ముందు టీచర్లుగా నియమితులైన వారు అయితే సుమారు 20 నుంచి 25 సంవత్సరాలుగా ఉపాధ్యాయులుగా కొనసాగుతున్నారు. వారిలో సర్వీస్ మరో 10 నుంచి 12 ఏళ్ల వరకు ఉన్న వారు సైతం ఉన్నవారు ఉన్నారు. ఇప్పటికే 25 సంవత్సరాలకుపైగా టీచింగ్ వృత్తిలో ఉన్నవారు సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఇపుడు టెట్ పరీక్షలకు హాజరవుతున్నారు. ఈ నెల 3 నుంచి జరుగుతున్న టెట్ పరీక్షలకు ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల నుంచి 71670 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికే పాఠాలు బోధిస్తున్న వారి నుంచి పేపర్-1 పరీక్షకి 15,672 మంది, పేపర్-2 పరీక్షకి 33,564 మంది దరఖాస్తు చేసుకున్నారు. రెండు పేపర్లకి కలిపి 11,719 మంది దరఖాస్తు చేసుకున్నారు. మొత్తంగా ప్రభుత్వం టీచర్ల నుంచి 60,955 దరఖాస్తులు టెట్-2026కి వచ్చాయి. టెట్-2026కి దరఖాస్తు గడువు లోపు పేపర్-1కి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల నుంచి 27,389 దరఖాస్తులు రాగా.. పేపర్-2కి 44,281 దరఖాస్తులు వచ్చాయి.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దూకుడు

### విచారణకు హాజరైన బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జనవరి 8:** తెలంగాణలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దర్యాప్తు మరింత ఊపందుకుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అక్రమంగా ఫోన్లు ట్యాప్ చేసిన ఆరోపణలపై సిట్ దూకుడుగా విచారణ చేపడుతోంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసిన సిట్.. వారిని విచారిస్తోంది. ఇందులో భాగంగా బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ గురువారం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సిట్ ఎదుట విచారణకు హాజరయ్యారు. గతేడాది నవంబర్ 17న కూడా ఆయన సిట్ విచారణకు హాజరైన సంగతి తెలిసిందే. తాజాగా మరోసారి నోటీసు అందడంతో బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ విచారణకు రాగా.. సిట్ అధికారులు ఈ కేసుకు సంబంధించి పలు ప్రశ్నలు సంధించినట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయంలో ఈ కేసులో నిందితుడైన అడిషనల్ ఎస్పీ తిరుపతన్న, జైపాల్ యాదవ్ మధ్య ఫోన్ సంభాషణలు జరిగినట్లు సిట్ గుర్తించింది. దర్యాప్తులో భాగంగా.. ఒక కేసులో భార్యాభర్తల మధ్య తలెత్తిన సమస్యపై తిరుపతన్నతో మాట్లాడినట్లు జైపాల్ యాదవ్ వాంగ్మూలం ఇచ్చారు. అయితే సిట్ అధికారులు ఎన్నికల సమయంలో జరిగిన ఈ కాల్స్, సంభాషణలపై లోతుగా విచారించారు. జైపాల్ యాదవ్ ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేసినట్లు సమాచారం. అలాగే ఈ కేసులో మరో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యనూ సిట్ విచారించనుంది. ఇటీవల సిట్ జారీ చేసిన నోటీసుల్లో భాగంగా ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలతోపాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు కొండల్ రెడ్డి కూడా విచారణకు హాజరు కానున్నారు. బీఆర్ఎస్ హయాంలో కొండల్ రెడ్డి ఫోన్ ట్యాప్ అయినట్లు దర్యాప్తులో తేలడంతో ఆయనను సాక్షిగా పిలిచినట్లు తెలుస్తోంది.

## ఎసిబి వలలో జిల్లా పౌరసరఫరాల అధికారి

### రూ. 50 వేల లంచం తీసుకుంటూ పట్టుబడిన డిఎం జగన్మోహన్

**వనపర్తి క్రైమ్, జనవరి 8, ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా పౌరసరఫరాల సంస్థ కార్యాలయంలో పనిచేస్తున్న డీఎం జగన్మోహన్ గురువారం సాయంత్రం తన కార్యాలయం నుంచి ఇంటికి వెళుతూ ఐడిఓసి కార్యాలయ ఆవరణలో రూ.50 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఓ మిల్లుకు సీఎంఆర్ పర్మిషన్ ఇవ్వడానికి రూ. 1,70,000 ఒక లక్ష డెబ్బై వేల రూపాయలు డిమాండ్ చేశాడు. బాధితుడుతో రూ. 50 వేలకు బేరం కుదరడంతో ఒప్పందంలో భాగంగా గురువారం వనపర్తి లోని తన కార్యాలయం నుంచి ఇంటికి వెళ్తూ ఐడిఓసి కార్యాలయ ఆవరణలో తన కారులో రూ. 50 వేలు లంచం తీసుకుంటుండగా పక్కా సమాచారం మేరకు ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ తెలిపారు. నిందితుడిని శుక్రవారం నాంపల్లి ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు ఏసీబీ డిఎస్పి తెలిపారు. పౌర సరఫరాల అధికారి జగన్మోహన్ ఏసీబీకి పట్టుబడ్డ తర్వాత ఐడిఓసి భవనం ముందు గుర్తుతెలియని వ్యక్తులు బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకోవడం కొసమెరుపు.

## చైనీస్ మాంజాపై హైదరాబాద్ పోలీసుల కొరడా

### రూ. 1.24 కోట్ల విలువైన నిషేధిత మాంజా స్వాధీనం



**హైదరాబాద్,జనవరి 8,ప్రభాతవార్త:** సంక్రాంతి పండుగ వేళ పర్యావరణానికి, పక్షులకు హాని కలిగించే నిషేధిత చైనీస్ మాంజా (నైలాన్/సింథటిక్ దారం) విక్రయాలను అరికట్టేందుకు హైదరాబాద్ నగర పోలీసులు విస్తృత చర్యలు చేపట్టారు. నగర కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో పెద్ద ఎత్తున నిషేధిత మాంజాను స్వాధీనం చేసుకున్నారు.చైనా మాంజాపై ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో సిపి సజ్జనార్ మాట్లాడుతూ "సంక్రాంతి అంటేనే పతంగుల పండుగ, ఆనందాల హేళ. అయితే, మన సంతోషం మరొకరి ప్రాణానికి ముప్పుగా పరిణమించ కూడదు. పర్యావరణానికి, మనుషుల ప్రాణాలకు హాని కలిగించే చైనీస్ మాంజాపై ప్రభుత్వం సంపూర్ణ నిషేధం విధించింది. నిషేధాజ్ఞలు ఉన్నప్పటికీ కొందరు గుట్టుచప్పుడు కాకుండా వీటిని విక్రయిస్తున్నారు. నగరంలో ఎవరైనా చైనా మాంజాను విక్రయించినా, గోదాముల్లో నిల్వ చేసినా, అక్రమ రవాణాకు పాల్పడినా ఉపేక్షించే ప్రసక్తే లేదు. నిబంధనలు అతిక్రమిస్తే తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేస్తాం' అని హెచ్చరించారు.దుకాణాల్లో తనిఖీలు ముమ్మరం చేయడంతో వ్యాపారులు ఆన్‌లైన్ బాట పట్టినట్లు తమ దృష్టికి వచ్చిందని, ఈకామర్స్ వెబ్‌సైట్లు, సోషల్ మీడియా వేదికగా సాగే క్రయవిక్రయాలపై 24 గంటల పాటు ప్రత్యేక నిఘా ఉంచామని తెలిపారు. ఆన్‌లైన్‌లో మాంజా కొనుగోలు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్లాస్టిక్, గాజు పెంకులు, మెటాలిక్ కోటింగ్ ఉండే ఈ మాంజా వల్ల పిల్లలకు విద్యుత్ షాక్ కొట్టే ప్రమాదం ఉందని, తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించి సంప్రదాయ నూలు దారాలనే ప్రోత్సహించాలని కోరారు. ఎవరైనా మాంజా విక్రయిస్తే 'డయల్ 100' లేదా వాట్సాప్ నెంబర్ 94906 16555 కి సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

నగరవ్యాప్తంగా అన్ని జోన్లలో నిర్వహించిన దాడులలో ఇప్పటివరకు మొత్తం 103 కేసులు నమోదు కాగా, 143 మంది నిందితులను అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. వీరి నుంచి రూ. 1,24,52,000 (ఒక కోటి ఇరవై నాలుగు లక్షల యాభై రెండు వేలు) విలువైన 6,226 మాంజా బాబిన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ సిపి ఎం. శ్రీనివాసులు, డిసిపిలు కారె కిరణ్ ప్రభాకర్, జి. చంద్రమోహన్, గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, అడిషనల్ డిసిపి (టాస్క్ ఫోర్స్)అందె శ్రీనివాస్ రావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సదరం శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా అదనపు కలెక్టర్ దీపక్‌తివారి

**ఆసిఫాబాద్, జనవరి 8, ప్రభాతవార్త:** సదరం శిబిరాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కొనసాగుతున్న దివ్యాంగుల నిర్ధారణ సదరం శిబిరాన్ని ఆకస్మికంగా సందర్శించి శిబిరం నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్


సదరం శిబిరం తీరును పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి

మాట్లాడుతూ సదరం శిబిరానికి హాజరయ్యే దివ్యాంగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని, సదరం ధ్రువీకరణ పత్రాల జారీలో పారదర్శకంగా వ్యవహరించాలని, అర్హత కలిగిన దివ్యాంగులకు ధ్రువపత్రాలను అందించాలని తెలిపారు. సదరం శిబిరానికి వచ్చే దివ్యాంగులు, వారి సహాయకులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని, మీ సేవా కేంద్రంలో స్లాట్ బుక్ చేసుకున్న వారికి ఆలస్యం కాకుండా నిర్ణీత సమయంలోనే పరీక్షలు పూర్తి చేయాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని వివిధ విభాగాలను సందర్శించి వైద్యులకు పలు సూచనలు చేశారు.

వివిధ అనారోగ్య సమస్యలపై ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఆసుపత్రిలో అవసరమైన మందుల నిల్వలు అందుబాటులో ఉంచుకోవాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి, ఆసుపత్రి ఆర్ఎంఓ, ఎస్ఓ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# అశోక్‌నగర్ చౌరస్తా వద్ద ఉద్రిక్తత

### ఆందోళనకారులను పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట.. నిరుద్యోగుల అరెస్టు

**హైదరాబాద్ (చిక్కడపల్లి) జనవరి 8, ప్రభాతవార్త:** అశోక్‌నగర్ చౌరస్తా వద్ద నిరుద్యోగుల ఆందోళనలతో గురువారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. శాసనసభ లో రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు చేసిన వ్యాఖ్యలను నిరసన వ్యక్తం చేస్తూ, రేవంత్ రెడ్డి సర్కార్ ఎన్నికలలో ఇచ్చిన హామీల ప్రకారం 2 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వాలని వెంటనే జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ చిక్కడపల్లి నగర కేంద్ర కార్యాలయం నుండి అశోక్ నగర్ చౌరస్తా వరకు నిరుద్యోగ యువత భారీగా రోడ్డెక్కారు. ర్యాలీ బయలు దేరడంతో ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. చిక్కడపల్లి పోలీసులు రంగప్రవేశం చేసారు. ఆందోళన కారులను పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట జరిగి ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసులు పలువురు నిరుద్యోగులను అదుపు లోకి తీసుకుని పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ ఆందోళనల కారణంగా అశోక్ నగర్ , చిక్కడపల్లి పరి సర ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. నిరుద్యోగుల ఈ నిరసనలకు మద్దతుగా వివిధ రాజకీయ పార్టీల నేతలు కూడా స్పందిస్తున్నారు. ఈ ఘటనతో అశోక్ నగర్ ప్రాంతంలో ప్రస్తుతం భారీగా పోలీసు బలగాలను మోహరించారు. నిరుద్యోగుల ఆందోళన ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనకుండా నిరుద్యోగ నాయకులను అదుపులోకి తీసుకున్నారు. అశోక్ నగర్‌లోని సెంట్రల్ లైబ్రరీ నుండి చౌరస్తా వరకు నిరుద్యోగులు ర్యాలీగా తరలివచ్చారు. పోలీసులు వీరిని అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగి పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పరిస్థితి ఉద్రిక్తతకు దారితీయడంతో నిర్యుద్యోగ నేతలు ఇంద్ర నాయక్, రవి కుమార్, మోతిలాల్ నాయక్, అస్మా, భూక్యా కుమార్ , రవి రాథోడ్ తో మరి కొంత మందిని దితరులను అరెస్ట్ చేసి వివిధ పోలీస్ స్టేషనలకు తరలించారు. చిక్కడపల్లి ఏసీపీ ఎల్.రమేష్ కుమార్ నేతృత్వంలో ఇన్స్పెక్టర్ రాజు నాయక్, డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ శంకర్ తదితరులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రత చర్యలు తీసుకున్నారు.


పోలీసులతో వాగ్వాదానికి దిగిన నిరుద్యోగులు

### నగర కేంద్రగ్రంథాలయం వద్ద భారీ బందోబస్తు

కాగా ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా అశోక్ నగర కేంద్ర గ్రంథాలయం వద్ద చిక్కడపల్లి పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు ఏర్పాటు చేశారు. గతంలో జరిగిన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని అదనపు పోలీస్ బలగాలను ఏర్పాటు చేసారు.


వార్త

> ఒక రాజ్యంలో నివసించే ప్రజల భాషను తెలుసుకోకుండా, ప్రజాభిప్రాయం తెలుసుకోవడం సాధ్యం కాదు.
>
> న-బార్కర్

# పెరుగుతున్న పేదరికం

ధనిక పేదల మధ్య వ్యత్యాసం తగ్గించి సమ సమాజాన్ని నిర్మించడమే ధ్యేయంగా పని చేస్తున్నామని, అందుకోసం పేదల అభ్యున్నతికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి లక్షలాది కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నట్లు పాలకులు పదేపదే చెప్పుకుంటున్నారు. కానీ ధనికులు మరింత లక్ష్మీపుత్రులుగా ఎదిగిపోతున్నారు. పేదలు మరింత పేదలుగా దిగజారిపోతున్నారు. భారతదేశం మొత్తం సంపదలోయాభైఎనిమిది శాతంపైగా కేవలం పిడికెడు మంది గుప్పెట్లో చిక్కుకుపోయిందనే విషయం గతంలో ఎన్నో నివేదికలు వెల్లడించాయి. ఒక్క భారత్‌లోనే కాదు ప్రపంచవ్యాప్తంగా ఈ అంతరాయం అంతకంతకు పెరిగిపోతున్నది. గతంలో ఈ విషయంలో జరిగిన ఎన్నో ప్రపంచ ఆర్థిక సదస్సులలోనూ కూడా వెల్లడైంది. దేశ జనాభాలో డెబ్బైశాతం మంది వద్ద ఎంత సంపద ఉందో కేవలం అంత సంపద దాదాపు అరవై మంది వద్ద ఉన్నట్లు సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. నిరుపేదల ఆదాయం గత దశాబ్దంలో పది శాతంపెరిగితే లక్ష్మీపుత్రుల ఆదాయం నూట ఎనభై శాతం పెరిగిందని చెబుతున్నారు. ఇండోనేషియా, చైనా, లావోస్,బంగ్లాదేశ్, శ్రీలంక, తదితర దేశాలు పది శాతం ధనికుల సంపద ఇరవైయేళ్లలో పదిహేను శాతం పెరిగింది. అదే సమయంలో దేశంలో ఆర్థికంగా అట్టడుగునున్న పది శాతం మంది ప్రజల సంపాదన దాదాపు పదిహేను శాతానికి పడిపోయింది. కూలీల చెల్లింపుల విషయంలో ఆసియా దేశాల్లో మహిళలపై వివక్ష తీవ్రంగానే ఉంది. ఒకే పని చేస్తున్నా పురుషులకు ఇచ్చే కూలి,మహిళలకు ఇవ్వడం లేదు. వేతనాల చెల్లింపుల్లో వివక్ష భారత్‌లోనే ఎంతో ఉన్నట్లు అనేక నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ప్రపంచంలోని అతిపెద్ద వస్త్ర కంపెనీలన్నింటికి భారత్‌లోని కాటన్ స్పిన్నింగ్ మిల్లులతో వ్యాపార లావాదేవీలు ఉన్నాయి. ఈ మిల్లుల్లో బాలికలతో తక్కువ వేతనాలతో పని చేయిస్తున్నారు. ఏదిఏమైనా భారతదేశంలో సంపద అసమానత పెచ్చుమీరుతుండడం పట్ల ఆందోళన వ్యక్తమవుతున్నది. అయితే మరొకపక్క ప్రభుత్వ లెక్కలు ఇందుకు విరుద్ధంగా కన్పిస్తున్నాయి. గత పదేళ్ల వ్యవధిలోదాదాపు ఇరవైఐదు కోట్ల మంది భారతీయులు పేదరికం కోరల నుంచి బయటపడ్డారని నీతి ఆయోగ్ తాజాగా విడుదల చేసిన పత్రంలో స్పష్టం చేసింది. 2013-14లో 29.7 శాతం నమోదైన పేదరిక నిష్పత్తి 2022-23నాటికి 11.28 శాతానికి దిగివచ్చిందని స్పష్టం చేసింది. నిరుపేదల సంఖ్య తగ్గుదలలో బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌తోపాటు ఒడిశా, ఛత్తీస్‌గడ్ లాంటి రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయి. క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులకు ఈ అంకెలకు పొంతన కుదరడం లేదు. ఇదే విషయాన్ని గతంలో ఎందరో మేధావులు స్పష్టమైన అంకెలతో విమర్శనాస్త్రాలు సంధించారు. దారిద్ర్య రేఖకు దిగువన ఆకలితో అలమటిస్తున్న అభాగ్యులెందరో నిగ్గు తేల్చడానికి అనుసరిస్తున్న విధివిధానాలు తప్పుల తడకలుగా ఉన్నాయని నోబెల్ పురస్కార గ్రహీత అమర్త్యసేన్ గతంలో తూర్పారబట్టారు. దేశ జనాభాలో 30 శాతం వరకు పేదరికంలో మునిగితేలుతున్నారని 2014లో నిర్ధారించిన రంగరాజన్ కమిటీ నివేదిక ఇందుకు అద్దం పడుతున్నది. దేశంలో ఆకలితో నకనకలాడుతున్నవారి సంఖ్య యాభైకోట్లని సక్సేనా కమిటీ వెల్లడించింది. దేశ వ్యాప్తంగా ఎనభైఒక్క కోట్ల ముప్పైఐదు లక్షల మంది అన్నార్తులకు ఉచితంగా తిండిగింజలు పంపిణీ చేసే కార్యక్రమాన్ని మరో ఐదేళ్లు పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటికీ కోట్లాది మంది జీవితాలు అర్ధాకలి, పస్తులతోనే గడుస్తున్నాయనే విషయం తెలియంది కాదు. నూట ఇరవైఐదు దేశాలను పరిగణనలోకి తీసుకున్నా అంతర్జాతీయ క్షుద్బాధ సూచికలో భారత్‌కు నూట పదకొండో స్థానం దక్కింది.దక్షిణ ఆసియా, కొన్ని ఆఫ్రికా దేశాల్లో పేదరికం ఛాయలు అధికంగానే ఉన్నాయి. ప్రపంచంలో పేదలు అధికంగా దక్షిణాసియా, సబ్ సహారా, ఆఫ్రికా దేశాల్లోనే ఉన్నారు. ఆయా దేశాల్లో జనాభాఎంత పెరిగిందో పేదల సంఖ్య కూడా అదే స్థాయిలో పెరిగిపోతున్నది. భారతదేశంలో పేదరికాన్ని పారద్రోలేందుకు చేస్తున్న ప్రయత్నాలు అంతగా సఫలీకృతం కావడంలేదు. పేద కుటుంబాలకు ఆకలి బాధలు లేకుండా చేయాలనే లక్ష్యంతో ఎన్నో సబ్సిడీ పథకాలను ప్రభుత్వం నిర్వహిస్తున్నది. సబ్సిడీలో బియ్యం, మధ్యాహ్నభోజన పథకం లాంటివి ఎన్నో ఉన్నాయి. ప్రజాపంపిణీ వ్యవస్థ ఇందులో కీలకపాత్ర వహిస్తున్నది. లబ్ధిపొందే వారి సంఖ్య అంతకంతకు పెరిగిపోతుండడం పేదరికం విస్తరిస్తున్నదనే సంకేతాలు ఇస్తున్నది. ఒకపక్క నీతి ఆయోగ్‌తో పాటు గ్రామీణాభివృద్ధి సంస్థ లాంటివి సర్వే నిర్వహించి పేదరికం గణనీయంగా తగ్గిందని చెప్తుంటే ప్రజాపంపిణీవ్యవస్థ రికార్డులు అందుకు అంగీకరించడంలేదు. ఆ లెక్కల ప్రకారం పేదల సంఖ్య తగ్గిపోతుంటే ప్రజాపంపిణీ సంస్థ లెక్కల్లో ఊహించని రీతిలో పేదరికం పెరిగిపోతున్నది. దేశంలో ఎన్ని పథకాలు రూపొందించినా, మరెన్ని లక్షల కోట్ల నిధులు వెచ్చించినా పేదరికంపై పోరాటం ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదు. పేదరికం దానంతట అదే తగ్గిపోతుందనుకుంటే భ్రమే అవుతుంది. ఆఫ్రికా దేశాల్లోనూ ప్రభుత్వాలు కీలకమైన పాత్ర పోషిస్తూనే పేదరికాన్ని నిర్మూలించడం సాధ్యపడుతుందనే విషయాన్ని కొన్ని దేశాలు రుజువు చేశాయి. ప్రభుత్వ విధానాలు ఇందుకు అనుగుణంగా ఉండాలి. ఆర్థికాభివృద్ధితోపాటు సంపద పంపిణీ, వ్యవసాయరంగంలో సంస్కరణలు, వైద్యసేవల విస్తరణ, విద్య తదితర అంశాలపై దృష్టి పెట్టాలి.

> అందరూ జోక్యం చేసుకునే విషయం ఏ ఒక్కరి సొంత విషయమూ కాదు.
>
> సిసిరో



> కలలు మన అంతర్గత కోర్కెలకు నిజమైన భాష్యాలు. వాటిని అర్థం చేసుకోవడానికి కళా నైపుణ్యం కావాలి.
>
> యావా చర్లిస్



## ప్రజావాక్కు



### అమెరికాను అదుపు చేయడం కష్టం

వెనిజువెలా అధ్యక్షుడైన నికోలస్ ముదురోను ఆయన భార్యనుఅమెరికా సైనిక దళాలు ఆ దేశం వెళ్ళి అధ్యక్షుని చేతికిసంకెళ్ళు వేసికళ్ళకు గంతలు కట్టి అమెరికా తీసుకు వెళ్ళిఅక్కడ జైలులో పెట్టారు.ఇంతఘోరం జరుగుతుంటే భద్రతా దళాలు ఏమి చేస్తున్నాయి? అక్కడి అధికారులు అమెరికాతోలాలూచి పడ్డారా? అక్కడి సైనిక బలగాలు ప్రజలు తమకేమీ పట్టనట్టు వ్యవహారించడమేమిటి? ఏ న్యాయ సూత్రాలనుపాటించి ఈ ఎత్తుగడ సాగింది?అంతర్జాతీయ న్యాయస్థానంఏంచేస్తోంది? ఇతర ప్రపంచ దేశాలు అమెరికా చేసినఈఘాతుకానికి గట్టిగా ప్రతిస్పందన చేసినట్టు వార్తలేమీ రాలేదు. రష్యా, బ్రెజిల్, చైనా యితర కొన్ని చిన్న దేశాలు మాత్రమే అమెరికా చర్యనుతప్పుబట్టాయి. అన్ని దేశాలుఒకే త్రాటిపై నిలబడక పోతే అమెరికాను అదుపు చేయడం కష్టం.

- ఎన్. రామలక్ష్మి,సికింద్రాబాద్

### 15 సార్లు పెరోల్ బెయిలా ?

**ఒకసామాన్యుడు** అరెస్టు అయితే సంవత్సరాల తరబడి జైళ్లో మగ్గుతుంటాడు. అదే ఒక బాబా నేరం రుజువై జీవిత శిక్షపడిన వానికి ఆరేళ్లలో 15 సార్లు పెరోల్ బైలు! 2020 సంవత్సరంలో హత్యనేరం, అత్యాచార నేరం రుజువై 20 సంవత్సరాల జీవిత శిక్షపడిన డేరాబాబాకు నిన్న 15వసారి పెరోల్ బైలు వచ్చింది.ఉత్తర భారతంలో దొంగ బాబాలకు ప్రత్యేక గుర్తింపు, గౌరవం ఉంటుంది అనడానికి ఇదిఒక నిదర్శనం. ఈబాబా అరెస్టు అయినపుడు నాలుగైదు రాష్ట్రాల్లో భక్తులు నానాహంగామా చేసారు. ఇలాంటి నేరగాళ్లు, ఇలాంటి డేరా బాబాలు వ్యవస్థలను, పాలకులను నడిపిస్తున్నారా అనుమానంగా ఉంది.

- నార్నె వెంకటసుబ్బయ్య, ఒంగోలు

### వ్యవస్థలు బాగా పని చేయాలి

**దేశంలోని** ముఖ్యమైనవ్యవస్థలు సక్రమంగా పని చేయాలి. పోలీసు, చట్టాలు, చట్ట సభలు, ఇతర రంగాల ఉద్యోగులు,పౌరులు బాగా పని చేయాలి. వ్యవస్థలను నియంత్రించి అణచి వేసేది రాజకీయ శక్తులు కాబట్టి వ్యవస్థలు అప్రమత్తంగా ఉంటే సరిపోతుంది. వ్యవస్థలు ఎవరి వత్తిళ్లకు లొంగకూడదు. ప్రజా సేవలో ఉన్న ప్రతి ఒక్క పౌరులు నిజాయితీగా పనిచేయాలి.

- కె.రామారావు, నల్గొండ జిల్లా

### నిర్లక్ష్యమే అన్ని సమస్యలకు కారణం

ప్రపంచ క్రీడా వేదికపై భారత్ సాధిస్తున్న పురోగతితో పాటు ఒక చేదు వాస్తవం దేశాన్ని కలవరపెడుతోంది. అంతర్జాతీయ గణాంకాలప్రకారం డోపింగ్ కేసులసంఖ్యలో భారత్ అగ్రస్థానంలో నిలవడం దేశ ప్రతిష్టకు గట్టి దెబ్బ. ఇది కొందరు క్రీడాకారుల వ్యక్తిగత తప్పిదంగా కాకుండా, మొత్తం క్రీడా వ్యవస్థలో పాతుకుపోయిన వైఫల్యంగా చూడాలి. ఈ పరిస్థితి కొనసాగితే 2036 ఒలింపిక్స్ నిర్వహణపై భారత్ పెట్టుకున్న ఆశలే ప్రశ్నార్థకమవుతాయి. డోపింగ్న్యాయమైన పోటీని ఖండించడమే కాకుండా నిజాయితీగా శ్రమించే క్రీడాకారుల కలలను చిదిమేస్తుంది.యువతకు విజయం కోసంఏదైనా సరే" అన్న ప్రమాదకర సందేశాన్ని పంపుతుంది.అవగాహన లోపం, అనుభవం లేని కోచ్‌లు, పోషకాహారం-నిషేధిత పదార్థాల తేడా తెలియకపోవడం, ఫలితాల కోసం అతివాద ఒత్తిడి ఇవన్నీ భారత్‌లో డోపింగ్ విస్తృతికి కారణాలు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### డాలర్‌కు గడ్డుకాలం

**ఇప్పుడు** కొత్త సంవత్సరం అంత యుద్ధకాలమే. తన మాట మాత్రమే చెల్లుబాటు కావాలె అని అయితేఇక్కడో మెలిక ఉంది. ఇప్పుడు డాలర్‌కు గడ్డుకాలం నడుస్తోంది. అంటే క్వాడ్ రూపంలోనోఆసియాన్ రూపంలోనో లేక షాంఘై రూపంలోనో సంస్థలు తమ అవసరాలు తీర్చుకోవడానికి సొంత ఆర్థిక సంస్థలు ఫామ్ చేసుకోవడానికి ప్రయత్నం చేయడం ఆఫ్రికన్ యూనియన్ కూడా జీ 20లో 21 వ కూటమిగా చేరడం మూలంగా చిన్న దేశాలు, పశ్చిమాన పెద్ద దేశాలకు భయపడడం లేదు. తమ వ్యాపారాన్ని తమ సొంత కరెన్సీలోనే నిర్వహించుకోవడానికి ప్రయత్నం చేయడం అభివృద్ధి చెందిన దేశాలకు కంటగింపుగా మారింది.

-భారత అవినాష్, జనగామ

### భూ కబ్జాలను ఆపండి

**తెలంగాణ** రాష్ట్రంలోని మండల కేంద్రాలలో ఉన్న ఎస్సీ ఎస్టీ కాలనీలలో భూకబ్జాలు, భూ అక్రమణలు, అక్రమ కట్టడాలు జరుగుతున్నాయి.న్యాయం కోసం పోలీస్ స్టేషన్, రెవెన్యూ అధికారులకు, ఎస్సీ ఎస్టీ కమిషన్ వికలాంగుల సంక్షేమ శాఖ. జిల్లా కలెక్టర్‌లకు కూడా ఫిర్యాదు చేసినా కూడా సమస్యలు పరిష్కారం కావడం లేదు. సంవత్సరాలు గడిచినా కూడా భూ సమస్యలు పరిష్కారం కావడం లేదు.

-రాపాక రవీందర్, జనగాం

**మనవి** — ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# అమెరికా ఆగడాలకు అదుపులేదా?

**విదేశీ సైన్యం దేశంలోకి చొరబడటం ప్రజల్లో తీవ్రఆగ్రహాన్ని రగిలించింది. మరోసారి దాడి జరిగితే దేశమంతా ప్రతిఘటిస్తామని ప్రజలుహెచ్చరించారు. తాత్కాలిక అధ్యక్షురాలిగా ఎన్నికైన డెల్సీ రోడ్రిగ్స్ వెనెజువెలా గగనతలంలో విదేశీ విమానాలపై నియంత్రణ విధించారు. స్వతంత్ర సార్వభౌమ దేశమైన వెనెజువెలాలోకి చొరబడి అమెరికా చేపట్టిన అత్యంత అమానుషమైన దాడిపై ప్రపంచవ్యాప్తంగా తీవ్ర నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. అమెరికా పై ధిక్కారం న్యాయ అవగాహన, ప్రజాస్వామ్య ఆలోచనలు కలిగిన ప్రతి ఒక్కరినీ షాక్‌కు గురిచేసింది. వామపక్ష ప్రభుత్వాలు ఉన్న దేశాల నాయకులే కాకుండా, ఇతర రాజకీయ ధోరణులు అనుసరించే పాలకులు కూడా ట్రంప్ ప్రభుత్వ చర్యను తీవ్రంగా ఖండించారు. వెనెజువెలాలో జరిగిన దాడిలో తమ పాత్రలేదని, అంతర్జాతీయ చట్టాలను పాటించాల్సిందేనని అమెరికాకు అత్యంత సన్నిహిత మిత్ర దేశమైన బ్రిటన్ ప్రధాని కియర్ స్టార్మర్ తక్షణమే స్పందించడం గమనార్హం.**

టి.నాగరాజు

ఇరవై ఒకటవ శతాబ్దంలోకి ప్రపంచం అడుగుపెట్టినప్పటికీ, ప్రపంచం చూస్తుండగానే ఏదైనా చేయడానికి వెనకాడని అమెరికా సామ్రాజ్యవాదం అసలైన రూపాన్ని శనివారం వెనెజువెలాలో చూశాం. ఎనిమిది దశాబ్దాల క్రితం రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత జపాన్‌పైఅణు బాంబులు వేసి పసిపిల్లలతో సహా లక్షలాది మందిని కాల్చి చంపిన అమెరికా భీకరత్వాన్ని ప్రపంచం చూసింది. అనంతరం వియత్నాంలో రెండు దశాబ్దాల పాటు సాగిన ఆక్రమణలో లక్షలాది మందిని పొట్టన పెట్టుకోవడాన్ని, చివరికి ఆ రైతు ప్రజల పోరాటం ముందు మోకారిల్లి వెనక్కి తగ్గిన దృశ్యాన్ని కూడా చూశాం. తరువాత కూడా అనేక దేశాల్లో అమెరికా ఆక్రమణలు, కుట్రలు కొనసాగాయి.అయినప్పటికీ, మానవులు మరింత సంస్కృతులుగా మారిన ఈ ఆధునిక కాలంలో కూడా మానవత్వ విరుద్ధమైన సామ్రాజ్యవాద యుద్ధోన్మాదానికి ఏమాత్రం మార్పులేదని, కొత్త సంవత్సరంలో తనతొలి దాడితోనే అమెరికా మరోసారి నిరూపించింది. వెనెజువెలాఅధ్యక్షుడు నికోలాస్ మదురోను, ఆయన భార్యను అపహరించిన ఈ అఘాయిత్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌లోని నియంతృత్వ దురాశకూ, ఆర్థిక లాభానికీ నిదర్శనం మాత్రమే కాదు. అమెరికా సైనిక చర్యకు అరగంట కూడా పట్టలేదని వార్తలు చెబుతున్నాయి. అయితే కనీసం ఐదు నెలలుగా దీనికి సంబంధించిన ఏర్పాట్లు అమెరికా చేస్తోందన్నది స్పష్టమే.ఈ కుట్రలో భాగంగానే గత అక్టోబరులో నార్వేజియన్ కమిటీ,వెనెజువెలాలోయుద్ధోన్మాదాన్ని ప్రోత్సహించే తీవ్ర రైట్ వింగ్ భావజాలమచ్చాడోకు నోబెల్ శాంతి బహుమతి అందించింది. దాని ద్వారా మదురోను, వెనెజువెలా ప్రభుత్వాన్ని అంతర్జాతీయంగా విలన్ చేసిన తరువాతే అమెరికా దాడి జరిగింది. ఈ ఘటనలో నోబెల్ శాంతి కమిటీ కూడా సహనిందితురాలే. ఇంతకుముందు వెనెజువెలాలో కూలదోసే ప్రయత్నాలను అక్కడి తన అనుచరుల చేత చేయించిన అమెరికా, ఈసారి నేరుగా సైనిక దాడికేదిగింది. అమెరికాకు వెనెజువెలా నుంచి ఎలాంటి భద్రతా ముప్పులేదు. ఈ రెండు దేశాలకు మధ్యసరిహద్దులు కూడాలేవు. భౌగోళికంగా వీటి మధ్య 4500 కిలోమీటర్లకు పైగా దూరం ఉంది. సామ్రాజ్యవాద ఆధిపత్యానికి లొంగడానికి సిద్ధంగా లేనందుకే వెనెజువెలా అమెరికాకు కంటిలో ముల్లుగా మారింది.తమ సహజ వనరులనుదేశం, ప్రజల ప్రయోజనాల కోసం వినియోగించుకునే హక్కును, సార్వభౌమాధికారాన్ని వెనెజువెలా వామపక్ష ప్రభుత్వం గట్టిగా నిలబెట్టింది. అదే కారణంగా నిర్బంధం లేకుండా దోచుకున్న అమెరికా,అక్కడి చమురు కంపెనీలు వెనెజువెలాపై శత్రుత్వంతోదాడులు ప్రారంభించాయి.2002లోహ్యూగో చావెజ్‌ను కూలదోసేందుకు చేసిన ప్రయత్నం ప్రజాప్రతిఘటనతో విఫలమయ్యాక, అమెరికా ఏకపక్ష ఆంక్షలు విధించి ఆర్థిక యుద్ధాన్ని ప్రకటించింది. దాంతో వెనెజువెలాఆర్థికంగా నలిగిపోయేలా చేసి, ప్రజలను కష్టాల్లోకి నెట్టడం ద్వారా అట్టడుగు తిరుగుబాటుకు వేదిక సిద్ధం చేసింది. మదురో మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు సహకరిస్తున్నాడని ట్రంప్, అమెరికా ఆరోపిస్తున్నాయి. కానీ ఆ ఆరోపణలకు ప్రపంచాన్ని నమ్మించే ఒక్కఆధారాన్నీచూప లేకపోయాయి. నిజానికి లాటిన్ అమెరికా నుంచిఅమెరికాకు చేరే మాదక ద్రవ్యాల్లో వెనెజువెలా తీరాలద్వారా వెళ్లేవి అతిస్వల్ప శాతం మాత్రమే.అవి అమెరికాకు చేరుతున్నాయంటే, సరిహద్దుల్లో, నౌకాశ్రయాల్లో, విమానాశ్రయాల్లో అడ్డుకోవాల్సిన బాధ్యత ట్రంప్ ప్రభుత్వానిదే అది చేయకుండా అట్టడుగు కుట్రకు కథలు అల్లుతూ పచ్చిఅబద్ధాలు చెప్పడమే ట్రంప్ చేస్తున్న పని. దక్షిణ అమెరికా మొత్తాన్ని అమెరికా ఆధిపత్యంలోకి తెచ్చే పాత మాన్‌రో సిద్ధాంతాన్ని మళ్లీ అమలు చేయడంలో వెనెజువెలా ప్రధాన అడ్డంకిగా మారిందన్నదే, అంతర్జాతీయ



చట్టాలు, ప్రపంచ మర్యాదలను ఏ మాత్రంలెక్కచేయకుండా అక్కడ తిరుగుబాటు చేయడానికి ట్రంప్‌ను ప్రేరేపించింది. 'బెల్ట్ అండ్ రోడ్' ప్రాజెక్ట్ ద్వారా ఆ ప్రాంతంలో భారీగా పెట్టుబడులు పెంచుతున్న చైనా ప్రభావాన్ని తగ్గించాలన్నదీ ట్రంప్ లక్ష్యమే. పచ్చి అబద్ధాల ఆధారంగా జార్జ్‌బుష్ జూనియర్ ఇరాక్‌పై దాడి చేసినప్పటికీ, ముందుగా అమెరికా కాంగ్రెస్ అనుమతితీసుకున్నాడు. కానీ ట్రంప్ దానికి కూడా సిద్ధంగా లేకపోవడం ద్వారా అమెరికా ప్రజాస్వామ్యాన్నే సవాలు చేశాడు. ఎన్నికల్లో ఓడినప్పుడు తన అనుచరులతో కలిసి పార్లమెంట్‌పై దాడి చేసి తిరుగుబాటుకు యత్నించిన ట్రంప్‌కు ప్రజాస్వామ్యంపై మాట్లాడే నైతిక హక్కుఏముంది? క్యూబాసహా ఈ ప్రాంతంలోని ఇతర వామపక్ష పాలితదేశాలపై కూడా ఈ యుద్ధోన్మాద పాలకుడి సైన్యం ఎక్కుపెట్టవచ్చు. ట్రంప్ నేతృత్వంలోని అమెరికా దక్షిణ అమెరికా దేశాలకు మాత్రమే కాదు,దాని మిత్రదేశాలకు కూడా ముప్పుగానే మారింది. కెనడాను అమెరికా 51వ రాష్ట్రంగా విలీనం చేయాలన్న కోరికను ట్రంప్ బహిరంగంగానే వ్యక్తంచేశాడు. దేశంపై దాడిచేసి వెనెజువెలా అధ్యక్షుడు నికోలాస్ మదురోను, ఆయన భార్య సీలియా ఫ్లోరెస్‌ను అమెరికా సైన్యం అపహరించినఘటనకు వ్యతిరేకంగా వెనిజువెలా అంతటా తీవ్ర నిరసనలు ప్రజలు చేస్తున్నారు. రాజధాని కరాకస్‌తో పాటు ప్రధాన నగరాల్లో వృద్ధులు, యువకులు, మహిళలు, పిల్లలు వేల సంఖ్యలో రోడ్లపైకి వచ్చారు.మదురోకు మద్దతుగా బ్యానర్లు పట్టుకొని,నినాదాలు చేస్తూ ప్రజలుప్రదర్శనలు నిర్వహించారు. వెనెజువెలా సార్వభౌమాధికారంపై ఎవరి చేయి పడనివ్వబో మని,తమ ప్రియ నాయకుడు మదురోను ఎంతటి మూల్యం చెల్లించైనా తిరిగి తీసుకువస్తామని వెనెజువెలా ప్రజలుగట్టిగా ప్రకటించారు. విదేశీ సైన్యం దేశంలోకి చొరబడటం ప్రజల్లో తీవ్రఆగ్రహాన్ని రగిలించింది. మరోసారి దాడి జరిగితే దేశమంతా ప్రతిఘటిస్తామని ప్రజలుహెచ్చరించారు. తాత్కాలిక అధ్యక్షురాలిగా ఎన్నికైన డెల్సీ రోడ్రిగ్స్ వెనెజువెలా గగన తలంలో విదేశీ విమానాలపై నియంత్రణ విధించారు. స్వతంత్ర సార్వభౌమ దేశమైన వెనెజువెలాలోకి చొరబడి అమెరికా చేపట్టిన అత్యంత అమానుషమైనదాడిపై ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. అమెరికా పై ధిక్కారం న్యాయ అవగాహన, ప్రజాస్వామ్య ఆలోచనలు కలిగిన ప్రతిఒక్కరినీ షాక్‌కు గురిచేసింది. వామపక్ష ప్రభుత్వాలు ఉన్న దేశాల నాయకులే కాకుండా, ఇతర రాజకీయ ధోరణులు అనుసరించే పాలకులు కూడా ట్రంప్ ప్రభుత్వ చర్యను తీవ్రంగా ఖండించారు. వెనెజువెలాలో జరిగిన దాడిలో తమ పాత్రలేదని, అంతర్జాతీయ చట్టాలను పాటించాల్సిందేనని అమెరికాకు అత్యంత సన్నిహిత మిత్ర దేశమైన బ్రిటన్ ప్రధాని కియర్ స్టార్మర్ తక్షణమే స్పందించడం గమనార్హం.మదురో ప్రభుత్వాన్ని అధికారికంగా గుర్తించని స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్ కూడా అమెరికా దాడిని తిరస్కరించారు. అంతర్జాతీయ నియమాలను ఉల్లంఘించి, దేశాన్ని అనిశ్చితిలోకి నెట్టేలా జరిగిన జోక్యాన్ని అంగీకరించ లేమని సాంచెజ్ స్పష్టంగా చెప్పారు. సాధారణంగా అమెరికాకు మద్దతు ఇచ్చే ఫిలిప్పీన్స్,దక్షిణ కొరియా వంటి దేశాల్లో కూడా విస్తృత స్థాయిలో నిరసన ర్యాలీలు జరిగాయి. వెనెజువెలాపై ఆక్రమణ దాడికి వ్యతిరేకంగా అమెరికాలో కూడా తీవ్రఆగ్రహం వెల్లువెత్తుతోంది.వాషింగ్టన్, న్యూయార్క్, లాస్ ఏంజెలెస్, బోస్టన్‌సహా వందకు పైగా నగరాల్లో వేలాది మంది వీధుల్లోకి వచ్చి నిరసన తెలిపారు. మరో దేశాధ్యక్షుడిని అపహరించే అధికారం అమెరికా ప్రభుత్వానికి లేదని వారునినాదించారు.ఈ ఆందోళనలు ప్రపంచమంతా జరుగుతుండగానే వెనెజువెలాలో మదురోకు జరిగినట్లు మరె ఎక్కడైనా జరగవచ్చన్న బెదిరింపును ట్రంప్, అతని అనుచరులు పదేపదే చెబుతూ బెదిరింపులు చేస్తున్నారు. తానుచెప్పిన దానికి సరైన పనిచేయకపోతే మదురో చెల్లించిన దానికన్నా ఎక్కువ మూల్యంచెల్లించాల్సి వస్తుందని వెనె జువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగెస్‌ను ట్రంప్ బెదిరిస్తున్నారు. డెన్మార్క్‌కు చెందిన గ్రీన్‌ల్యాండ్‌ను తమకు అప్పగించాలని ట్రంప్‌డిమాండ్ చేస్తున్నాడు. ప్రపంచం మొత్తం ఈఅంశంపై కదిలిపోతున్నా, మోడీ ప్రభుత్వం మాత్రం మౌనంలోనే ఉంది. నూనెసంపదపై లాభం, రాజకీయ విద్వేషం పెరిగి ట్రంప్‌ఆదేశాల మేరకు జరిగిన సైనిక చర్యను పేరుకైనా ఖండించడానికి భారత్ సిద్ధంగా లేదు. వెనెజువెలాలో పరిణామాలు ఆందోళనకరమని,రెండు పక్షాల మధ్యశాంతి చర్చలవసరమని మాత్రమే విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రకటన చేసింది. కేంద్రప్రభుత్వ అతివాద విధానాలకు, ట్రంప్ ప్రభుత్వంతో ఉన్న వ్యూహాత్మక సంబంధాలకు అనుగుణంగానే ఈ విషయంలోనూ వైఖరి తీసుకుంది.

# గ్రామీణ జీవనాన్ని కుదిపేస్తున్న కోతుల సమస్య

కె. శ్రీనివాస్ రెడ్డి

వ్యవసాయం అనేది కేవలం ఒక వృత్తి మాత్రమే కాదు.. గ్రామీణ జీవనానికి ప్రాణాధారం. అయితే నేటి పరిస్థితుల్లో ఆ వ్యవసాయం రైతుకు లాభం కాకుండా భారంగా మారుతోంది. ఇందుకు ప్రధాన కారణంగా మారిన అంశం అదుపు తప్పిన కోతుల జనాభా. ఇది ఇక అటవీ ప్రాంతాలకు మాత్రమే పరిమితమైన సమస్య కాదు. గ్రామాలు,పంట పొలాలు, ఇళ్ల ముంగిట వరకూ విస్తరించి, వ్యవసాయంతో పాటు గ్రామీణ జీవన విధానాన్నే కుదిపేస్తున్న తీవ్రమైన సంక్షోభంగా మారింది. ఒకప్పుడు పల్లెల్లో ప్రతి ఇంట్లోనూ తీగజాతి కూరగాయలు, ఆకుకూరలు, వంకాయ, మిర్చి, టమాట వంటి పంటలు సహజంగా పండేవి. ఇంటి అవసరాలకు సరిపడేంత కూరగాయలు ఇంటి ముందర పందిళ్లు, పొలాల గట్ల వెంట ఉండేవి. నేడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కోతుల బెడద కారణంగా గ్రామాల్లో కూరగాయల సాగు దాదాపు అంతరించిపోయింది. ఇక కూరగాయలకే పరిమితం కాకుండా మొక్కజొన్న, మిర్చి, కంది, పెసర, మినుము వంటి పంటలు కూడా కోతుల ధ్వంసానికి గురవుతున్నాయి. పంటలు పండే దశలోనే కోతులు పొలాల్లోకి దూసుకెళ్లి నాశనం చేస్తున్నాయి. రైతు పెట్టిన పెట్టుబడి కళ్లముందే మట్టిపాలవుతుండటంతో సాగు చేయాలనే ఉత్సాహమే కోల్పోతున్నాడు. ఇది కేవలం పంట నష్టంతోనే ఆగడం లేదు. కోతులు ఇళ్లలోకి చొరబడి ధాన్యాలను, వంట సామాగ్రిని ధ్వంసం చేయడం, పిల్లలు-వృద్ధులపై దాడులకు పాల్పడటం వంటి ఘటనలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. గ్రామాల్లో భయాందోళన వాతావరణం నెలకొంది. గ్రామాల్లో ప్రజలు కోతుల భయంతో బతికే పరిస్థితి దాపురించడం అత్యంత ఆందోళనకరం.కూరగాయలు, పప్పుధాన్యాలు, ఇతర వాణిజ్య పంటలు సాగు చేయలేని పరిస్థితుల్లో రైతులు తప్పనిసరిగా వరి పంటవైపు మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా ఒకే పంటపై ఆధారపడే ప్రమాదకర పరిస్థితి ఏర్పడింది. వరిసాగు విస్తృతంగా పెరగడంతో యూరియా వినియోగం విపరీతంగా పెరిగింది. దీని వల్ల యూరియా కొరత, భూసార నాశనం, భూగర్భజలాల కాలుష్యం, సాగు వ్యయం పెరుగుదల వంటి సమస్యలు రైతును మరింత కుంగదీస్తున్నాయి. వ్యవసాయం లాభసాటిగా కాకుండా అప్పుల కూపంగా మారుతోంది. ఈ సమస్య తీవ్రతను ఇటీవల జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికలే స్పష్టంగా ప్రతిబింబించాయి. ముఖ్యంగా సర్పంచ్ ఎన్నికల్లో ప్రజలు అభ్యర్థుల ముందు ఉంచిన ప్రధాన సమస్య కోతుల బెడద కావడం గమనార్హం. రోడ్లు, తాగునీరు, పారిశుద్ధం వంటి అంశాలకంటే ముందుగా -కోతుల నుంచి గ్రామాన్ని ఎలా కాపాడతారు? అనే ప్రశ్నే ప్రధానంగా వినిపించింది. పలువురు అభ్యర్థులు తాము గెలిస్తే కోతుల సమస్యకు పరిష్కారం చూపుతామని హామీ ఇవ్వడం, ఈ సమస్యఎంత తీవ్రమైందో స్పష్టంగా తెలియజేస్తోంది.కోతుల సంఖ్యను నియంత్రించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యంకొనసాగితే, వ్యవసాయం మాత్రమే కాదు, గ్రామీణ జీవన విధానం మొత్తం కూలిపోయే ప్రమాదం ఉంది. ఈ సమస్యను ఇకపై అటవీశాఖ పరిధిలోని అంశంగా కాకుండా,వ్యవసాయ అత్యవసర సమస్యగా ప్రభుత్వం పరిగణించాల్సిన అవసరం ఉంది. కోతుల సంఖ్యను శాస్త్రీయంగా అంచనా వేయడం, కుటుంబ నియంత్రణ కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేయడం, అడవులు-గ్రామాల మధ్య రక్షణ చర్యలు తీసుకోవడం, పంట నష్టానికి తగిన పరిహారం ఇవ్వడం, పంట మార్పిడి విధానాలను ప్రోత్సహించడం వంటి చర్యలు తక్షణమే చేపట్టాలి. లేకపోతే రైతు సాగు మానేస్తాడు.గ్రామాలు ఖాళీ అవుతాయి. ఆహార భద్రతకే ముప్పు ఏర్పడుతుంది. అప్పుడు వ్యవసాయం పండగగా కాదు, దండగగా మారిపోతుంది. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి గ్రామీణ ప్రజలు ఒకటే విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ సమస్యను తక్షణమే పరిగణలోకి తీసుకుని, సమగ్ర విధానంతో పరిష్కరించాలి.లేకపోతే పంటల నాశనం, రైతుల నిరుత్సాహం, వ్యవసాయ వ్యవస్థ పతనం అనివార్యం. ఇది హెచ్చరిక కాదు వ్యవసాయ భవిష్యత్తును కాపాడుకునేందుకు ఇచ్చే గట్టి సంకేతం.

# ఓటు బ్యాంకులుగా ప్రవాస భారతీయులు

రామకిష్టయ్య సంగన భట్ల

ఒకనాడు ఉన్నత విద్య అనంతరం మోహన్ దాస్ కరమ్ చాంద్ గాంధీ దక్షిణా ఆఫ్రికా వెళ్లి న్యాయ వాద వృత్తి చెప్పట్టేలా చేసింది. 1893లో దక్షిణాఫ్రికాకు వెళ్ళిన మహాత్మాగాంధీ, దేశం బానిస రాజుల చేతిలో మగ్గిపోతుంది అనే వాస్తవాన్ని గ్రహించి, 9 జనవరి 1915 న దక్షిణాఫ్రికా నుంచి భారతదేశానికి జాతిపిత మహాత్మాగాంధీ తిరిగి వచ్చిన దినం సందర్భంగా, మహాత్ముడు ప్రవాసీ నాయకుడే అనేభావనతో, ప్రవాస భారతీయుల దినోత్సవం జనవరి 9న జరుపుకొన బడుతున్నది. భారతదేశఅభివృద్ధికి విదేశీ భారతీయ వర్గాల సహకారాన్ని గుర్తించడానికి భారత దేశపు రిపబ్లిక్ ద్వారా జనవరి 9న ఏటా జరిగే వేడుక రోజు. ఎల్.ఎమ్. సింగ్వి నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ జనవరి 2002లో ఈ దినోత్సవాన్ని సిఫారసు చేసింది. 2003 నుండి ప్రతి సంవత్సరం జనవరి 9న ప్రవాస భారతీయుల దినోత్సవాన్ని జరుపుతున్నారు.భారత ప్రభుత్వ విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సమాఖ్య, భారత పరిశ్రమల సమాఖ్య, నార్త్ ఈస్టర్న్ రీజియన్ అభివృద్ధి మంత్రిత్వశాఖ చేత స్పాన్సర్ చేయబడింది. దేశం యావత్తు ప్రవాసీ భారతీయ దివస్ పేరిట ఎన్నో కార్యక్రమం నిర్వహిస్తూ వస్తున్నది భారత ప్రభుత్వం. వివిధ దేశాల్లో భారత సంతతి వారు అందరూ కలిసి దాదాపు 3కోట్ల వరకూ వివిధ దేశాల్లో స్థిరపడ్డారు. మాతృదేశ అభివృద్ధికి ఎందరో దేశాభిమానంతో విశేషకృషి చేస్తున్నారు. నేడు భారత జాతి ప్రగతిలో ప్రవాస భారతీయుల భాగస్వామ్యం చిరస్మరణీయం. ప్రవాస భారతీయుల దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో ప్రశంసనీయమైన కృషి చేసిన ప్రవాస భారతీయులకు భారతదేశ వృద్ధిలో ప్రవాసి భారతీయుల పాత్రను అభినందించడానికి, వారిలో అసాధారణమైన యోగ్యత కలిగిన వ్యక్తులకు, భారత రాష్ట్రపతి ప్రతిష్టాత్మక ప్రవాసీ భారతీయ సమ్మాన్ పురస్కారాలను ప్రతి సంవత్సరం అందజేస్తారు. మానవ జాతి పరిణామ క్రమంలో వలస ఒక ముఖ్యమైన మార్గం, విశ్వవ్యాప్తంగా నా భారతావని అనే స్వామి వివేకానందుల మాటలను నిజం చేస్తూ భారతీయ మూలాలు లేని మనుషులులేరు.ఈ దేశంలో అని ప్రపంచ దేశాల్లో ఒక్కదేశాన్ని కూడా చూపించలేం. భారతీయుల మేధాశక్తి ఒక దశలో వలసపోయిందిఅనకుండా మేధో వలస అనే పరిస్థితి వచ్చింది. చదువు మేధా సంపత్తి వైట్ కాలర్ ఉద్యోగాల పేరిట యూరోప్‌వైపు వలసలు జరిగితే, అపార కండర బలం ఉండి శ్రామికులుగా గల్ఫ్ దేశాలకు నిరక్షరాస్యులైన కార్మిక వర్గం విస్తృత స్థాయిలో




వలసలు జరిగాయి. వలసల ప్రక్రియ భారతజాతి వికాసానికి గణనీయమైన బాటలు పరిచింది. వ్యక్తిగత అభివృద్ధితో పాటు దేశాభివృద్ధి శరవేగంగా జరగడం ప్రారంభమైంది. 90వ దశకంలో వచ్చిన ఆర్థిక సరళీకరణ, ప్రపంచీ కరణ విధానాలు కూడా కొంత అభివృధికి దోహదపడ్డాయి. ఈ వలసలకు అభివృద్ధికిగల ప్రముఖమైన సంబంధాన్ని కాదనలేం, విస్మరించలేం. కానీ ఈ ప్రవాసీ భారతీయ దివస్ బడా పారిశ్రామిక వేత్తల పెట్టుబడిని ఆహ్వానించే ఒక సంపన్నుల కార్య స్థలంగా రూపు దిద్దుకొన్నదే కానీ, శ్రమ జీవులను ఒక్క తాటికి తీసుకొచ్చె శ్రమైక జీవన సౌందర్యాన్ని ఒక వేదికపై ఆవిష్కరించలేకపోయింది. ఈ వలసలను విస్తృత కోణంలో అర్థం చేసుకోగలిగితే ప్రతి ఒక్కరి ప్రయోజనాలు నెరవేరుతాయి, సమిష్టి ప్రయోజనాలు మెరుగు పడుతాయి. ఒక వైపు ప్రపంచం ఒక కుగ్రామం అయినా నేడు సంపన్న పాశ్చాత్య దేశాల భారతీయుల సేవలు ఇంకా అవసరమైన దేశాలు స్థిర నివాసం ఏర్పరుచుకొనుట కోసం ఎన్నో రాయితీ ప్రయోజనాలు వలస మార్గాలను సులభతరం చేశాయి. అనేక దేశాలలో ప్రవాస భారతీయులు అక్కడి దేశపు చట్టసభల్లో ప్రముఖమైన స్థానాల్ని కైవసం చేసుకుంటున్నారు. మరో వైపు ఈ గల్ఫ్ దేశాలకు పెద్ద సంఖ్యలో మన దేశంనుండి కార్మికుల వలసలు 1970 నుండిమొదలై, నేటికీ కొనసాగుతున్నాయి. వీరి ఆర్జన మొత్తం ఈ దేశానికి పంపుతున్న ఆర్థిక సైనికులైన గల్ఫ్‌వలస కార్మికుల వలస జీవితాల్లో గణనీయమైన మార్పు రావాల్సి ఉంది.కార్మికులుగా వలస వెళ్లిన వీరు తిరిగికుటుంబాన్ని కలవాలిఅంటే అది ఒక గొప్ప విజయమే. ఇట్టి కార్మికులు గల్ఫ్ నుండి 48 డిగ్రీల పై ఉండే అధిక ఉష్ణోగ్రతలో తమ రక్తాన్ని చెమట చుక్కలుగా, ఆపై విదేశీ మారకంగా మార్చి పంపుతున్న క్రమంలో, విదేశీ మారకంతో క్రూడాయిల్, పెట్రోల్ వంటివి కొనడానికి ఉపయోగపడుతున్నాయి. కార్మికుడిగా వెళ్లి ఎన్నో వ్యాపారాల్లో ఉన్నత స్థాయి అందుకున్న మన భారతీయ గల్ఫ్ ప్రవాసీలు, ప్రవాసీ భారతీయ దివస్‌లో ప్రవాసీ సమ్మాన్ అవార్డు అందుకోలేకపోతున్న అంశమే బాధాకరం. టాక్స్‌ల రూపంలో అందుకుంటున్న ప్రభుత్వాలు, వారిదీర్ఘ కాలిక సమస్యల పరిష్కారానికి విధాన పరమైన నిర్ణయాలు తీసుకున్న దాఖలాలే లేకపోగా వారిని ఓటు బ్యాంక్‌గా మార్చుకుంటూ, ఆచరణకు నోచులోని హామీలతో కాలం వెళ్లదీయడం అత్యంత శోచనీయం. గల్ఫ్ వలస కార్మికులకు కనీస ప్రాతినిధ్యలేని, ప్రవాసీ భారతీయ దివస్‌ను 'మజ్దూర్ ప్రవాసీ భారతీయ దివస్' గా మార్చాలని దశాబ్దానికి పైగా ప్రవాసుల సంక్షేమ వేదిక అధ్యక్షులు నిరంతరం కార్మికుల హక్కులకోసం అవిశ్రాంతంగా పోరాడుతూనే ఉన్నారు. కార్మికుల జీవిత భీమా,ఆరోగ్య సంరక్షణ, మృత ధనసహాయం, పునరావాసం పునరేకీకరణ, నైపుణ్యంతో తిరిగి వచ్చినకార్మికులకు తోడ్పాటు, ప్రధానంగా గల్ఫ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, అప్పుడే ప్రవాసీల కృషికి గుర్తింపు ఇచ్చినట్లు అవుతుందని ప్రవాసీ లేబర్ యూనియన్ అధ్యక్షులు స్వదేశ్ పరికి పండ్ల అభిప్రాయపడుతున్నారు.

# తెలంగాణలో ఐడిటిఆర్‌ను ఏర్పాటు చేయాలి

## పెండింగ్‌లో ఉన్న సాస్-సి నిధులు రూ. 175 కోట్లు విడుదల చేయాలి

### కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీకి రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి



**హైదరాబాద్, జనవరి 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలో డ్రైవింగ్ ట్రెయినింగ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఐడిటిఆర్)ను ఏర్పాటు చేయాలని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. న్యూఢిల్లీలోని భారత మండపంలో కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ అధ్యక్షతన అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల రవాణా మంత్రులతో రవాణా అభివృద్ధి మండలి 43వ సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశం సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిసి తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన పలు ముఖ్యమైన రవాణా అంశాలపై వివరమైన ప్రతిపాదన పత్రాన్ని సమర్పించారు. ప్రధానంగా రాష్ట్రంలో డ్రైవింగ్ ట్రెయినింగ్ అండ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ (ఐడిటిఆర్)ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. రవాణా మౌలిక వసతుల అభివృద్ధి కోసం రూ. 175 కోట్ల సాస్‌సీ(ఎస్ఏఎస్‌సి) నిధుల మంజూరు చేయాలన్నారు. అలాగే మోటార్ వాహనాల చట్టంలో ప్రతిపాదిత సవరణలు, వాటి ప్రభావం గురించి అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో రహదారి భద్రత, డ్రైవర్ శిక్షణతో రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వ సహకారం అత్యవసరమని మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర మంత్రికి వివరించారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన అంశాలను సానుకూలంగా పరిశీలించి, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు మంత్రి కార్యాలయం ప్రకటించింది. సమావేశంలో తెలంగాణ రాష్ట్రం నుండి పాల్గొన్న రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రవాణా శాఖ స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తితోపాటు రవాణా శాఖ ఉన్నతాధికారులు పాలొనగన్నారు. ఈ సందర్భంగా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రసంగిస్తూ.. హైదరాబాద్ నగరంలో ఓఆర్ఆర్ పరిధిలో దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ తీసుకుంటున్నారు. అందులో భాగంగా ఓఆర్ఆర్ పరిధిలో కేవలం ఎలక్ట్రిక్ వాహనాలను మాత్రమే నడిచే విధంగా మొదట ఆర్టీసి బస్సులను పూర్తిస్థాయిలో ఎలక్ట్రిక్ బస్సులు నడపనున్నామని, తరువాత టాక్సీలు, ఆటో రిక్షాలు, ఇతర కమర్షియల్ వాహనాలకు వర్తింపజేస్తామన్నారు. ఇప్పటికే హైదరాబాద్ నగరంలో భారీగా ఎలక్ట్రిక్, ఎల్పీజీ, సీఎన్‌జీ ఆటోలకు అనుమతి ఇవ్వడంతో పాటు డీజిల్ ఆటోల స్థానంలో రేట్రోఫిటింగ్ అనుమతి ఇవ్వడం జరిగిందన్నారు. రాష్ట్రంలో జీవో 41 ద్వారా ఈవి పాలసీ తీసుకొచ్చామన్నారు. గతంలో 2020లో రాష్ట్రంలో 4376 ఎలక్ట్రిక్ వాహనాలు ఉంటే.. ఈవి పాలసీ తీసుకొచ్చిన తర్వాత 2025 లో 2,58,325 ఎలక్ట్రిక్ వాహనాలకు పెరిగిందన్నారు.



# కృత్రిమ మేధకు కేరాఫ్ అడ్రస్‌గా హైదరాబాద్

### ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 8:** కృత్రిమ మేధ సాంకేతికతలో దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా హైదరాబాద్ పరుగులు పెడుతోందని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. గురువారం నాడు ఆయన హైటెక్ సిటీలో ఎయిడెన్ ఏఐ ఇంజనీరింగ్ కేంద్రం విస్తరణ పనులను ప్రారంభించిన సందర్భంగా ప్రసంగించారు. రెండేళ్లలో తమ ప్రభుత్వం అభివృద్ధి చేసిన ఏకో సిస్టం వల్ల ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు ఇవ్వాళ తెలంగాణ వైపు చూస్తున్నాయని ఆయన తెలిపారు. ఎయిడెన్ ఏఐలో ప్రస్తుతం 500 మంది నిపుణులు పనిచేస్తుండగా వచ్చే రెండేళ్లలో మరో 500 మంది ప్రతిభావంతులకు ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. న్యూజెర్సీలోని ప్రిన్స్‌టన్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ సంస్థ కృత్రిమ మేథలో నూతన ఆవిష్కరణల ద్వారా ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని తెలిపారు. ఏఐని విస్తృత కార్యకలాపాలకు అభివృద్ధి చేసే సంస్థలను తమ ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సహిస్తుందని శ్రీధర్‌బాబు వివరించారు. కార్యక్రమంలో సంస్థ సిఓఓ కిరణ్ వెంట్రప్రగడ, సిఈఓ శ్రీని కమాడి, కవితా మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

### కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్‌కు టిపియుఎస్ విజ్ఞప్తి

**హైదరాబాద్, జనవరి 8, ప్రభాతవార్త:** ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకి టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్) నుంచి మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టిపియుఎస్) విజ్ఞప్తి చేసింది. ఎన్‌సిటిఈ అఫిడవిట్‌లో పొందుపర్చిన అంశాలను తెలుసుకొని న్యాయ సలహా తీసుకొని సమస్యను పరిష్కరిస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్టు తపస్ రాష్ట్ర అధ్యక్షులు హన్మంతరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ తెలిపారు. గురువారం న్యూఢిల్లీలో శాస్త్రి భవన్‌లో కేంద్ర విద్యాశాఖ ధర్మేంద్ర ప్రధాన్‌కి, కేంద్ర పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి సంజయ్ కుమార్‌ని అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్(ఏబిఆర్ఎస్ఎం) తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టిపియుస్) ఆధ్వర్యంలో టెట్ మినహాయింపు ఇవ్వాలని తగు ఆధారాలను చూపిస్తూ, ఎన్‌సిటిఈ ఆగస్టు 23, 2010న ఇచ్చిన నోటిఫికేషన్‌లో 4వ పాయింట్‌లో పేర్కొన్న విధంగా టెట్ అనేది అవసరంలేదని స్పష్టంగా ఉన్న విషయాన్ని వివరించిన తరువాత ఎన్‌సిటిఈ ఛైర్మన్‌తో ఫోన్‌లో మాట్లాడి దాని వివరణ అడిగితే శుక్రవారం న్యాయకోవిదులతో మాట్లాడి పూర్తీ సమాచారం ఇస్తామని ఎన్‌సిటిఈ ఛైర్మన్ చెప్పారని తపస్ నేతలు తెలిపారు. ఇదే సమయంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి మాట్లాడుతూ ఎన్‌సిటిఈ అఫిడవిట్‌లో ఏఏ అంశాలు ఉన్నాయి? వేటిని పొందుపర్చలేదు అనే విషయాలను తెల్సుకొని న్యాయ సలహా తీసుకోని సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని తపస్ నేతలు చెప్పారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో ఏబిఆర్ఎస్ఎం జాతీయ అధ్యక్షులు నారాయణ్ లాల్ గుప్తా, ప్రధానకార్యదర్శి గీత భట్, జాతీయ సంఘటన, సహా సంఘటన కార్యదర్శులు మహేందర్ కపూర్, గుంత లక్ష్మణ్, సీనియర్ వైస్ ప్రసిడెంట్ మహేందర్ కుమార్, జాతీయ పాఠశాల ప్రముఖ్ శివానంద, తపస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు హన్మంత్ రావు, తమిళనాడు రాష్ట్ర ప్రతినిధి కండె స్వామి ఉన్నారు.

# ఎసిబికి చిక్కిన కెయు ఎస్ఐ శ్రీకాంత్




**వరంగల్ క్రైం, జనవరి 8, ప్రభాతవార్త:** వరంగల్ కమిషనరేట్ పరిధిలో పేకాట ఆడుతూ పట్టుబడ్డ నిందితుని నుంచి 15 వేలు లంచం తీసుకుంటుండగా ఎస్సై శ్రీకాంత్ పట్టుబడ్డారు. పేకాట కేసులో నిందితున్ని తప్పించే క్రమంలో లంచం డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. ఎసిబి అధికారులు వల పన్ని పట్టుకోవడంతో నగరంలో ఒక్కసారిగా పోలీస్ శాఖ ఉలిక్కి పడింది. నేరాలు నియంత్ర చేసే పోలీసులు నేరాల్లో చిక్కుకోవడం నగరంలో చర్చనీయాంశంగా మారింది. లక్షల్లో జీతాలు తీసుకుంటున్న ప్రభుత్వ అధికారుల లంచాలు తీసుకుంటూ పట్టబడడం దురదృష్టకరమని నగర ప్రజలు సామాజిక మాధ్యమాల్లో నేటిజన్లు సెటైర్ వేస్తున్నారు.

# డిజిపి నియామకంపై హైకోర్టులో వాదనలు పూర్తి

### తీర్పు రిజర్వు..నేడు తీర్పు ఇవ్వనున్న న్యాయస్థానం

**హైదరాబాద్, జనవరి 8, ప్రభాతవార్త:** రాష్ట్ర పోలీస్ బాస్(డిజిపి) నియామకంపై హైకోర్టులో దాఖలైన పిటిషన్‌పై వాదనలు పూర్తయ్యాయి. తీర్పును రిజర్వు చేసిన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం నేడు(శుక్రవారం) తీర్పు ఇవ్వనున్నట్టు ప్రకటించింది. రాష్ట్ర డిజిపిగా జితేందర్ స్థానంలో గతేడాది ప్రభుత్వం శివధర్ రెడ్డిని నియమించింది. ఈ నియామకం సుప్రీంకోర్టు నిబంధనలకు అనుగుణంగా జరగలేదని హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. రెండు వారాల్లోగా ఐపీఎస్ అధికారులతో కూడిన ప్యానెల్ లిస్టును యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు పంపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని గతేడాది డిసెంబర్ 24న ఆదేశించింది. ఇందుకు సంబంధించిన వాదనలు గురువారం పూర్తయ్యాయి. వాదనలు పూర్తయినప్పటికీ తీర్పును వెలువరించని హైకోర్టు.. రేపటికి రిజర్వ్ చేసింది. తెలంగాణ రాష్ట్రంలో పూర్తిస్థాయి డిజిపి నియామకానికి రాష్ట్రప్రభుత్వం యుపిఎస్‌సికి ప్రపోజల్స్ పంపింది. ప్రస్తుత డిజిపి శివధర్ రెడ్డి, సీనియర్ ఐపీఎస్ అధికారులు సీవీ ఆనంద్, ఆప్టే, సౌమ్య మిశ్రా, శిఖా గోయల్ పేర్లను జాబితాలో ఉంచింది. అయితే సుప్రీంకోర్టు అనుమతి కావాలంటూ ఆ జాబితాను యుపిఎస్‌సి రాష్ట్ర ప్రభుత్వానికి తిరిగి పంపింది. లిస్టును ఆలస్యంగా పంపడంతో.. సుప్రీంకోర్టు అనుమతి కావాలని సమాధానమిచ్చింది.

# షాద్‌నగర్‌లో గుట్టుగా సెక్స్ రాకెట్

### దాడులుచేసి పట్టుకున్న ప్రత్యేక పోలీసు బృందం

### ముంబై, గుజరాత్ యువతులతో వ్యభిచారం

**షాద్‌నగర్, జనవరి 8, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణ కేంద్రంలో సెక్స్‌రాకెట్ ముఠా దందా కొనసాగిస్తున్నది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఎస్ఒటి పోలీసులు గురువారం సాయంత్రం సెక్స్ రాకెట్ ముఠా నిర్వహిస్తున్న కార్యకలాపాల వద్ద వారిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. షాద్‌నగర్ సిఎస్కె వెంచర్‌లో గత కొంతకాలంగా ముంబై గుజరాత్, ప్రాంతాలకు చెందిన జావేద్, ఫాతిమా భార్యభర్తలు ముగ్గురు యువతులను పెట్టి సెక్స్‌రాకెట్ నడుపుతున్నారు. ఎట్టకేలకు విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఎస్ఒటి పోలీసులు పథకం ప్రకారం సిఎస్కె వెంచర్‌లో గుట్టుగా నిర్వహిస్తున్న ఓ విల్లాను చుట్టుముట్టి జావేద్, ఫాతిమాలతోపాటు నిషా మరో ఇద్దరిని అదుపులోకి తీసుకొని స్థానిక పోలీసులకు అప్పగించారు. ఈ విషయమై స్థానిక సీఐ విజయ్‌కుమార్‌ను వివరణ కోరగా తనకు తెలియదని మీడియాకు చెప్పారు. అయితే ఎస్ఒటి పోలీసులు ముగ్గురు బాధితులతోపాటు నిర్వాహకులను అదుపులోకి స్థానిక పోలీసులకు అప్పజెప్పినట్లు సమాచారం.

# జెఇఇ మెయిన్-2026 మొదటి విడత పరీక్షల షెడ్యూల్ విడుదల

### పరీక్ష కేంద్రాల నగరాలను తెలుసుకోవడానికి..

### అడ్వాన్స్ ఇంటిమేషన్ స్లిప్స్ విడుదల చేసిన ఎన్‌టిఎ

**హైదరాబాద్, జనవరి 8, ప్రభాతవార్త:** దేశంలోని ఐఐటీలు, ఎన్ఐటీల్లో ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరడానికి జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(జెఈఈ) మెయిన్-2026 జనవరి పరీక్షల షెడ్యూల్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఏ) గురువారం విడుదల చేసింది. పరీక్షలను జనవరి 21 నుంచి 30 వరకు అని గతంలో ప్రకటించగా.. అందుకు సంబంధించిన తేదిలను ప్రకటించింది. దాంతోపాటు విద్యార్థులకు పరీక్షా కేంద్రాలు ఏ ఏ నగరాల్లో ఉన్నాయో తెలుసుకోవడానికి అడ్వాన్స్ సిటీ ఇంటిమేషన్ స్లిప్స్‌ను కూడా ఎన్‌టిఏ విడుదల చేసింది. తద్వారా జెఈఈ మెయిన్ పరీక్షలు ఏ ఏ నగరాల్లో ఉన్నాయో విద్యార్థులు తెలుసుకునే వీలు ఏర్పడుతుంది. జనవరి 21 నుంచి 29 వరకు జరిగే పరీక్షలకు మీ ఎగ్జామ్ సెంటర్ ఏ నగరంలో ఉందో ముందుగానే తెలుసుకొనేలా జెఈఈ మెయిన్ సిటీ ఇంటిమేషన్ స్లిప్-2026ను అందుబాటులోకి తీసుకొచ్చినట్టు ఎన్‌టిఏ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. అభ్యర్థులు తమ అప్లికేషన్ నంబర్, పాస్ వర్డ్, సెక్యూరిటీ పిన్ ఎంటర్ చేసి వాటిని డౌన్లోడ్ చేసుకోవచ్చని ఎన్‌టిఏ ఎగ్జామ్స్ డైరెక్టర్ తెలిపారు. అయితే ఇది అడ్మిట్ కార్డు కాదని స్పష్టం చేశారు. జెఈఈ మెయిన్-2026 జనవిలో జనవరిలో జరిగే మొదటి విడత పరీక్షలను ..జనవరి 21, 22, 23, 24, 28 తేదీల్లో పేపర్-1 పరీక్షలు జరుగుతాయని తెలిపింది. మొదటి షిప్ట ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరగనుండగా.. రెండో షిఫు పరీక్ష మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు జరగనుంది. జనవరి 29న పేపర్-2ఎ (బీఆర్క్) పేపర్-2బి (బి ప్లానింగ్) పరీక్షలను ఒకే షిప్టులో నిర్వహించనున్నారు. ఈ పరీక్షను ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు నిర్వహించనున్నారు. జెఈఈ మెయిన్ మొదటి విడత పరీక్షలను దేశవ్యాప్తంగా వివిధ నగరాలతోపాటు విదేశాల్లోని 15 నగరాల్లో నిర్వహించనున్నట్లు ఎన్టీఏ డైరెక్టర్ (ఎగ్జామ్స్) గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ఎగ్జామ్ సిటీ ఇంటిమేషన్ స్లిప్పుల డౌన్‌లోడ్‌లో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే అభ్యర్థులు 011 -40759000 నంబరులో ఎన్‌టిఏ అధికారిక వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

# గవర్నర్‌తో ఒయు విసి ఆచార్య కుమార్ మొలుగరం భేటీ

### వర్సిటీలో అభివృద్ధి కార్యక్రమాలు, బోధన, పరిశోధనలపై చర్చ

**హైదరాబాద్ (తార్నాక), జనవరి 8, ప్రభాతవార్త:** గవర్నర్, ఒయు ఛాన్స్‌లర్ జిష్ణుదేవ్‌వర్మను లోక్ భవన్‌లో ఒయు ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరం గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వర్సిటీ అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థుల తరఫున నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ప్రొఫెసర్ కుమార్ వర్సిటీలో చేపడుతున్న కార్యక్రమాలను నివేదించారు. వర్సిటీని అన్నివిధాలుగా అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని అందుకు అనుగుణంగా ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తున్న తీరును గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రశంసించారు. సిఎం ఒయు పర్యటన, రూ. 1000 కోట్ల నిధుల మంజూరు, అభివృద్ధి కార్యక్రమాల వివరాలను గవర్నర్ అడిగి తెలుసు కున్నారు. ఎన్.ఐ.ఆర్.ఎఫ్‌సహా అంతర్జాతీయ స్థాయి ర్యాంకింగ్‌లలో ఉత్తమ స్థానం కోసం ఒయూ పాలకవర్గం చేపడుతున్న చర్యలపై జిష్ణుదేవ్‌వర్మ సంతృప్తి సంతోషం చేశారు. విద్య, పరిశోధన, పాలన రంగాల్లో సాధిస్తున్న గణనీయమైన పురోగతిని ప్రశంసించారు.

ఇదిలా ఉండగా ఫిబ్రవరిలో జరగనున్న సెంట్రల్ జోన్ ఉపకులపతుల జాతీయ సదస్సుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను అధికారికంగా ఆహ్వానించారు. ఈ సదస్సుకు ఆయా రాష్ట్రాల నుంచి ఉపకులపతులు, విద్యావేత్తలు, విధాన నిర్ణేతలు, ప్రముఖులు హాజరై ఉన్నత విద్యలో సంస్కరణలు, భవిష్యత్తుపై చర్చిస్తారని వివరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఓయూలో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. దేశంలోని మహిళా ప్రముఖులు, ఆయా రంగాల్లో నిష్ణాతులైన వారితో చర్చాగోష్ఠి జరుపుతామని చెప్పారు. ఈ కార్యక్రమానికి కూడా ముఖ్యఅతిథిగా హాజరుకావాలని గవర్నర్‌ను కోరారు. ప్రొఫెసర్ కుమార్ ఆహ్వానాన్ని స్వీకరించిన గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ విద్య, సామాజిక కార్యక్రమాలు సహా జాతీయ ప్రాధాన్యత కలిగిన విద్య సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు తాను సంతోషిస్తానని స్పష్టం చేశారు. కొత్త సంవత్సరంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం సమగ్ర అభివృద్ధి సాధించాలని విద్య, పరిశోధనా రంగాల్లో విజయవంతం కావాలని ఆకాంక్షించారు. గవర్నర్‌ను కలిసిన వారిలో ఒయు ఉపకులపతి కుమార్ మొలుగరంతో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. నరేష్‌రెడ్డి పాల్గొన్నారు.



గవర్నర్‌కు ఒయు డైరీని అందజేస్తున్న విసి ప్రొ.కుమార్ మొలుగరం

# మాజీ ఐపిఎస్ నివాసం ముందు అగంతకుడి హాల్‌చల్

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జనవరి 8, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్‌లో మాజీ ఐపిఎస్ నివాసం ముందు కారులో వచ్చిన ఒక అగంతకుడు అర్ధరాత్రి వేళ హాల్‌చల్ చేసిన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకొంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. మాజీ ఐపీఎస్ వీకే సింగ్ జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్‌లో ప్లాట్ నంబరు 49లో నివసిస్తున్నారు. కాగా డిసెంబరు 30న 1 గంట ప్రాంతంలో ఒక కియా కారులో వచ్చిన అగంతకుడు వీకే సింగ్ నివాసం వద్దకు వచ్చాడు. గేటును బలవంతంగా ఢీకొట్టాడు. పార్కింగ్ ప్రాంతంలోకి ప్రవేశించి అసభ్యకరమైన భాషను ఉపయోగించడమే కాకుండా దూషించాడు. వీకే సింగ్‌తోపాటు చుట్టుపక్కల నివాసితులను ఇబ్బందికి గురిచేశాడు. వీకే సింగ్ అధికారి అయినప్పటికి పట్టించుకోకుండా గంటన్నరపాటు అక్కడ న్యూసెన్స్‌కు పాల్పడ్డాడు. అక్కడున్న వారికి ఫోన్‌చేసి ఇళ్లను, వాహనాలను ధ్వంసం చేస్తానంటూ బెదరింపులకు దిగాడు. వీకేసింగ్ ఇంట్లో పనిచేస్తున్న సిబ్బందితో పాటు చుట్టుపక్కల వారు అగంతకుడిని అదే ప్రాంతంలో ప్లాట్‌నంబరు 40లో నివసించే తాబ్రెజ్‌గా గుర్తించారు. అతనిపై పోలీసు కానిస్టేబుల్ జస్వంత్‌కుమార్ ఫిర్యాదు చేయగా జూబ్లీహిల్స్ పోలీసులు తాబ్రెజ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ట్యూబెక్టమీ వికటించి మృతి కేసులో రూ.8 లక్షల పరిహారం

### మృతురాలి భర్తకు ఉపాధి సిఫార్సు చేసిన మానవ హక్కుల కమిషన్

**హైదరాబాద్, జనవరి 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ట్యూబెక్టమీ వికటించి మృతి చెందిన కేసులో రూ. 8 లక్షల పరిహారం అందించాలని, అలాగే మృతురాలి భర్తకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ హ్యూమన్ రైట్స్ కమిషన్(టిపిహెచ్ఆర్‌సి) సిఫార్సు చేసింది. హెచ్‌ఆర్‌సి నంబర్ 2355 ఆఫ్ 2018 కేసులో ఈ నెల 6న జారీ చేసిన ఉత్తర్వుల ద్వారా డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ అధ్యక్షతన ఉన్న తెలంగాణ మానవ హక్కుల కమిషన్ (టిజిహెచ్ఆర్‌సి) వనపర్తి జిల్లాలోని ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో నిర్వహించిన ట్యూబెక్టమీ శస్త్రచికిత్స అనంతరం ఎం. లలిత అనే మహిళ మృతి చెందడానికి వైద్య నిరక్ష్యం కారణమైందని నిర్ధారించి.. అందుకు తెలంగాణ ప్రభుత్వాన్ని వికేరియస్ లయబిలిటీకి లోబరచింది. శస్త్రచికిత్స సమయంలో ఐలియల్ ఫర్ఫొరేషన్ జరగడం, దానిని సకాలంలో గుర్తించడంలో జరిగిన ఆలస్యం వల్ల సెప్టిక్ పెరిటోనైటిస్ ఏర్పడి కార్డియో-పల్మనరీ అరెస్ట్‌కు దారితీసిందని కమిషన్ స్పష్టం చేస్తూ, ఇది సాధారణ శారీరక ప్రతిచర్య మాత్రమే అన్న వాదనను తిరస్కరించింది. ఇప్పటికే చెల్లించిన రూ.2 లక్షల నష్ట పరిహారం మృతురాలి వికలాంగ భర్త, ఇద్దరు మైనర్ కుమారుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుంటే పూర్తిగా సరిపోదని గమనించిన కమిషన్, అదనంగా రూ. 8 లక్షల పరిహారం చెల్లించాలని సిఫార్సు చేసింది.

# జిఒ 229ను వెనక్కి తీసుకోవాలి

### విద్యార్థుల స్టయిపెండ్‌ను దోచుకుంటుకున్న ప్రైవేటు మెడికల్ కాలేజీలు

### వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శికి ఎబివిపి విజ్ఞప్తి

**హైదరాబాద్, జనవరి 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రైవేటు మెడికల్ కాలేజీలు విద్యార్థుల స్టయిపెండ్‌ను దోచుకుంటున్నాయని అఖిల భారత విద్యార్థి పరిషత్(ఏబివిపి) తెలంగాణ రాష్ట్ర శాఖ మండిపడింది. దీనిని అరికట్టేలా చర్యలు తీసుకోవాలని, అలాగే డాక్టర్ల హక్కులను కాలరాస్తూ తెలంగాణ మెడి కల్ కౌన్సిల్(టిజిఎంసి)లో ఎక్స్ అఫిషియో సభ్యుల పెత్తనాన్ని ప్రోత్సహించే జీవో నంబర్ 229ని వెంటనే వెనక్కి తీసుకోవాలని సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మాచెర్ల రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏబివిపి అధ్వర్యంలో గురువారం వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శికి, డైరక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డిఎంఈ)కి విజ్ఞప్తి చేసినట్టు తెలిపారు. ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో చదువుతూ, ఇంటర్న్‌షిప్ చేస్తున్న విద్యార్థులకు ప్రభుత్వం అందించే స్టైఫెండ్‌ని మెడికల్ కళాశాలల యాజమాన్యాలు దోచుకోవడాన్ని ఖండిస్తున్నామని రాంబాబు తెలిపారు. అదేవిధంగా వైద్యుల హక్కులను కాలరాస్తూ టిజిఎంసిలో ఎక్స్ అఫిషియో సభ్యుల పెత్తనాన్ని ప్రోత్సహించే జీవో నంబర్ 229ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎంబిబిఎస్ విద్యార్థులకు అన్యాయం చేస్తున్న కళాశాలపై విజిలెన్స్ ఎంక్వైరీ కి ఆదేశించినట్లు, ప్రభుత్వం ఈ విషయమై సీరియస్‌గా ఉన్నట్లు అధికారులు తెలిపారని రాంబాబు మీడియాకు చెప్పారు.

# ప్రజాపాలనలో రెండేళ్లలోనే తెలంగాణకు కొత్త దిశ

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 8:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకుని మూడో వసంతంలోకి అడుగుపెట్టిందని ఈ రెండు సంవత్స రాలలో తెలంగాణ రాష్ట్రానికి ఒక స్పష్టమైన కొత్త దిశను చూపిస్తూ అభివృద్ధి- సంక్షేమాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగు తోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. 'రైజింగ్ రేవంత్‌రెడ్డి, రెండేళ్ల పాలనలో పదేళ్ల ప్రగతి' పేరుతో స్పీక్ సంస్థ రూపొందించిన సావనీర్ ను గురువారం తన నివాసంలో ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డితో కలసి మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మా ట్లాడుతూ... ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ తెలంగాణను అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. రాబోయే కాలంలో మరింత వేగంగా అభి వృద్ధి, మరింత విస్తృతంగా సంక్షేమం అందేలా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని, ప్రతి నిర్ణయంలో ప్రజలే కేంద్రబిందువుగా తమ ప్రభుత్వ నిర్ణయాలు ఉంటాయని అన్నారు. పదేళ్లుగా నిర్లక్ష్యం, అవినీతి, అహంకార పాలనతో వెనుకబడ్డ తెలంగాణను తిరిగి గాడిలో పెట్టే బాధ్యతను కాంగ్రెస్ ప్రభుత్వం స్వీకరించిందని మంత్రి పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలను విధానాలుగా మలుస్తూ, మాటలు కాదు - పనులే ప్రామాణికంగా పరిపాలన సాగిస్తున్నామని తెలిపారు. రెండేళ్ల కాలంలోనే రైతులు, పేదలు, మహిళలు, యువత, దళితులు, గిరిజనులు, మైనారిటీలకు న్యాయం చేసే దిశగా కీలక నిర్ణయాలు తీసుకున్నామని, సంక్షేమ పథకాలను కాగితాలకే పరిమితం చేయకుండా ప్రజలకు అందించామని మంత్రి అన్నారు. రెవెన్యూ శాఖ పరంగా భూ పరిపాలనలో పారదర్శకత తీసుకురావడం, భూ వివాదాలకు శాశ్వత పరిష్కారాలు చూపడం, ప్రభుత్వ భూముల పరిరక్షణ, ఆధునిక సాంకేతికతతో సర్వే ప్రక్రియలను వేగవంతం చేయడం వంటి చర్యలు ప్రజలకు నేరుగా మేలు చేస్తున్నాయని అన్నారు.



గురువారం ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్‌రెడ్డితో కలసి స్పీక్ సంస్థ రూపొందించిన సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి పొంగులేటి

# తెలంగాణలోనూ బిసి రక్షణ చట్టం తేవాలి

### 42శాతం రిజర్వేషన్లతోనే మున్సిపాలిటీ ఎన్నికలు నిర్వహించాలి

### బిసి ఇంటలెక్చువల్ ఫోరం-బిసి పొలిటికల్ జెఎసి డిమాండ్

**హైదరాబాద్, జనవరి 8, ప్రభాతవార్త:** భారతదేశంలోనే అత్యధిక బిసి జనాభా కలిగిన రాష్ట్రం తెలంగాణ అని.. ఎపి మాదిరిగా తెలంగాణలోనూ తక్షణమే బిసి రక్షణ చట్టం రూపొందించి రాజ్యాంగ హక్కులను పరి రక్షించాలని బీసీ ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్ మాజీ ఐఎఎస్ చిరంజీవులు అన్నారు. ఈ మేరకు గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో చిరంజీవులుతోపాటు బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్‌లు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా బీసీలపై అక్రమ దాడులు చేస్తూ వివక్షతకు గురి చేస్తున్న అగ్రకులాలపై బీసీ రక్షణ చట్టం రూపొందించి చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. 42 బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్లో చేర్చిన తర్వాతే మునిసిపాలిటీ,ఎంపీటీసీ, జెడ్పిటిసి ఎన్నికలు నిర్వహించాలని కాంగ్రెస్ ప్రభు త్వాన్ని డిమాండ్ చేస్తున్నామని లేనిపక్షంలో రాష్ట్రాన్ని అగ్నిగుండంగా మారుస్తామని హెచ్చరించారు. ఈనెల 31 నుండి పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న తరుణంలో అఖిలపక్షాన్ని, బీసీ సంఘాలను ప్రధానమంత్రితో సమావేశం ఏర్పాటు చేయాలని రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. 2009లో విద్య రంగంలో 25 రిజర్వేషన్లు అమలు చేయాలని చట్టం చేసిన నేటికి అమలు చేయకుండా కార్పోరేట్ శక్తులకు తలొగ్గి బీసీ విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ఉద్యోగాల్లో 42 శాతంకుచట్టం చేయకుండా నాటకాలు ఆడుతున్నారని బీసీ లపై జరుగుతున్న దాడులపై ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయాలని ఎస్సీ, ఎస్టీ యాక్ట్ తరహాలోనే బీసీ రక్షణ చట్టంలో పొందుపరిచి ఆంధ్రప్రదేశ్‌లో మాదిరిగా ముసాయిదా చట్టం తెలంగాణ లో రూపొందించాలని వారు కోరారు .ఈ సమావేశంలో బీసీ పొలిటికల్ ఫ్రింట్ వైస్ చైర్మన్ ఎస్ దుర్గయ్య గౌడ్, రాష్ట్ర కన్వీనర్లు బైరు శేఖర్ గంగపుత్ర, అంబాల నారాయణ గౌడ్, యెలికట్టే విజయకుమార్ గౌడ్, ఎర్రమాదు వెంకన్న నేత, గనం నరసింహా కుర్మ, గోలి యాదగిరి రజక, పొన్నం దేవరాజ్ గౌడ్ బీసీ న్యాయవాదులు జేఏసీ చైర్మన్, చెన్న శ్రీకాంత్ నేత,సురేష్ ఆనంద్, శంకర్ గంగపుత్ర, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



బిసి రక్షణ చట్టం తేవాలని నినాదాలు చేస్తున్న మాజీ ఐఎఎస్ చిరంజీవులు, బాలరాజ్‌గౌడ్, ఐలి వెంకన్నగౌడ్, ఎలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్ తదితరులు

# బిఎల్ఓల ఫోన్ నంబర్లకు విస్తృత ప్రచారం కల్పించండి

## ఇసిఐనెట్‌లో 'బుక్-ఎ- కాల్స్ విత్ బిఎల్ఓ' సౌకర్యాన్ని ప్రోత్సహించండి

## ఓటరు మ్యాపింగ్, ధ్రువీకరణ మెరుగుదలకు చర్యలు: సిఇఓ సి.సుదర్శన్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 8:** బూత్ లెవల్ అధికారుల (బీఎల్ఓలు) ఫోన్ నంబర్లకు విస్తృత ప్రచారం కల్పించాలని, ఎన్నికల సంఘం ఈసీఐనెట్ వేదికపై అందుబాటులో ఉన్న బుక్-ఎ-కాల్స్ విత్ బీఎల్ఓ సౌకర్యాన్ని ప్రజలు విస్తృతంగా వినియోగించేలా ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) సి. సుధర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. జారీ చేసిన మెమోలో, ఈ సౌకర్యం ద్వారా ఓటర్లు తమకు సంబంధించిన బీఎల్ఓలను నేరుగా సంప్రదించి ఓటరు వివరాల్లో సవరణలు, ధ్రువీకరణ చేసుకునే వీలుంటుందని ఆయన పేర్కొన్నారు.



ప్రస్తుతం కొనసాగుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఇది కీలకంగా ఉపకరిస్తుందని వివరించారు. బీఎల్ఓల ఫోన్ నంబర్లలో మార్పులు జరిగితే వాటిని వెంటనే ఈఆర్వో నెట్ ప్లాట్‌ఫాంలో నవీకరించాలని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులకు (ఈఆర్వోలు) సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు క్షేత్రస్థాయిలో అమలుకు అవసరమైన ఆదేశాలు జారీ చేయాలని స్పష్టం చేశారు. ఈ ఆదేశాలను "అత్యంత ముఖ్యమైనవిగా పేర్కొన్న సీఈఓ, ఓటర్లు సులభంగా బీఎల్ఓలతో సంప్రదించి కాల్ బుక్ చేసుకునేలా ముందస్తుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ప్రస్తుతం పలు రాష్ట్రాల్లో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణల నేపథ్యంలో, ప్రజలతో ప్రత్యక్ష అనుసంధానం పెంపొందించడంతో పాటు ఓటర్ల జాబితాల ఖచ్చితత్వాన్ని మెరుగుపరచడమే ఈ చర్యల లక్ష్యమని ఎన్నికల సంఘం భావిస్తోంది.

# ఎపి ప్రభుత్వాన్ని ఎందుకు నిలదీయలేదు?

## టెలిమెట్రీల ఏర్పాటులో నిర్లక్ష్యంపై హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 8:** టెలిమెట్రీల ఏర్పాటు విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి పట్ల బిఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు ధ్వజమెత్తారు. కృష్ణా జలాల వినియోగ లెక్కలు తేల్చేందుకుగాను టెలిమెట్రీల కోసం కేటాయించిన రూ. 4.18 కోట్ల నిధులను కేఆర్ఎంబీ దారి మళ్లిస్తుంటే తెలంగాణ ప్రభుత్వం చోద్యం చూడటం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉద్దేశపూర్వకంగానే టెలిమెట్రీల ఏర్పాటు ప్రక్రియను ఆలస్యం చేస్తూ, కృష్ణా జలాల ఏపీ అక్రమ వినియోగానికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించడం దుర్మార్గమన్నారు. జూన్ 2016లో జరిగిన కేఆర్ఎంబీ సమావేశ నిర్ణయం ప్రకారం మొదటి దశలో 18 చోట్ల టెలిమెట్రి పరికరాలు ఏర్పాటు చేయగా, రెండో దశలో ఇంకా 9 చోట్ల ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ ఇప్పటివరకు అమలు కాకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. కేఆర్ఎంబీ నిర్ణయం ధిక్కరిస్తూ టెలిమెట్రి ఏర్పాటు కోసం నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తుంటే ఏపీ ప్రభుత్వాన్ని ఎందుకు నిలదీయలేదు..? ఎందుకు ఏపీ మీద ఒత్తిడి చేయకుండా మౌనంగా ఉన్నట్లు ? కృష్ణా జలాల విషయంలో తెలంగాణ హక్కులను కాపాడాల్సిన కేఆర్ఎంబీ, రాష్ట్ర ప్రభుత్వ అలసత్వాన్ని ఆసరాగా చేసుకొని తెలంగాణకు అన్యాయం చేస్తుంటే ఎందుకు స్పందించడం లేదు? అని హరీష్ రావు ప్రశ్నించారు.

తెలంగాణ, ఏపీ, కేంద్రంలోని బీజేపీ.. మూడు కలిసి టెలిమెట్రిల ఏర్పాటును నిర్లక్ష్యం చేస్తూ, తెలంగాణకు తీరని అన్యాయం చేస్తున్నాయి. టెలిమెట్రి ఏర్పాటు చేస్తున్నాం అని ప్రచారం చేసుకోవడమే తప్ప రెండేళ్ల నుండి కేంద్రం చేసింది ఏం లేదని హరీష్ రావు అన్నారు. సబ్ జ్యూడిస్ అని సాకులు చెప్పే కేంద్రానికి, సుప్రీంకోర్టులో కేసు ఉన్నప్పటికీ కేసీఆర్ 18 చోట్ల టెలిమెట్రిలు ఏర్పాటు చేసిన విషయం గుర్తు లేదా..? పోలవరం, నల్లమల సాగర్ విషయంలో మొద్దు నిద్ర ప్రదర్శించినట్లుగానే, టెలిమెట్రిల ఏర్పాటు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కావాలనే నిర్లక్ష్యంగా వ్యవహరించడం శోచనీయమన్నారు.

రూ. 4.18 కోట్ల రాష్ట్ర ప్రభుత్వ నిధులను వెంటనే రికవరీ అయ్యేలా చేసి, టెలిమెట్రీల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేసేందుకు కృషి చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కేవలం లేఖలు రాస్తూ కాలయాపన చేయకుండా, నిధులు మళ్లించిన కేఆర్ఎంబీపై కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నట్టు పేర్కొన్నారు.



గాయపడిన సైకోకు చికిత్స చేస్తున్న దృశ్యం

# మహబూబాబాద్ ఆస్పత్రిలో సైకో వీరంగం

## సెక్యూరిటీ గార్డును గాయపరిచిన వైనం

## అతడిని పట్టుకోవడంతో ఊపిరిపీల్చుకున్న రోగులు, సిబ్బంది

**మహబూబాబాద్ ప్రతినిధి,ప్రభాతవార్త:** మహబూబాబాద్ జిల్లా జనరల్ ఆసుపత్రిలో చికిత్స కోసం వచ్చిన బిహార్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి సైకోలా ప్రవర్తిస్తూ కత్తులతో వీరంగం సృష్టించిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే బిహార్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చి ఒక్కసారిగా సైకోలా మారి కత్తితో చెలరేగిపోవడంతో ఆసుపత్రికి వచ్చిన పెషంట్లు, ఆసుపత్రి సిబ్బంది భయభ్రాంతులకు గురై ప్రాణభయంతో పరుగులు తీశారు. సైకో ఆసుపత్రిలోని డ్రెసింగ్ గదికి వెళ్లి లోపల తలుపులు పెట్టుకొని గొంతుకోసుకున్నాడు. ఆసుపత్రి సెక్యూరిటి గార్డు శరత్‌కుమార్ ధైర్యం చేసి అతన్ని పట్టుకునే ప్రయత్నం చేయగా అతన్ని గాయపరిచాడు. ఆసుపత్రి సిబ్బంది తలుపులు పగులగొట్టి అతన్ని పట్టుకొని బందించి చికిత్స అదించారు. సైకోను పట్టుకోవడంతో అందరు ఊపిరిపీల్చుకున్నారు.

# యూరియా కొనుగోళ్లపై వ్యవసాయ శాఖ విచారణ

## క్షేత్రస్థాయికి హైదరాబాద్ నుండి ప్రత్యేక బృందాలు

**హైదరాబాద్, జనవరి 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పెద్ద మొత్తంలో యూరియా కొనుగోలు చేసిన రైతులపై వ్యవసాయ శాఖ దృష్టిసారించింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో కొందరు రైతులు ఒకేసారి 40 నుంచి 50 బస్తాల యూరియా కొనుగోలుయడంపై విచారణ నిర్వహించాలని నిర్ణయించింది. ప్రధానంగా తెలంగాణలోని నిర్మల్, నల్లగొండ, కొత్తగూడెం, కామారెడ్డి జిల్లాల్లో జరిగిన యూరియా లావాదేవీలపై అనుమానాలు రావడంతో క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని వ్యవసాయశాఖ డైరెక్టర్ డాక్టర్ బి.గోపి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని వ్యవసాయ కమిషనరేట్ కార్యాలయం నుంచి ప్రత్యేక అధికారుల బృందాలు రాష్ట్రంలోని ఆయా నాలుగు జిల్లాలకు తరలి వెళ్లాయి. ఈ అధికారుల బృందాలు ఆయా జిల్లాల్లో గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలన ప్రారంభించగా, శుక్రవారం కూడా విచారణ కొనసాగించనున్నాయి.

# విబి జి రామ్ జి చట్టానికి వ్యతిరేకంగా పోరాడాలి

## నరేగా చట్టం గొప్పతనంపై విస్తృతంగా కరపత్రాలు

## సిఎం రేవంత్‌రెడ్డి సభలను విజయవంతం చేయాలి

## పిసిసి విస్తృత సమావేశంలో మహేశ్‌కుమార్‌గౌడ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 8:** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వీబీజీ రామ్ జీ (వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) పై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. జీ రామ్ జీ చట్టానికి వ్యతిరేకంగా పోరాడాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. జీ రామ్ జీ చట్టానికి వ్యతిరేకంగా గ్రామ సభలు ఏర్పాటు చేద్దామని సూచించారు. గురువారం గాంధీ భవన్‌లో టిపీసీసీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ అధ్యక్షతన సమావేశం ప్రారంబమైంది. వందేమాతరం గీతంతో ఈ సమావేశం మొదలైంది. ఈ సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, మంత్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జీ రామ్ జీ చట్టంపై చర్చించారు. అలాగే టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశం అజెండా రూపొందించారు. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసే కుట్రను నిరసిస్తూ తీర్మానం చేశారు. వీబీ జీ రామ్ జీ పథకాన్ని వెనక్కు తీసుకుని మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా జనవరి 10వ తేదీ నుంచి ఫిబ్రవరి 25వ తేదీ వరకు నిరసన కార్యక్రమాలను చేపట్టాలని మార్గనిర్దేశం చేశారు. ఏఐసీసీ సూచన మేరకు జీ రామ్ జీ చట్టానికి వ్యతిరేకిస్తూ నిరసనలు ఉధృతం చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. సంక్రాంతి తర్వాత 20 నుంచి 30వ తేదీల్లో అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాలని సూచించారు. ఎంజీఎన్ఆర్ఈజీఏ చట్టం గొప్పతనం వివరిస్తూ ప్రతి నియోజకవర్గానికి ఐదు వేల చొప్పున కరపత్రాలు పంపిణీ చేయాలని మార్గనిర్దేశం చేశారు. ప్రతి కరపత్రం గ్రామా లు, వాడవాడకూ చేరాలని సూచించారు. విదేశాల్లో ఉన్న వ్యక్తులు కూడా ఉపాధి హామీ పథకం గురించి ఆరా తీశారని పేర్కొన్నారు. ఈ పథకం గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారని వెల్లడించారు. జీ రామ్ జీ చట్టంతో పేదల హక్కు కాలరాసేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. జీ రామ్ జీ చట్టానికి వ్యతిరేకంగా నిరసనలు చేస్తూ డీసీసీలు గ్రామసభలు నిర్వహించాలని ఆదేశించారు. జీ రామ్ జీ చట్టంపై సీఎం రేవంత్‌రెడ్డి ఆయా జిల్లాల్లో బహిరంగ సభల్లో పాల్గొంటారని తెలిపారు. కాంగ్రెస్ శ్రేణులు భారీగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. డీసీసీ పదవి బాధ్యత గలదని.. అన్ని కార్యక్రమాలను దగ్గరుండి పర్యవేక్షించాలని మహేశ్‌కుమార్‌గౌడ్ దిశానిర్దేశం చేశారు.





# 6 మున్సిపల్ కార్పొరేషన్లు, 117 మున్సిపాలిటీల ఓటర్ల జాబితా సిద్ధం

## 16న పోలింగ్ స్టేషన్ల వారీగా ఫొటోలతో కూడిన జాబితా విడుదల

## రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఇసి కుముదిని సమావేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 8:** రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఈ క్రమంలో మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్ల ఓటర్ల జాబితాపై తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణికుముదిని గురువారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితాపై చేపట్టిన చర్యలపై ఆమె వివరించారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల ప్రతినిధుల సూచనలు స్వీకరించారు. రాష్ట్రంలోని 32 జిల్లాల్లోని 6 మున్సిపల్ కార్పొరేషన్లలోని 366 వార్డులు,117 మున్సిపాలిటీలోని 2630 వార్డులకు ఓటర్ల తుది జాబితాను ఈనెల 12న ప్రచురిస్తున్న విషయాన్ని తెలియజేశారు. తెలంగాణ మున్సిపాలిటీ చట్టం 2019లోని సవరించిన సెక్షన్ 195-ఏ ప్రకారం వార్డు వారీ ఓటర్ల తుది జాబితాను ప్రచురిస్తున్నట్లు తెలిపారు. 13న పోలింగ్ స్టేషన్ల వివరాల ముసాయిదా జాబితాను ప్రచురించి వాటిని టీ-పోల్‌లో అప్‌లోడ్ చేస్తామని తెలిపారు. 16న పోలింగ్ స్టేషన్ల వివరాలతో పాటుగా ఫోటోతో కూడిన ఓటర్ల తుది జాబితాను ప్రచురిస్తారని తెలిపారు. వార్డులోని పోలింగ్ స్టేషన్ల వారీగా సంబంధిత మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు ప్రచురిస్తారని రాజకీయ పార్టీ ప్రతినిధులకు తెలియజేశారు.



విద్యార్థికి చెక్ అందజేసిన బిఆర్ఎస్ ఛీఫ్ కెసిఆర్

# మంచిగ సదువుకోండి.. బిడ్డ!

## ప్రమాదవశాత్తూ తండ్రులను కోల్పోయిన ఇద్దరు బడుగు బిడ్డలకు కెసిఆర్ భరోసా

## బిటెక్ ఇంజనీరింగ్ చదువు పూర్తి కోర్సుకు ఫీజు చెల్లింపు.. విడివిడిగా చెక్కులు అందజేత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 8:** విద్యుత్ ప్రమాదంలో ఇటీవల మరణించిన ఎర్రవెల్లి గ్రామ నివాసి పేద రైతు చిన్రాజు సత్తయ్య కుమారుడు, స్థానిక ఇంజినీరింగ్ కాలేజీలో బిటెక్ చదువుతున్న నవీన్, అదే గ్రామానికి చెందిన, ప్రమాదవశాత్తూ కొన్ని సంవత్సరాల క్రితం మరణించిన, మరో పేద రైతు పెద్దోళ్ల సాయిలు కొడుకు, బి టెక్ చదువుతున్న అజయ్‌లను చేరదీసి వారి ఇంజనీరింగ్ చదువు పూర్తికాలపు ఫీజులను బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ చెల్లించారు. వారికి అవసరమయ్యే పుస్తకాలు, కంప్యూటర్‌ల కోసం కూడా ఆర్థిక సాయం అందించారు. ఈ మేరకు వారికి విడి విడిగా చెక్కులు అందించారు. "కష్టపడి మంచిగ చదువుకోండి బిడ్డా.. మీరు కష్టపడి గొప్ప స్థాయిని చేరుకోవాలె. మీరు.. ఫీజుల కోసం భయపడొద్దు. యే సమస్య వచ్చినా నేనున్న' అంటూ భరోసా నిస్తూ కేసీఆర్ ఆశీర్వదించారు. కాగా.. విద్యుత్ ప్రమాదంలో మరణించిన చిన్రాజు సత్తయ్య కుటుంబానికి సంబంధిత విద్యుత్ శాఖ నుంచి చట్టపరంగా అందే ఆర్థిక తదితర సాయం గురించి పర్యవేక్షించి వారికి న్యాయం జరిగేలా చూడాలని తన వ్యక్తిగత కార్యదర్శి నాగేందర్ రెడ్డిని కేసీఆర్ ఆదేశించారు. కాగా... కుటుంబ పెద్దను కోల్పోయిన తమను గుర్తించి, ఆదరించి, ఆర్థికంగా ఆదుకుని, తమ పిల్లల చదువు, భవిష్యత్తు గురించి ఆలోచన చేసిన కేసీఆర్‌కు, పిల్లల తల్లులు చేతులెత్తి తమ కృతజ్ఞతను చాటుకున్నారు. తమ చదువుకోసం భరోసాగా నిలిచిన కేసీఆర్‌కు ఎర్రవెల్లి గ్రామానికి చెందిన పేద విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# అక్రమంగా విత్తనాల విక్రయాన్ని అడ్డుకోవాలి

## వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, జనవరి 8, ప్రభాతవార్త :** రాష్ట్రంలో అక్రమంగా విక్రయాలు జరుగుతున్న పత్తి విత్తనాలకు అడ్డుకట్ట వేయాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. ప్రధానంగా అనుమతిలేని హెచ్‌టి పత్తి విత్తులను రాష్ట్రంలోకి రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్‌లో గురువారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ టాస్క్ ఫోర్స్ టీమ్‌లతో నిఘా ఏర్పాటు చేయాలని చెప్పారు. కొందరు దళారులు తమ ప్రయోజనాల కోసం రైతులకు హెచ్‌టి పత్తి విత్తనాలను అనధికారకంగా రైతులకు అంటగడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో 20 అధీకృత కంపెనీలు, మరో 40 ప్రభుత్వం సర్టిఫైడ్ కంపెనీలు పత్తి విత్తనాలను సరఫరా చేస్తున్నాయన్నారు. గత ఏడాది ఈ కంపెనీల ద్వారా 1.10 కోట్ల పత్తి విత్తన ప్యాకెట్లను రైతుల కొనుగోలు చేశారన్నారు. కొందరు దళారులు కేంద్ర ప్రభుత్వం బ్యాన్ చేసిన హెచ్‌టి విత్తనాలతో పాటు, కల్తీ విత్తనాలను మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల నుంచి తీసుకొచ్చి తెలంగాణ సరిహద్దు ప్రాంతాలలోని రైతులకు అమ్ముతున్నట్లు గుర్తించామని వెల్లడిం చారు. రాష్ట్రంలో సరిహద్దు ప్రాంతాలలో టాస్క్ ఫోర్స్ టీంలను ఏర్పాటు చేసిన పత్తి విత్తనాల అక్రమ రవాణాలను అరికట్టాలని సూచించారు. హెచ్‌టి పత్తి విత్తనాలను రైతులు కొనకుండా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. ఈ సమా వేశంలో వ్యవసాయశాఖ సంచాలకులు డాక్టర్ గోపి తదితరులు పాల్గొన్నారు.



# మరో రూ.9,600 కోట్ల రుణానికి ఇండెంట్

## చివరి క్వార్టర్‌లో ఈ మొత్తం విడతలవారీగా సేకరణ

**హైదరాబాద్, జనవరి 8, ప్రభాతవార్త :** వచ్చే మార్చి నెలతో ముగియనున్న ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో తెలంగాణ ప్రభుత్వం మరో రూ.9,600 కోట్ల రుణాన్ని సమీకరించనుంది. ఈ మేరకు ఈ రుణానికి సంబంధించి రిజర్వ్ బ్యాంక్‌కు రాష్ట్ర ఆర్థిక శాఖ ఇండెంట్ పంపించింది. బహిరంగ మార్కెట్లో రిజర్వ్ బ్యాంక్ నిర్వహించే ఈ వేలంలో ఈ రుణ మొత్తాన్ని సమకూర్చుకోనున్నట్లు వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జనవరి నుండి మార్చి నెలాఖరు వరకూ జరిగే చివరి నాలుగో త్రైమాసికానికిగాను రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లను తనఖా పెట్టి ఈ మొత్తం రుణాన్ని విడతలవారీగా తీసుకుంటామని ఇండెంట్‌లో పేర్కొంది. ఇందులో భాగంగా ఈ నెలలో రూ.1,600 కోట్లు, ఫిబ్రవరిలో రూ.4 వేల కోట్లు, మార్చిలో మరో రూ.4 వేల కోట్లు ఇలా మొత్తం రూ.9,600 కోట్లు రుణ సమీకరణ చేస్తామమని వెల్లడించింది. ఈ చివరి క్వార్టర్‌లో తీసుకోబోతున్న మొత్తాన్ని బడ్జెట్ అంచనాలతో పోలిస్తే ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వ రుణ సమీకరణ 146 శాతానికి చేరుతోంది. కాగా దేశంలోని వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఆర్థిక అవసరాల కోసం 2026 జనవరి నుంచి మార్చి వరకు (నాలుగో త్రైమాసికం) జరుపబోయే మారెట్ రుణాల వివరాలను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తాజాగా వెల్లడించింది. రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదింపులు జరిపిన అనంతరం, ఈ మూడు నెలల కాలంలో దేశంలోని వివిధ రాష్ట్రాలు మొత్తం రూ.4,99,821 కోట్ల నిధులను మారెట్ రుణాల ద్వారా ఇవ్వాలని నిర్ణయించినట్టు రిజర్వ్ బ్యాంక్ పేర్కొంది.

# సంక్రాంతి నాటికి ధాన్యం కొనుగోళ్లు పూర్తి

## త్వరలో కొన్ని కేంద్రాల మూసివేత

**హైదరాబాద్, జనవరి 8, ప్రభాతవార్త :** వానాకాలం మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించి రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు మరో వారం రోజుల్లో పూర్తికానున్నాయి. ఇప్పటికే లక్ష్యంలో 95 శాతానికిపైగా రైతుల నుండి ధాన్యాన్ని కొనుగోలు చేసింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి వరంగల్, ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్ నగర్ జిల్లాల్లో అడపాదడపా ధాన్యం కేంద్రాలకు వస్తోంది. దీంతో మిగిలిన ధాన్యాన్ని సంక్రాంతి వరకు కొనుగోలు చేసి ఆ తర్వాత ఆయా కేంద్రాలను మూసివేయాలని రాష్ట్ర సర్కార్ నిర్ణయించింది. కాగా 2025-26 వానాకాలంలో రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 70లక్షల టన్నుల ధాన్యం కొనాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు గాను రాష్ట్రంలో మొత్తం 8,300 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం సేకరణ ప్రారంభించి, ఇప్పటివరకు 69 లక్షల టన్నులను కొనుగోలు చేసింది. ఈ విధంగా కొనుగోలు చేసిన ధాన్యంలో 37 లక్షల టన్నుల ధాన్యం దొడ్డు రకాలకు చెంది నవి కాగా, మరో 32 లక్షల టన్నులు సన్న రకాలు ఉన్నాయి. ఇందుకు గాను దాదాపు 13.70 లక్షల మంది రైతుల నుంచి ధాన్యం కొని రూ.16,942 కోట్లు ఖాతాల్లో జమచేసింది. అ లాగే సన్నధాన్యం విక్రయించిన రైతులకు ఇప్ప టివరకు రూ.926 కోట్ల బోనస్ చెల్లించింది.

# గాంధీ కుటుంబాన్ని తిట్టిన రేవంత్‌ను దుమ్ముంటే నిలదీయండి

## సోనియాను బలిదేవత అన్నది నిజం కాదా?: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 8:** తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ లోకసభ పక్ష నేత రాహుల్ గాంధీ ద్రోహం చేశారంటూ ఆరోపిస్తూ తాను చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ నేతలు మాట్లాడుతున్న మాటలపై కేటీఆర్ మరోసారి మండిపడ్డారు. రాహుల్ గాంధీని, సోనియా గాంధీని అడ్డగోలుగా తిట్టిన రేవంత్ రెడ్డిని తీసుకువచ్చి ముఖ్యమంత్రిని చేసుకున్న విషయాన్ని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు, నేతలు మరిచిపోయారని ఎద్దేవా చేశారు. గురువారం తెలంగాణ భవన్‌లో గొట్ట నరేందర్ యాదవ్ భారీ ఎత్తున తన అనుచరులు, కార్యకర్తలతో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ రాహుల్ గాంధీపై తాను చేసిన వ్యాఖ్యలు గతంలో రేవంత్ రెడ్డి అనేకసార్లు చేశారన్న విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. ఇదే రాహుల్ గాంధీని రేవంత్ రెడ్డి 'ముద్దపప్పు' అన్నాడని, అదే మాటను నేను రిపీట్ చేసినట్లు తెలిపారు. రేవంత్ రెడ్డి సోనియా గాంధీని 'వెయ్యి మందిని బలి తీసుకున్న బలిదేవత.. తెలంగాణ పిల్లల్ని చంపింది' అని అన్నాడని, అలాంటి వ్యక్తిని పక్కన పెట్టుకొని తాను చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ నేతలు అభ్యంతరం చెప్పడంపై సానుభూతి వ్యక్తం చేశారు. గాంధీ కుటుంబాన్ని రాహుల్ గాంధీని, సోనియా గాంధీని అడ్డగోలుగా తిట్టిన రేవంత్ రెడ్డిని పక్కన పెట్టుకొని మాలాంటి ప్రతిపక్ష నేతలపై మాట్లాడడం ఏమిటని కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులకు దమ్ముంటే రేవంత్ రెడ్డిపై ప్రతాపం చూపించాలని కేటీఆర్ సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డిని తప్పుపట్టడం చేతగాని కాంగ్రెస్ నేతలు ఇప్పుడు మాట్లాడుతున్న తీరు పైన కేటీఆర్ ఎద్దేవా చేశారు. 6 గ్యారంటీల అమలుపై రేవంత్ రెడ్డిని, రాహుల్ గాంధీని తప్పకుండా ప్రశ్నిస్తూనే ఉంటామని కేటీఆర్ మరోసారి స్పష్టం చేశారు. అడ్డగోలు వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డిని గట్టిగా అడిగితే 'లాగులో తొండలు విడిచిపెడతా, పేగులు మెడలో వేసుకుంటా, గుడ్లు పీకి గోలీలు ఆడుతా' లాంటి బూతులు మాట్లాడుతున్నాడని కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌లో జిహెచ్ఎంసీ ఎన్నికలను ప్రభుత్వం త్వరలో పెడుతుందన్న వార్తలు వస్తున్నాయని, ఈ ఎన్నికలను పార్టీ శ్రేణులంతా కలిసి సమిష్టిగా ఎదుర్కొని విజయం సాధించాలని ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్ నగరానికి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.9,700 కోట్ల రూపాయల అభివృద్ధి చేసిన విషయాన్ని ప్రజలకు ప్రస్తావించాలన్నారు. హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేసిన తీరు ప్రతి డివిజన్లోని ఓటర్లకు ప్రజలకు ప్రచారం చేయాలని కోరారు. శేర్లింగంపల్లి నియోజకవర్గంలో బిఆర్ఎస్ తరఫున గెలిచి కేవలం భూములను కాపాడుకోవడం కోసం రేవంత్ రెడ్డి పక్కన చేరి ఎమ్మెల్యే గాంధీ డబ్బులకు అమ్ముడు పోయాడన్నారు. ఎమ్మెల్యే పార్టీని ద్రోహం చేసి వదిలిపోయిన శేర్‌లింగంపల్లిలో ఎక్కడ సమావేశం పెట్టినా భారీ ఎత్తున పార్టీ కార్యకర్తలు, నాయకులు విజయవంతం చేస్తున్నారని అన్నారు. కేవలం పార్టీ మీద కేసీఆర్ మీద ఉన్న అభిమానంతోనే శేర్‌లింగంపల్లిలో జరుగుతున్న ప్రతి సమావేశం విజయవంతం అవుతుందని కేటీఆర్ తెలిపారు. 'హైడ్రా' పేరుతో నియోజక వర్గంలో పేదల ఇళ్లు కూలగొడుతున్న తీరును ప్రతి ఒక్కరికి తెలియజేయాలని కేటీఆర్ పిలుపు నిచ్చారు. గత రెండు సంవత్సరాలలో కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్‌కు చేసిన ద్రోహాన్ని, రద్దు చేసిన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రజలకు వివరించాలన్నారు.





# కెటిఆర్‌కు దమ్ముంటే ఖమ్మం జిల్లా నుంచి పోటీ చేయాలి: మంత్రి పొంగులేటి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 8:** కెటిఆర్‌కు దమ్ముంటే ఖమ్మం జిల్లా నుంచి పోటీ చేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సవాల్ చేశారు. జిల్లా పర్యటనలో వచ్చి గొప్పలు మాట్లాడటం కాదని దమ్ముంటే తన చాలెంజ్ స్వీకరించాలన్నారు. గురువారం మంత్రి పొంగులేటి విలేకరులతో మాట్లాడుతూ కెటిఆర్ ఖమ్మం టూర్‌లో భాగంగా బుధవారం ఆయన చేసిన విమర్శలపై మంత్రి పొంగులేటి ఫైర్ అయ్యారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎవరినో గెలిపించడం కాదు, కెటిఆర్ ఇక్కడకు వచ్చి ఎక్కడి నుంచి బరిలోకి దిగుతావో దిగాలని, కెటిఆర్ ముక్కు నేలకు రాసినా ఉమ్మడి ఖమ్మంలో గెలవడం మీ నాయన తరం కాదని, ఇక నీ వల్ల ఏమవుతుందని మంత్రి పొంగులేటి విమర్శించారు. కెటిఆర్ ముందు తన ఇంట్లో సమస్యను పరిష్కరించుకోవాలని మంత్రి పొంగులేటి హితవు పలికారు. రాష్ట్రంలో కాంగ్రెస్ గెలిచిన ఆరు నెలలకే ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు ప్రయత్నించారని మంత్రి పొంగులేటి సంచలన ఆరోపణలు చేశారు. ప్రభుత్వం జోలికి వస్తే కాంగ్రెస్ పార్టీ అంటే ఏమిటో చూపిస్తామన్నారు. కెటిఆర్ మతి భ్రమించి రాహుల్ గాంధీపై, గాంధీ కుటుంబంపై మాట్లాడుతున్నారని, సూర్యుడి పైకి ఉమ్మితే అది తిరిగి తన ముఖం మీదే పడుతుందన్న విషయాన్ని కెటిఆర్ మర్చిపోతున్నారన్నారు. అవినీతి, అక్రమాలు, దోపిడీలకు పేటెంట్‌గా ఉన్న కల్వకుంట్ల ఫ్యామిలీ గాంధీ కుటుంబం గురించి మాట్లాడేదని ఆయన మండిపడ్డారు. జాతీయ నాయకుడిని విమర్శిస్తే తాను జాతీయ నాయకుడిని అవుతానని తాపత్రయపడటం తప్పులేదు, కానీ, ఆశకు కూడా హద్దు ఉండాలన్నారు. ఎన్నికల్లో ప్రజలు వరు సగా దెబ్బకొట్టినా బుద్ధి తెచ్చుకోకుండా అవాక్కులు, చేవాకులు పేలుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ఎన్నికలైతే మీరు రెఫరెండం అని చెప్పారో ఆ ఎన్నికల్లోనే మీకు ప్రజలు గూబగుయ్యిమనిపించారని మంత్రి పొంగులేటి ఎద్దేవా చేశారు. జూబ్లీహిల్స్, గ్రామపంచాయతీ ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇచ్చారు, ఇప్పుడు రాబోయే మున్సిపల్ ఎన్నికలను సెమీ ఫైనల్స్ అంటున్నారు. దేనికి సెమీ ఫైనల్ అని మంత్రి పొంగులేటి ప్రశ్నించారు.

# సింగరేణి ఆస్పత్రుల్లో స్పెషలిస్టుల నియామకాలకు ఇంటర్వ్యూలు

**హైదరాబాద్, జనవరి 8, ప్రభాతవార్త :** సింగరేణి వ్యాప్తంగా ఉన్న ఆసుపత్రులలో స్పెషలిస్ట్ డాక్టర్ల నియామకాన్ని ఆ సంస్థ చేపడుతోంది. ఇందులో భాగంగా స్పెషలిస్ట్ డాక్టర్ల నియామకం నిమిత్తం సంస్థ యాజమాన్యం గురువారం నుండి రెండు రోజుల పాటు ఇంటర్వ్యూలను నిర్వహిస్తోంది. దీనికి సంబంధించి హైదరాబాద్ సింగరేణి భవన్‌లో తొలి రోజు గురువారం సింగరేణి పర్సనల్ విభాగానికి సంబంధించిన డైరెక్టర్ పొట్రు గౌతమ్ సారథ్యంలో ఇంటర్వ్యూలను నిర్వహించారు. జనరల్ సర్జన్ 4 పోస్టులు, గైనకాలజిస్ట్ 7 పోస్టులు, పిడియాట్రీషియన్ 4, చెస్ట్ ఫిజీషియన్ 3 పోస్టులు, ఈ ఎన్ టి సర్జన్ 2 పోస్టులకు ఇంటర్వ్యూలు జరిపారు. ఈ పోస్టులకు 74 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అలాగే ఈ నెల 9వ తేదీన మరో నాలుగు విభాగాలలో అనస్థీటిస్ట్ 7, పాథాలజిస్ట్ 1, హెల్త్ ఆఫీసర్ 3, సైకియాట్రిస్ట్ 1 పోస్టులకు ఇంటర్వ్యూలు జరపనున్నారు. కాగా సీనియర్ ప్రభుత్వ వైద్య నిపుణుల బృందం ఈ ఇంటర్వ్యూలను నిర్వహిస్తోంది. కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు ఉత్తమ వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో సింగరేణి యాజమాన్యం అన్ని ఆసుపత్రుల్లో ఉన్న ఖాళీలను గుర్తించి స్పెషలిస్ట్ డాక్టర్ల భర్తీ కోసం ఈ ఇంటర్వ్యూలను చేపట్టింది.

# మలేసియా ఓపెన్‌లో క్వార్టర్స్‌కు సింధు, సాత్విక్-చిరాగ్ జోడీ




**న్యూఢిల్లీ:** మలేషియా ఓపెన్ సూపర్ 1000లో భారత బ్యాడ్మింటన్ ఆటగాళ్ళు మిశ్రమ ప్రదర్శన ఇచ్చారు. రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పివి సింధు, పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్-చిరాగ్ ముందుకు సాగగా, లక్ష్య సేన్-ఆయుష్ శెట్టి గురువారం కౌలాలంపూర్‌లో తమ పురుషుల సింగిల్స్ ప్రచారాన్ని ముగించారు. సింధు ప్రపంచ 9వ ర్యాంకర్ జపాన్‌కు చెందిన టోమోకా మియాజాకిని 21-8, 21-13 తేడాతో 30 నిమిషాలకు పైగా జరిగిన మ్యాచ్‌లో ఓడించి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్ రాంకిరెడ్డి-చిరాగ్ శెట్టి జోడీ మలేషియాకు చెందిన ఆర్‌కె యాప్-జునైది ఆరిఫ్‌పై 21-18, 21-11 వరుస గేమ్‌ల విజయం సాధించి పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నారు. అంతకుముందు లక్ష్య-ఆయుష్ వారి వారి పురుషుల సింగిల్స్ రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్‌లలో ఓడిపోయారు. లక్ష్య 53 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో లీ చెయుక్ యియు చేతిలో 20-22, 15-21 తేడాతో ఓడిపోగా, ఆయుష్ శెట్టి 1 గంట 10 నిమిషాల పాటు జరిగిన హోరాహోరీ పోరులో టాప్ సీడ్ యు క్వి షి చేతిలో 18-21, 21-18, 12-21 తేడాతో ఓడిపోయాడు.

# నేటి నుండి మహిళల ప్రీమియర్ లీగ్

## టైటిల్ లక్ష్యంగా ఐదు టీమ్‌లు.. ముంబయి ఇండియన్, రాయల్ ఛాలెంజర్స్ మధ్య తొలి మ్యాచ్




**న్యూఢిల్లీ:** వుమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 2026 సీజన్‌కు రంగం సిద్ధమైంది. ఈ నెల 9 నుంచి ఈ మెగా టోర్నీకి తెరలేవనుంది. టైటిల్ లక్ష్యంగా ఇప్పటికే ఐదు ఫ్రాంచైజీలు తమ సన్నాహకాలను కూడా ప్రారంభించాయి. ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ మొదటి దశ ఈ నెల 9 నుంచి 17 వరకు నవీ ముంబయిలో జరుగుతుంది. రెండో దశ ఈ నెల 19 నుంచి ఫిబ్రవరి 5 వరకు వడోదర (బరోడా)లో జరుగుతుంది. ఫైనల్ మ్యాచ్ వడోదరలోనే జరుగుతుంది. నవీ ముంబైలో డిఫెండింగ్ ఛాంపియన్ ముంబై ఇండియన్స్‌కు, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు మధ్య మ్యాచ్‌తో ప్రారంభమవుతుంది. మొత్తం 22 మ్యాచ్‌లకు లీగ్ దశలో 20 మ్యాచులు జరుగుతాయి. ఎలిమినేటర్ ఫిబ్రవరి 3న జరుగుతుంది. తదుపరి రెండు రోజుల తర్వాత ఫిబ్రవరి 5న ఫైనల్ జరుగుతుంది. షెడ్యూల్‌లో కేవలం రెండు మాత్రమే డబుల్ హెడర్స్ మ్యాచులు ఉన్నాయి. పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉన్న జట్టు నేరుగా ఫైనల్‌కు చేరుకుంటుంది. రెండు, మూడో స్థానాల్లో ఉన్న జట్లు ఎలిమినేటర్ ఆడాల్సి ఉంటుంది. ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ 2026 కోసం మొత్తం 277 మంది ఆటగాళ్ల వేలానికి అందుబాటులో రాగా, ఇందులో 67 మంది ఆటగాళ్లను మాత్రమే ఆయా ఫ్రాంచైజీలు కొనుగోలు చేశాయి. ఇందులో 23 మంది విదేశీ ఆటగాళ్లు ఉన్నారు. ఫ్రాంచైజీలు ప్లేయర్ల కోసం మొత్తం రూ.40.8 కోట్లు ఖర్చు చేశాయి. కాగా 2023 సీజన్‌లో ముంబయి ఇండియన్స్ టైటిల్ నెగ్గగా, 2024లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు టైటిల్‌ను ఎగరేసుకొని పోయింది.

### పురుషుల హాకీ ఇండియా లీగ్..

# హెచ్‌ఐఎల్ జిసి విజయం

## 6-3 తేడాతో బెంగాల్ టైగర్స్ ఓటమి

**న్యూఢిల్లీ:** పురుషుల హాకీ ఇండియా లీగ్ 2025-26 పోరులో హెఐఎల్ జిసి 6-3 తేడాతో శ్రాచి బెంగాల్ టైగర్స్‌ను ఓడించింది. జిసి తరపున కేన్ రస్సెల్ (19, 36, 44), సామ్ వార్డ్ (19), సుదీప్ చిర్మాకో (38), జేమ్స్ అల్బెరీ (59) గోల్స్ సాధించగా, శ్రాచి బెంగాల్ టైగర్స్ తరపున కెప్టెన్ జుగ్రాజ్ సింగ్ (12), టామ్ గ్రాంబుష్ (40), క్రిస్టోఫర్ రుహ్రా (40) గోల్స్ సాధించారు. మొదటి క్వార్టర్ మిడ్‌ఫీల్డ్‌లో రెండు జట్ల మధ్య చాలా గట్టి పోటీతో ప్రారంభమైంది. 11వ నిమిషంలో శ్రాచి బెంగాల్ టైగర్స్‌కు వరుసగా నాలుగు పెనాల్టీ కార్నర్లు లభించాయి. కెప్టెన్ జుగ్‌రాజ్ సింగ్ (12) హెచ్‌ఐఎల్ గోల్ కీపర్ జేమ్స్ గోల్‌గా మార్చాడు. రెండవ క్వార్టర్‌లో హెచ్‌ఐఎల్ 19వ నిమిషంలో రెండు త్వరిత గోల్స్ చేసి ఆధిక్యాన్ని సాధించడంతో ఆట మలుపు తిరిగింది. మొదట, కేన్ రస్సెల్ (19) శక్తివంతమైన




డ్రాగ్‌ఫ్లిక్‌తో ఈ అవకాశాన్ని విజయవంతంగా మలిచాడు. బెంగాల్ (28) రెండు క్వార్టర్లు ముగిసే సమయానికి ఒక గోల్ వెనుకబడి ఉంది. మూడవ క్వార్టర్‌లో కేన్ రస్సెల్ మరోసారి గోల్స్ సంఖ్యను పెంచాడు. సుదీప్ చిర్మాకో (38) మూడు గోల్స్ ఆధిక్యాన్ని సాధించడంతో హెచ్‌ఐఎల్ ఫీల్డ్ గోల్‌తో వారి గోల్ స్కోరింగ్ ఫామ్‌ను పెంచుకుంది. అయితే టైగర్స్ 40వ మిషంలో రెండు త్వరిత గోల్స్ చేసి లోటును తగ్గించింది. టామ్ గ్రాంబుష్ (40) పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మార్చాడు. తరువాత క్రిస్టోఫర్ రుహ్రా (40) మూడవ గోల్‌ను నమోదు చేశాడు. కేన్ రస్సెల్ (44) తన మూడవ గోల్‌ను సాధించి రెండవ హ్యాట్రిక్‌ను పూర్తి చేశాడు. టైగర్స్‌కు (49) పెనాల్టీ కార్నర్ లభించింది. జేమ్స్ ఆల్బరీ (59) గోల్‌తో జిసి జట్టు 6-3 తేడాతో ఈ మ్యాచ్‌ను గెలుచుకుంది.



### న్యూజిలాండ్‌తో వన్డే:

# రిషబ్ ఔట్

## గిల్, అయ్యర్ ఇన్.. ఓపెనింగ్‌లో శుభ్‌మన్, రోహిత్

**న్యూఢిల్లీ:** న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌కు టీమిండియా సిద్ధమైంది. ఈ నెల 11న వడోదర వేదికగా జరిగే తొలి వన్డేతో ఈ సిరీస్‌కు తెరలేవనుంది. సౌతాఫ్రికాపై వన్డే సిరీస్ గెలిచిన టీమిండియా అదే జోరును కొనసాగించాలనే పట్టుదలతో ఉంది. ఇటీవల ఈ సిరీస్ బరిలోకి దిగే భారత జట్టును బీసీసీఐ ప్రకటించింది. గాయాలతో జట్టుకు దూరమైన కెప్టెన్ శుభ్‌మన్ గిల్, వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌లు తిరిగి జట్టులోకి వచ్చారు. రిషభ్ పంత్ తన స్థానాన్ని నిలబెట్టుకోగా, జస్‌ప్రీత్ బుమ్రా, హార్దిక్ పాండ్యాకు ఈ సిరీస్ నుంచి రెస్ట్ ఇచ్చారు. మహమ్మద్ షమీని పట్టించుకోని సెలెక్టర్లు మహమ్మద్ సిరాజ్‌ను ఎంపిక చేశారు. దాంతో టీమిండియా కాంబినేషన్ ఎలా ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది. కాగా ఈ సిరీస్‌లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్, రోహిత్ శర్మ ఓపెనింగ్ చేయనుండగా, విరాట్ కోహ్లీ మూడో స్థానంలో ఆడనున్నాడు. విజయ్ హజారే ట్రోఫీలో హాఫ్ సెంచరీతో ఫిట్‌నెస్ నిరూపించుకున్న శ్రేయస్ అయ్యర్ నాలుగో స్థానంలో బరిలోకి దిగనున్నాడు. ఐదో స్థానంలో వికెట్ కీపర్‌గా కేఎల్ రాహుల్ ఆడనుండగా, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ స్పిన్ ఆల్‌రౌండర్లుగా బరిలోకి దిగనున్నారు. పేసర్లుగా అర్ష్‌దీప్ సింగ్, మహమ్మద్ సిరాజ్, హర్షిత్ రాణా పేస్ బాధ్యతలు పంచుకోనున్నారు. స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా కుల్దీప్ యాదవ్ చోటుకు డోకా లేదు. పిచ్ పేస్ కండిషన్స్‌కు అనుకూలంగా ఉంటే వాషింగ్టన్ సుందర్ స్థానంలో పేస్ ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ రెడ్డి బరిలోకి దిగుతాడు. న్యూజిలాండ్‌తో తొలి వన్డే ఆడే భారత తుది జట్టు(అంచనా) శుభ్‌మన్ గిల్(కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్(వైస్ కెప్టెన్), కేఎల్ రాహుల్(కీపర్), రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్/ నితీష్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, మహమ్మద్ సిరాజ్..

# ఆస్ట్రేలియాదే 'యాషెస్'

## ఆఖరి టెస్టులో ఇంగ్లండ్‌కు ఘోర పరాభవం

**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్ 2025-26లో భాగంగా ఆఖరి టెస్ట్‌ను ఆస్ట్రేలియా విజయంతో ముగించింది. ఇప్పటికే సిరీస్ కైవసం చేసుకున్న ఆస్ట్రేలియా సిడ్నీ వేదికగా జరిగిన ఆఖరి టెస్ట్‌లోనూ 5 వికెట్లతో ఇంగ్లండ్‌ను చిత్తు చేసింది. ఈ సిరీస్‌లో పూర్తి ఆధిపత్యం చెలాయించిన ఆసీస్ 41తో యాషెస్ సిరీస్‌ను నిలబెట్టుకుంది. నాలుగో టెస్ట్‌లో గెలిచి ఉత్సాహం కనబర్చిన ఇంగ్లండ్‌కు ఆఖరి టెస్ట్‌లో ఘోర పరాభావం ఎదురైంది. 302/8 ఓవర్‌నైట్ స్కోర్‌తో ఆఖరి రోజు ఆటను ప్రారంభించిన ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 88.2 ఓవర్లలో 342 పరుగులకు కుప్పకూలింది. ఓవర్‌నైట్ బ్యాటర్, సెంచరీ హీరో జాకోబ్ బెతెల్( 265 బంతుల్లో 15 ఫోర్లతో 154)ను మిచెల్ స్టార్క్ ఔట్ చేశాడు. ఓవర్‌నైట్ స్కోర్‌కు అతను 12 పరుగులు మాత్రమే చేశాడు. జోష్ టంగ్(6) సాయంతో మాథ్యూ పోట్స్(18 నాటౌట్) కాసేపు పోరాడినా.. మిచెల్ స్టార్క్ ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌కు తెరదించాడు. జోష్ టంగ్‌ను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో మిచెల్ స్టార్క్(3/72), బ్యూ వెబ్‌స్టార్(3/64)మూడేసి వికెట్లు తీయగా.. మైఖేల్ నేసర్ ఒక వికెట్ పడగొట్టాడు. స్కాట్ బోలాండ్ రెండు వికెట్లు తీసాడు. 183 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని అందుకున్న ఆస్ట్రేలియా ముందు 160 పరుగుల లక్ష్యం నమోదైంది. వన్డే తరహా బ్యాటింగ్‌తో ఆసీస్ 31.2 ఓవర్లలో 5 వికెట్లకు 161 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. ట్రావిస్ హెడ్(29), జాక్ వెదరాల్డ్(34), మార్నస్ లబుషేన్(37) రాణించారు. ఇంగ్లండ్ బౌలర్లలో జోష్ టంగ్(3/42) మూడు వికెట్లు తీయగా.. విల్ జాక్స్ ఒక వికెట్ పడగొట్టాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 97.3 ఓవర్లలో 384 పరుగులకు ఆలౌటైంది. జోరూట్(160) సెంచరీతో చెలరేగగా.. హ్యారీ బ్రూక్(84) హాఫ్ సెంచరీతో రాణించాడు. ఆసీస్ బౌలర్లలో మైఖేల్ నేజర్(4/60) నాలుగు వికెట్లు తీయగా.. మిచెల్ స్టార్క్, స్కాట్ బోలాండ్ రెండేసి




వికెట్లు పడగొట్టారు. కామెరూన్ గ్రీన్, మార్నస్ లబుషేన్ తలో వికెట్ తీసారు. అనంతరం ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 567 పరుగుల భారీ స్కోర్ చేసింది. ట్రావిస్ హెడ్(163), స్టీవ్ స్మిత్(138) సెంచరీలతో చెలరేగగా.. బ్యూ వెబ్‌స్టర్(71 నాటౌట్) హాఫ్ సెంచరీతో రాణించాడు. ఇంగ్లండ్ బౌలర్లలో బ్రైడన్ కార్స్, జోష్ టంగ్ మూడేసి వికెట్లు తీయగా.. బెన్ స్టోక్స్ రెండు వికెట్లు పడగొట్టాడు.

# 90%కి పైగా ఉద్యోగార్థులు ఎఐ వినియోగం!

## లింక్డ్ఇన్ సర్వేలో తాజా అంశాలు వెల్లడి




**న్యూఢిల్లీ, జనవరి 8:** దేశంలోని 90 శాతానికి పైగా నిపుణులు ఉద్యోగాల కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను ఉపయోగించుకోవాలని యోచిస్తున్నారని ప్రముఖ ప్రొఫెషనల్ నెట్‌వర్క్ ప్లాట్‌ఫామ్ లింక్డ్ఇన్ తన తాజా నివేదికలో వెల్లడించింది. ఏఐ కేవలం ఉత్పాదకతను పెంచే సాధనంగానే కాకుండా, ఉద్యోగార్థులలో ఆత్మవిశ్వాసాన్ని నింపే సాధనంగా కూడా మారుతోందని పేర్కొంది. 66 శాతం మంది అభ్యర్థులు ఏఐ వాడకం వల్ల తమ ఇంటర్వ్యూ కాన్ఫిడెన్స్ పెరిగిందని అభిప్రాయపడ్డారు. అదే సమయంలో మరో ఆసక్తికరమైన విషయం కూడా బయటపడింది. దేశంలో 72 శాతం మంది చురుకుగా కొత్త ఉద్యోగం కోసం చూస్తున్నప్పటికీ, వారిలో 84 శాతం మంది తాము సిద్ధంగా లేమని తెలిపారు. నియామక ప్రక్రియలో ఏఐ వినియోగం పెరగడం, ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలు వేగంగా మారడం, తీవ్రమైన పోటీ వంటివి ఈ అభద్రతకు కారణాలుగా ఉన్నాయి. ప్రస్తుత నియామక ప్రక్రియ చాలా పెద్దదిగా ఉందని 77 శాతం మంది, ఇది వ్యక్తిగతం కానిదిగా మారిందని 66 శాతం మంది అభిప్రాయపడ్డారు. ఈ పరిణామాలపై లింక్డ్ఇన్ ఇండియా న్యూస్ సీనియర్ మేనేజింగ్ ఎడిటర్ నిరజితా బెనర్జీ స్పందించారు. భారత జాబ్ మార్కెట్‌లో కెరీర్లను నిర్మించడంలో, ప్రతిభను అంచనా వేయడంలో ఏఐ ఇప్పుడు ఒక పునాదిగా మారింది. తమ నైపుణ్యాలు అవకాశాలుగా ఎలా మారతాయో, నియామక నిర్ణయాలు ఎలా తీసుకుంటారో అభ్యర్థులకు స్పష్టత అవసరం. ఏఐ టూల్స్ ఈ అంతరాన్ని తగ్గించగలవని వివరించారు. 2022 ఆరంభంతో పోలిస్తే ప్రస్తుతం ఒక్కో ఉద్యోగానికి దరఖాస్తుదారుల సంఖ్య రెట్టింపు అయిందని, పోటీని తీవ్రతరం చేసిందని లింక్డ్ఇన్ డేటా చెబుతోంది. మరోవైపు అర్హులైన అభ్యర్థులను గుర్తించడం గతేడాదితో పోలిస్తే కష్టంగా మారిందని 74 శాతం మంది రిక్రూటర్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రాంప్ట్ ఇంజనీర్, ఏఐ ఇంజనీర్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వంటి ఉద్యోగాలకు ఈ ఏడాది డిమాండ్ శరవేగంతో పెరుగుతున్నట్లు లింక్డ్ఇన్ అంచనా వేసింది.

## వాణిజ్యం




# వెనిజులా చమురు కొనుగోలుకు రిలయన్స్ ఆసక్తి!

**జామ్‌నగర్, జనవరి 8:** భారత్‌లో ప్రైవేటురంగ చమురు దిగ్గజం రిలయన్స్ గురువారం తాము వెనిజులా చమురును కొనుగోలుచేసేందుకు యోచిస్తున్నట్లు వెల్లడించింది. అయితే అమెరికాయేతర బయ్యర్లను అనుమతిస్తే తాము కొనుగోలుచేస్తామని రిలయన్స్ వెల్లడించింది. వెనిజులాతో కలుపుకుని ప్రపంచ వ్యాప్తంగా ఇంధన వాణిజ్యంపై జరుగుతున్న చర్చల క్రమంలో రిలయన్స్ ఈప్రకటన చేసింది. ఇందుకు ప్రభుత్వ అనుమతులు కూడా సాధించాల్సి ఉంటుంది. అలాగే అంతర్జాతీయ ఆంక్షలు రిలయన్స్‌పై ప్రభావం పడకుండా ఉంటేనే తాము వె నిజులా చమురును కూడా కొనుగోలుచేసి శుద్ధిచేస్తామని ప్రకటించింది. జామ్‌నగర్‌లోప్రపంచంలోనే అతిపెద్ద చమురుశుద్ధి కర్మాగారం ఉన్న రిలయన్స్ రష్యా చమురుపై ఆంక్షలు ఎదుర్కొన్న క్రమంలో ఇపుడు వెనిజులా చమురు కొనుగోలుకు ఆసక్తి చూపిస్తోంది. రష్యా చమురు కొనుగోలుచేస్తున్నందుకుగాను భారత్‌పై అమెరికా అదనంగా 25శాతం సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. ఇపుడు రష్యాతో వాణిజ్యసంబంధాలున్న అన్ని దేశాలపైనా 500శాతం సుంకాలు విధించేందుకు ట్రంప్ ప్రతినిధులు, సెనేట్‌లలో బిల్లును ప్రతిపాదిస్తున్నారు. అదే జరిగితే రష్యా చమురుకొనుగోలుచేసే అన్ని దేశాలు ట్రంప్ కత్తికి గురికాక తప్పదు. గ్లోబల్ చమురు వాణిజ్య ధోరణులపై మంచి పట్టు ఉన్న రిలయన్స్ వీటన్నింటినీ అధిగమించేందుకు వెనిజులా చమురు కొనుగోలుచేయగలమని అయితే ట్రంప్ సుంకాలు ప్రభావం లేకుండా ఉంటే వెనిజులా చమురు మేమే కొంటామని ప్రకటించింది.



# ట్రంప్ 500శాతం సుంకాల ఎఫెక్ట్

## రూ.9 లక్షలకోట్ల కంపెనీల సంపద ఆవిరి!

## భారీ నష్టాలు చవిచూసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి, జనవరి 8:** దేశీయ స్టాక్ మార్కెట్‌లు గురువారం భారీ నష్టాలతో ముగిశాయి. సూచీలు వరుసగా నాలుగో సెషన్‌లోనూ నష్టాలను చవిచూశాయి. భారత్, అమెరికా మధ్య నెలకొన్న వాణిజ్య సందిగ్ధత సూచీలపై ఒత్తిడి పెంచింది. రష్యాకు చెక్ పెట్టేందుకు భారత్ తదితర దేశాలపై 500 శాతం సుంకాలు విధించేందుకు ఉద్దేశించిన బిల్లుకు ట్రంప్ ప్రభుత్వం సిద్ధం కావడం మార్కెట్ సెంటిమెంట్‌ను తీవ్రస్థాయిలోప్రభావితంచేసింది. దీనితో మార్కెట్లలో భారీ కంపెనీల షేర్లన్నీ నష్టాలు చవిచూసాయి.

అదే సమయంలో విదేశీ పెట్టుబడిదారులు అమ్మకాలకు మొగ్గు చూపడం, భౌగోళిక ఉద్రిక్తతలు వంటి అంశాలు మార్కెట్ నష్టాలకు మరింత ఆజ్యం పోశాయి. సెన్సెక్స్ ఒక దశలో 800 పాయింట్లకు పైగా నష్టపోయింది. చివరకి 780 పాయింట్ల నష్టంతో 84,181 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 రోజుల కనిష్ఠానికి చేరుకుని, 26,000 దిగువన ముగిసింది. మార్కెట్లు భారీగా నష్టపోవడంతో పెట్టుబడిదారుల సంపదగా భావించే బీఎస్ఈలో కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజే రూ.9 లక్షల కోట్లు ఆవిరైంది. బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.480 లక్షల కోట్ల నుంచి రూ.472 లక్షల కోట్లకు తగ్గింది. సెన్సెక్స్ ఉదయం 84,778 పాయింట్ల వద్ద నష్టాలతో ప్రారంభమైంది. రోజంతా అమ్మకాల ఒత్తిడితో నష్టాల్లోనే కొనసాగుతూ, 84,180 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 264 పాయింట్లు నష్టపోయి 25,876 పాయింట్ల వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటర్నల్, ఐసీఐసీఐ బ్యాంకు, బజాజ్ ఫైనాన్స్, బీఎస్ఎన్ఎల్ మినహా మిగిలిన అన్ని స్టాక్స్ నష్టాల్లో ముగిశాయి.

గడిచిన నాలుగు రోజుల్లో మొత్తంగా 1,500 పాయింట్లు (1.7 శాతం) నష్టపోయిన సెన్సెక్స్ రూ.9.19 లక్షల కోట్ల నష్టాల్ని మిగిల్చింది. దీంతో ప్రస్తుత భారత కంపెనీల విలువ రూ.472 లక్షల కోట్లకు దిగజారింది. 500శాతం సుంకాలు వేస్తామన్న ట్రంప్ హెచ్చరికలతో మార్కెట్లు భారీ నష్టాల్ని చవిచూడాల్సి వచ్చింది. విదేశీ ఇన్వెస్టర్లు అమ్మకాలకు పాల్పడటం, వెనెజులా సంక్షోభం వంటి అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు కూడా మార్కెట్ నష్టాలకు కారణాలుగా మారాయి. సెన్సెక్స్ నష్టాలతోనే ప్రారంభమైంది. ఏ దశలోనూ కోలుకోలేకపోయింది. ఒకదశలో సెన్సెక్స్ 800 పాయింట్ల వరకు నష్టపోయింది. ఇక డాలర్ తో రూపాయి మారకం విలువ 89.95గా ఉంది. దేశీయ సంస్థల్లో ఐసీఐసీఐ, బజాజ్ ఫైనాన్స్, ఎటెర్నల్, బీఈఎల్ వంటి సంస్థలు మినహా మిగిలిన సంస్థలు నష్టాల బాటలోనే ముగిశాయి. బిఎస్ఇలో 1039 కంపెనీల షేర్లు పెరిగితే ఏకంగా 3157 కంపెనీలషేర్లు డీలాపడ్డాయి. 170 కంపెనీలు మాత్రం స్థిరంగా కొనసాగాయి.

బిఎస్ఇలో మిడ్‌క్యాప్ సూచీ 1.99శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 1.97శాతం చొప్పున క్షీణించాయి. ఇక ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు ఫిబ్రవరి 25 నాటి సెటిల్‌మెంట్ 0.79శాతం దిగజారి ఔన్స్ ఒక్కంటికి రూ.1,36,924చొప్పున కొనసాగింది. కమోడిటీ మారెనకట్‌లో బ్రెంట్ ముడిచమురు మార్చి సెటిల్‌మెంట్ నాటికి 64 సెంట్లు పెరిగి బ్యారెల్‌కు 60.60 డాలర్ల ధరలు కొనసాగాయి.

# టాప్ 20 బ్యాంకుల్లో మార్కెట్‌క్యాప్ భారీ వృద్ధి!




**ముంబయి, జనవరి 8:** స్టాక్ ఎక్ఛేంజిల్లో జాబితా అయిన టాప్ 20 బ్యాంకుల్లో మార్కెట్ విలువలు మూడోత్రైమాసికంలో భారీ లాభాలు చూసాయి. మరింతగా వృద్ధి అంచనాలు కూడా పెరిగాయి. ఈక్విటీ సూచీలు పండుగ డిమాండ్; ఇటీవల జీఎస్టీ పన్నుల హేతుబద్ధీకరణ సంస్కరణలు వంటివి బ్యాంక్ సూచీలకు లాభాలు పండిస్తాయని ఎస్అండ్‌పి గ్లోబల్ మార్కెట్ ఇంటెలిజెన్స్ వెల్లడించింది.ప్రైవేటు బ్యాంకులు మరింతగా దూసుకుపోతాయని, ప్రభుత్వరంగ బ్యాంకులు మాత్రం గత త్రైమాసికంలో వెనకబడినట్లు తెలుస్తోంది. ఐడిఎఫ్‌సి ఫస్ట్‌బ్యాంకు భారీ పెరుగుదలను నమోదుచేసింది. 43.8శాతం త్రైమాసికంలో వృద్ధిని నమోదుచేసింద.ఇ ముంబయి కేంద్రంగా ఉన్న ఈ బ్యాంకు 17వ స్థానంనుంచి 13వ ర్యాంక్‌కు ఎగబాకింది. ఫెడరల్‌బ్యాంకు, ఎయు స్మాల్‌ఫైనాన్స్ బ్యాంకులు 38.6శాతం, 36.1శాతం చొప్పున వృద్ధిని నమోదుచేసాయి. టాప్ పది మార్కెట్ క్యాప్ రాంకులపరంగాచూస్తే హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు నంబర్‌వన్‌గానే నిలిచింది. 4.4శాతం పెరిగింది. ఐసిఐసిఐబ్యాంకు రెండోస్థానంలో నిలిచి 0.3శాతం క్షీణించింది. 12.6శాతం మార్కెట్ క్యాప్ వృద్ధితో భారతీయ స్టేట్‌బ్యాంకు భారీ దూకుడును కనబరిచింది. స్పెక్ట్రమ్ చివరిలో ప్రభుత్వరంగ ఇండియన్ ఓవర్సీస్‌బ్యాంకు, యూకో బ్యాంకులు మరింతగా వెనకబడ్డాయి. వాటి మార్కెట్ విలువలు 8.6శాతం, 3.4శాతం చొప్పున క్షీణించడం గమనార్హం.

# పుత్రశోకంలో వేదాంత అగర్వాల్

## సంపాదనలో 75% సమాజసేవకే వెచ్చిస్తా: వేదాంత చీఫ్ అనిల్ అగర్వాల్



**ముంబయి, జనవరి 8:** కుమారుడు అగ్నివేశ్ అగర్వాల్ (49) అమెరికాలో అకాల పాలవడంతో పుత్రశోకంలోమునిగిపోయిన అనిల్‌అగర్వాల్ తన సంపాదనలో 75 శాతం సమాజ సేవకు కేటాయిస్తానని గతంలో చేసిన వాగ్దానాన్ని ఆయన మరోసారి పునరుద్ఘాటించారు. అమెరికాలో స్కీయింగ్ ప్రమాదంలో గాయపడిన అగ్నివేశ్, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకుంటున్న సమయంలో గుండెపోటుతో కన్నుమూశారు. కుమారుడి మరణంతో తీవ్ర ఆవేదనకు గురైన అనిల్ అగర్వాల్, సోషల్‌మీడియాలో భావోద్వేగపూరిత పోస్ట్ పెట్టారు. నా కొడుకు అగ్ని మమ్మల్ని ఇంత త్వరగా విడిచి వెళ్ళిపోయాడు. నా స్నేహితుడిలా ఉండేవాడు. మా సంపాదనలో 75 శాతం సమాజానికి ఇస్తానని వాగ్దానం చేశాను. ఆ మాటను ఈరోజు మరోసారి పునరుద్ఘాటిస్తున్నాను. నువ్వు లేకుండా ఈ మార్గంలో ఎలా నడవాలో తెలియడం లేదు, కానీ నీ ఆలోచనలను ముందుకు తీసుకెళతాను" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మరణించిన అగ్నివేశ్, వేదాంత అనుబంధ సంస్థ తల్వండి సోబో పవర్ లిమిటెడ్‌కు ఛైర్మన్‌గా వ్యవహరించారు. సుమారు రూ. 27వేల కోట్ల సంపద కలిగిన అనిల్ అగర్వాల్‌కు అగ్నివేశ్‌తో పాటు కుమార్తె ప్రియా అగర్వాల్ కూడా ఉన్నారు. అగ్నివేశ్ మృతి పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ కష్టకాలంలో భగవంతుడు అగర్వాల్ కుటుంబానికి ధైర్యాన్ని ఇవ్వాలని ఆకాంక్షిస్తూ ట్వీట్ చేశారు. కుమారుడిని కోల్పోయిన తీవ్ర దుఃఖంలోనూ తన దాతృత్వ సంకల్పాన్ని అనిల్ అగర్వాల్ మరోసారి చాటడం గమనార్హం.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., IslamiaJr.College Compound, MGM Road, Warangal-506002. RNI No.64849 Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act.